epaper.vaartha.com WWW.VAARTHA.COM ఖమ్మం

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

8-5-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 96 పేజీలు: 8+16 వెల: 6.50

: fb.com/vaartha Digital

## సమర 'సిందూర'ం..






'సిందూర్'కు హనుమంతుడే స్ఫూర్తి

రక్షణమంత్రి రాజ్‌నాథ్




## ఆ 9 టార్గెట్లు ఇవే..

**ముజఫరాబాద్, మే 7:** పహల్గామ్ దాడి జరిగి సరిగ్గా 15 రోజులు గడిచిన తర్వాత భారతదేశం ప్రతీకారం తీర్చుకుంది. నేడు తెల్లవారు జామున 1:44 గంటల ప్రాంతంలో భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్తాన్, ఆక్రమిత జమ్మూ కాశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసింది. బహావల్‌పూర్‌లోని మసూద్ అజార్ రహస్య స్థావరంసహా తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై భారతదేశం బాంబు దాడి చేసింది. ఈ క్షిపణి దాడిలో ఇంటర్‌సర్వీసెస్ ఇంటెలిజెన్స్ మద్దతు ఉన్న లష్కరే తోయిబా, జైషే మొహమ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి భారత వ్యతిరేక ఉగ్రవాద >>2

పహాల్గాంలో 26 మందిని బలిగొన్న ఘటనకు 2 వారాల్లోనే దీటైన జవాబిచ్చింది భారత్. అర్ధరాత్రి దాయాది దేశంలోని ఉగ్ర స్థావరాలపై అత్యాధునిక క్షిపణులతో జరిపిన దాడిలో 100 మంది పైగా ఉగ్రవాదులు హతమైనట్లు సమాచారం. ఆడబిడ్డ సిందూరాన్ని చెరిపేసిన ముష్కరులను అరగంట వ్యవధిలో 'ఆపరేషన్ సిందూర్' పేరుతో అంతమొందించడం అపూర్వమే అని చెప్పాలి.

# ఉగ్రమూకలపై అగ్నివర్షం



## పాక్‌లోని స్థావరాలపై విరుచుకుపడిన భారత్

- అర్ధరాత్రి 23 నిముషాలు సాగిన 'ఆపరేషన్ సిందూర్'
- మొత్తం 9 ఉగ్ర క్యాంపులు ఏకకాలంలో ధ్వంసం
- క్షిపణులు, బాంబులు, ఆత్మాహుతి డ్రోన్లతో సర్జికల్ స్ట్రైక్
- భారీ సంఖ్యలో ఉగ్రవాదులు హతం
- పహల్గాం ఘటనకు జవాబిచ్చిన భారత్ సైనికులు

## 100 మంది ఉగ్రవాదులు హతం

### ఎమర్జెన్సీ ప్రకటించిన పాక్



**ఇస్లామాబాద్, మే 7:** ఆపరేషన్ సింధూర్‌పేరుతో పాకిస్థాన్ లోని ఉగ్ర స్థావరాలపై భారత్‌ఆర్మీ ఎయిర్ ఫోర్స్ నేవీలు సంయుక్తంగా మెరుపు దాడులు చేసింది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌తో పాటూ పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేశాయి. బహావల్‌పూర్, కోట్లీ, ముజఫరాబాద్‌పై క్షిపణి దాడులు జరిగాయి. ఈ దాడుల్లో సుమారు 100 మంది ఉగ్రవాదులు మృతి చెందినట్లు సమాచారం. మరికొంతమంది తీవ్రంగా గాయపడినట్లు తెలియవచ్చింది. ఈ నేపథ్యంలో ఏం చేయాలో తెలియని పరిస్థితిలో పాకిస్తాన్ ఎమర్జెనీ ప్రకటించింది.ఎమర్జెన్సీ లో ఏమేమి చేయాలో కార్యక్రమాలను చేపడుతోంది. కొద్ది సేపటి క్రితమే ఎమర్జెన్సీని ప్రకటించింది. అలాగే సరిహద్దు ప్రాంతాల్లో భారత్ సైనికులపై పాక్ సేనలు తిరగబడుతున్నాయి. ఈ ఘటనలో ఇరువైపులా ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం. రాత్రి జరిగిన ఆపరేషన్ సింధూర్‌కు ప్రతీకారంగా పాకిస్తాన్ ఇప్పుడు స్పందిస్తోంది. సరిహద్దులో ఉద్రిక్తత నెలకొంది. కాగా భారత్ సేనలు పాకిస్తాన్‌లోని 9 ఉగ్రవాద శిబిరాల్లో దాడులు చేసి వాటిని ధ్వంసం చేశారు. అయితే పహల్గాం దాడి తర్వాత ఉగ్రవాదులను పాక్ ప్రభుత్వం వేరే శిబిరాలకు తరలించింది. మదర్సాలలో పెట్టారు. దీంతో పాకిస్తాన్ ప్రభుత్వం తమ మదర్సాలు, మసీదులు, ప్రార్థనా మందిలపై భారత్ దాడి చేసిందని పాకిస్తాన్ ప్రజలను రెచ్చగొడుతూ.. అక్కడ జరిగిన నష్టాన్ని ప్రపంచం ముందుకు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోంది. మెడికల్ ఎమర్జెన్సీని కూడా ప్రకటించింది. ఆపరేషన్ సింధూర్ పేరుతో >>2



ఆపరేషన్ సిందూర్ వివరాలను బుధవారం న్యూఢిల్లీలో మీడియాకి వెల్లడిస్తున్న భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ
చిత్రంలో కల్నల్ సోఫియా ఖురేషి, ఐఎఎఫ్ వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్

**న్యూఢిల్లీ, మే 7:** పహల్గాంలో భారత మహిళల సింధూరాన్ని చెరిపేసిన ముష్కరులను అంతంచేసి భారత్ తన ఆయుధ సత్తాను ప్రపంచానికి చాటిచెప్పింది. కేవలం 25 నిమిషాల్లోనే 24 అత్యాధునిక క్షిపణులను ప్రయోగించి పొరుగుదేశం, శతృదేశం అయినా సాధారణ పౌరులకు ఏమాత్రం నష్టంలేని విధంగా భారత్ తన ఆపరేషన్ సింధూర్ ముగించింది. రాత్రి పొద్దుపోయాక 1.05 నిమిషాలకు ఒక్కసారిగా జరిగిన ఈప్రయోగాల్లో మొత్తం తొమ్మిది ఉగ్రవాద స్థావరాలు ధ్వంసం అయ్యాయి. లెక్కలు చెప్పేందుకు సైతం పాక్ వణుకుతున్న వేళ సుమారు 100 మందికిపైగా ఉగ్రవాదులు ఈ దాడిలో హతం అయ్యారు. ఆడబిడ్డ సింధూరాన్ని చెరిపేసిన ముష్కరులకు మహిళా శక్తి ఎలాంటిదో భారత త్రివిధ దళాలు సంయుక్తకార్యాచరణలో చూపించాయి. ప్రధాని మోడీ >>2



## మోడీ అంతుచూస్తాం..

### ప్రతీకారం తీర్చుకుంటాం.. లష్కరే అధినేత మసూద్ అజహార్ బహిరంగ లేఖ

**భావల్పూర్(పాకిస్తాన్), మే 7:** పాక్‌ఆక్రమిత కాశ్మీర్‌తోపాటు పాకిస్థాన్‌లోని పంజాబ్‌ప్రావిన్స్‌లో ఉన్న ఉగ్రవాద స్థావరాలను ఏకకాలంలో ద్వంసంచేసిన భారత్, పాకిస్తాన్‌కు కంటిమీద కునుకులేకుండాచేసింది. దీనికితోడు లష్కరే అధినేత మౌలానా మసూద్ అజహార్ >>2

## మసూద్ అజహార్ కుటుంబ సభ్యులు హతం 2

## ఒఎంసి కేసులో శ్రీలక్ష్మికి 'సుప్రీం'లో చుక్కెదురు



### తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు కొట్టివేత

### 3 నెలల్లో మళ్లీ విచారణ జరపాలని ఆదేశం

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** ఉమ్మడి ఎపిలో సంచలనం సృష్టించిన ఓబుళాపురం గనుల వ్యవహారంలో ఎపికి చెందిన సీనియర్ ఐఎఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఓబుళాపురం గనుల అక్రమ మైనింగ్ కేసులో శ్రీలక్ష్మికి విముక్తి కల్పిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం ధర్మాసనం బుధవారం కొట్టి వేసింది. ఈ కేసులో ప్రతి వాదనలను పరిగణలోకి తీసుకోకుండా హైకోర్టు తీర్పు ఇచ్చిందని సిబిఐ వాదనలతో >>2

## కరిగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్

### 22 మంది మావోయిస్టులు హతం

### మృతుల్లో 11 మంది మహిళలు

**చర్ల, మే 7, ప్రభాతవార్త:** ఆపరేషన్ కగార్‌లో భాగంగా బచావో కరిగుట్టలు ఆపరేషన్ చేపట్టిన భద్రతా బలగాలు నేటికి పదహారు రోజుల తర్వాత భారీ విజయాన్ని సాధించాయి. కరిగుట్టల్లో భుదవారం మావోయిస్టులకు భద్రతా బలగాల మద్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎదురుకాల్పుల్లో 22 మంది మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో 11 మంది మహిళలు ఉన్నారు. మృతుల్లో మావోయిస్టు అగ్రనేతలు ఉన్నట్లు మొదట ప్రచారం జరిగింది. కానీ చత్తీస్‌గఢ్ పోలీసు అధికారులు దృవీకరించలేదు. మావోయిస్టు రహిత >>2

## 4 చోట్ల 'మాక్ డ్రిల్'

### సంక్షోభంలో వ్యవహరించే తీరుపై ప్రజలకు తర్ఫీదు పర్యవేక్షించిన కొత్వాల్ ఆనంద్, ఫైర్ సర్వీస్ డిజి నాగిరెడ్డి



సికింద్రాబాద్ మేరేడ్‌పల్లిలో బుధవారం మాక్‌డ్రిల్ దృశ్యం

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** పహల్గాం ఉగ్రదాడి తరువాత దేశ వ్యాప్తంగా అనుకోని విపత్కర పరిస్థి తులు ఎదురైతే ఎలా వుండాలనే దానిపై కేంద్ర, రాష్ట్ర విభాగాలు బుధవారం దేశ వ్యాప్తంగా చేబట్టిన మాక్ డ్రిల్ హైదరాబాద్‌లో సాఫీగా సాగింది. నగరంలో ముందుగా ప్రకటించిన నాలుగు చోట్ల ఈ మా క్ డ్రిల్ చేబట్టారు. మాక్ డ్రిల్‌కు ముందు సిటీ కొత్వాల్ సి.వి ఆనంద్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి దీని ఉద్దేశాలను ప్రజలకు వివరించి అందరు సహకరించాలని కోరారు. అనంతరం సికింద్రాబాద్, గోల్కొండ కంటోన్మెంట్ (మిలటరీ ప్రాంతాలు), రక్షణ రంగ పరిశోధనా సంస్థలు వున్న కంచన్‌బాగ్, అణు పరిశో ధనా సంస్థ వున్న కుషాయిగూడ వద్ద ఈ మాక్ డ్రిల్ నిర్వహించారు. మాక్ డ్రిల్‌లో భాగంగా సాయం త్రం నాలుగు గంటలకు ఆయా ప్రాంతాలలో సైరన్‌లు మోగించారు. దీని తరువాత అక్కడి ప్రజలు పోలీసులు సూచించినట్లుగా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. ఇళ్లలో విద్యుత్ సరఫరా నిలిపి వేయడంతో పాటు గ్యాస్ స్టవ్‌లు >>2

## అత్యవసర సర్వీసుల్లో సెలవులు రద్దు

### మంత్రులు, అధికారులు విదేశ పర్యటనలు రద్దు చేసుకోవాలి

- దేశ సైన్యంతో మనమంతా ఉన్నామనే సందేశం ఇవ్వాలి
- నేటి సాయంత్రం సైన్యానికి సంఘీభావ ర్యాలీ
- ఆపరేషన్ సిందూర్ సమీక్షలో సిఎం రేవంత్



బుధవారం హైదరాబాద్‌లో సమీక్షలో మాట్లాడుతున్న సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే7:** అత్యవసర సర్వీస్‌లు అందించే విభాగాల ఉద్యోగుల సెలవులను రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దేశ సైన్యంతో మనమంతా ఉన్నామనే సందేశం ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. కేంద్రం ఆపరేషన్ సిందూర్ చేపట్టిన నేపథ్యంలో ముఖ్యమంత్రి బుధవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆర్మీ,పోలీస్,డిజాస్టర్ మేనేజ్‌మెంట్,ఇతర సంబంధిత వివిధ విభాగాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఢిల్లీలో ఉన్న డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్కకు సిఎం రేవంత్ ఫోన్ చేసి తక్షణం బయలుదేరి హైదరాబాద్ రావాల్సిందిగా సూచించారు. ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో దేశ రక్షణలో హైదరాబాద్ వ్యూహాత్మక ప్రాంతంగా ఉన్నందున,డిఫెన్స్ విభాగాలకు స్థావరంగా ఉన్నందున తాజా పరిస్థితులపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండేలా అన్ని విభాగాలకు సిఎం దిశా నిర్ధేశం చేశారు. ఈ సమయంలో రాజకీయాలు, పార్టీలకు తావులేదని స్పష్టంగా చెప్పారు. ఉద్యోగులు అంతా అందుబాటులో ఉండాలని, మంత్రులు, అధికారులు అందరూ అందుబాటులో ఉండాలన్నారు. మంత్రులు,అధికారులు విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు మీడియా, సోషల్ మీడియాలో అనవసర ప్రకటనలు చేస్తే కఠిన చర్యలు తప్పవని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండేలా టోల్ ఫ్రీ నంబర్ ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల నుంచి వచ్చి అనధికారికంగా నివసిస్తున్న వారిని తక్షణమే అదుపులోకి తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపైన కఠినంగా వ్యవహరించాలని అధికారులకు ముఖ్యమంత్రి కీలక ఆదేశాలు ఇచ్చారు. బ్లడ్ బ్యాంకుల్లో రక్త నిల్వలు సిద్ధం చేసుకోవాలన్నారు. అత్యవసర మెడిసిన్‌సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో బెడ్‌ల అందుబాటుపైనా ఎప్పటికప్పుడు సమాచారం తీసుకోవాలన్నారు. రెడ్‌క్రాస్‌తో సమన్వయం చేసుకోవాలని, ఆహార నిల్వలు తగినంత ఉండేలా చూడాలని వెల్లడించారు. సైబర్ సెక్యూరిటీ మీద అప్రమత్తంగా >>2



భారత సైన్యం జరిపిన 'ఆపరేషన్ సిందూర్' పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ధ్వంసమైన ఉగ్రవాదుల స్థావరాలు

# ఉగ్రమూకలపై అగ్ని వర్షం

>> ఉక్కుసంకల్పంముందు ఉగ్రవాదం విచ్ఛిన్నం అయింది. గడచిన తొమ్మిదిరోజులుగా ప్రధాని త్రివిధ దళాధిపతులతోపాటు, రక్షణ, హోం, భద్రతా సలహాదారులతో జరిపిన ఎడతెగని సమావేశాలు కార్యరూపంలోకి వచ్చాయి. కేవలం అర్ధగంట సమయంకూడా పట్టకుండానే తమ మొత్తం ఆపరేషన్ పూర్తిచేసి భారత త్రివిధ దళాలు తమ సత్తాఏంటో కేవలం దాయాదికే కాదు కయ్యానికి కాలు దువ్వుతున్న ఇతర ప్రపంచదేశాలకు కూడా చూపించాయి. నవవధువు హిమాంశు నర్వాల్ సింధూరాన్ని చెరిపేసిన ఉగ్రవాదులను వెంటాడి హతమారుస్తామనిచెప్పినట్లే భారత్ తన శక్తిని చాటిచెప్పింది. అందుకే ఈ దాడులకు 'ఆపరేషన్ సింధూర్' అని ప్రధాని స్వయంగాపేరుపెట్టారు. పేలుడు సమీపించిన ప్రాంతంలో ఉగ్రవాదులు భయంతో పరుగులుతీసారు. పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్, పంజాబ్‌ప్రావిన్స్‌ల్లో ఉన్న ఉగ్రస్థావరాలను ఏకకాలంలో ధ్వంసంచేసాయి. కేవలం ఉగ్రాదుల స్థావరాలు, ఉగ్రవాదులే లక్ష్యంగాజరిగిన ఈ దాడుల్లో జైషేముహ్మద్, లష్కరే తాయిబా, హిజ్‌బుల్ ముజాహిదీన్ వంటి సంస్థల స్థావరాలన్నీ కుప్పకూలిపోయాయి. పివోకేలోని ముజఫరాబాద్, కోట్లి, బహవల్పూర్, రావల్‌కోట; చక్స్వారీ, భీంబర్, నీలం వ్యాలీ, జీలం చక్వాలలోని ఉగ్రవాద కాంప్లెక్స్‌లపైనే ఈ దాడులునిర్వహించింది. భారత కాశ్మీర్‌ప్రాంతంలోకి చొరబాట్లను ప్రోత్సహించేందుకు రవాణా లాజిస్టిక్స్ పాయింట్లుగా ముజఫరాబాద్, భీంబర్‌లను గుర్తించిన భద్రతా దళాలు ఆపరేషన్ సింధూర్‌లో ధ్వంసంచేసాయి. శిక్షణా శిబిరాలు, గోదాములు, శిక్షణ ఇచ్చే వేదికలు, మొత్తం కూల్చివేసాయి. అయితే పాకిస్థాన్ సైనిక స్థావరాలు టార్గెట్ చేయగలిగే సత్తా ఉన్నా కూడా భారత్ వాటిజోలికి వెళ్లకుండా కేవలం ఉగ్రసంస్థలనే టార్గెట్‌గా ఎంచుకుంది. గుల్పూర్ ఉగ్రక్యాంప్ అంతర్జాతీయ సరిహద్దుకు 30 కిలోమీటర్లదూరంలో ఉంది. లష్కరేతాయిబాకు చెందినదని తేల్చారు. ఇక్కడినుంచే రాజౌరి పూంచ్‌ప్రాంతాల్లోకి చొరబడుతున్నట్లు తేలింది. ఈస్థావరంలోనే 2023, 2024 పూంచ్‌దాడుల్లో పాల్గొన్న ఉగ్రవాదులు శిక్షణపొందారని కూడా భారత్ గుర్తించింది. దాడిచేసిన తొమ్మిది కేంద్రాలు కూడా ఉగ్రవాదులకు స్వర్గధామాలుగా ఉన్నాయి. మర్కజ్ సుభాన్ అల్లాహ్ కేంద్రం భావల్‌పూర్‌లో జైషేముహ్మద్ కేంద్ర కార్యాలయం, మర్కజ్ తైబా మురిడ్కే లష్కరే తాయిబాకు స్థావరం కాగా సర్జాల్, తెహ్రా కలాన్ జైషేముహ్మద్‌కు కేంద్రంగా ఉంది. హిజ్‌బుల్‌ముజాహిదీన్ సంస్థ మెహమూనా జోయా సియాల్‌కోట్ కేంద్రంగా పనిచేస్తోంది. అలాగే లష్కరేకకు మస్జీద్ అహ్లా హదిత్ బామాలా, కోట్లిలోని మస్జీద్ అబ్బాస్‌జైషేముహమ్మద్, అక్కడే ఉన్న మస్కర్ రహీల్ షహీద్ హిజ్‌బుల్ ముజాహిదీన్‌లు పనిచేస్తున్నాయి. ఇక పీవోకేలోని ముజఫరాబాద్‌లో లష్కరేకు భారీ ఉగ్రశిక్షణా కేంద్రం ఉంది. షావైయి నల్లా శిబిరంగా పేరుపొందింది. అక్కడే జైషే సంస్థకు కూడా సైద్‌నా బిలాల్ శిబిరం కూడా నడుస్తోందనిభారత్ నిర్దిష్టమైన నివేదికలు అధ్యయనంచేసిన తర్వాతనే దాడులుచేసి సమూలంగా మట్టుబెట్టింది. ప్రధానిమోడీ ఈ ఆపరేషన్ పూర్తయ్యేంతవరకూ నిరంతరం పర్యవేక్షణచేసారు. మరోపక్క రక్షణ మంత్రి రాజ్‌నాథ్, హోంమంత్రి అమిత్‌షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌ధోభాల్‌లు సైతం దాడుల అనంతర పరిణామాలను నిత్యం పర్యవేక్షిస్తూ రాష్ట్రాలను అప్రమత్తంచేసారు.

ఓవక్క నిత్యం సమీక్షలు నిర్వహిస్తూ తెల్లవారితే యుద్ధసమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాక్‌డ్రిల్స్‌ను దేశంలోని 244 జిల్లాల్లో నిర్వహించే క్రమంలో ఈ దాడులు జరిగాయి. గడచిన పదిరోజులుగా భయపడుతూనే ఉన్న పాకిస్థాన్‌కు అంతుచిక్కని విధంగా దాడులునిర్వహించి భారత్ తన సింధూర శక్తిని నిరూపించింది. దాడుల వివరాలను విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీతోపాటు వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్, లెఫ్టినెంట్ కల్నల్ సోఫియా ఖురేషిలు సమగ్రంగా వివరించారు. దాడుల వివరాలను కూడా విడియోలు, చిత్రాలతో సరిహద్దుకు ఎంతెంత దూరంలో ఉన్నాయో కూడా సోదాహరణంగా వివరించారు.

## 'ఆపరేషన్ సిందూర్'కు హనుమంతుడే స్ఫూర్తి

### రక్షణమంత్రి రాజ్‌నాథ్

**న్యూఢిల్లీ, మే 7:** ఆపరేషన్ సిందూర్‌లో లంకా దహనం చేసిన హనుమంతుడే తమకు ఆదర్శమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్(పీవోకే)లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసినందుకు భారత సైన్యాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు. బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బిఆర్‌ఒ) మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆయన ఆపరేషన్ సిందూర్‌కు ఆర్మీకి పూర్తి స్వేచ్ఛనిచ్చిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో భారత సాయుధ దళాలు అందరినీ గర్వపడేలా చేశాయని రక్షణ మంత్రి అన్నారు. నిన్న రాత్రి భారత సాయుధ దళాలు తమ శౌర్యం, ధైర్యాన్ని ప్రదర్శించి కొత్త చరిత్రను సృష్టించాయన్నారు. భారత సాయుధ దళాలు కచ్చితత్వం, అప్రమత్తతతో వ్యవహరించాయని నిర్దేశించిన లక్ష్యాలను సరైన సమయంలో కచ్చితత్వంతో నాశనం చేశాయన్నారు. అంతేకాకుండా, సైన్యం మానవత్వంతో వ్యవహరించిందని, పౌరులకు ఎలాంటి నష్టం జరగకుండా చూసుకోవడంలో భారత సాయుధ దళాలు జాగ్రత్తలు తీసుకున్నాయన్నార. యావత్ దేశం తరపున సైనికులు, అధికారులను అభినందిస్తున్నట్లు చెప్పారు. సాయుధ దళాలకు మద్దతు ఇచ్చినందుకు ప్రధాని మోదీకి కేంద్ర మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. అశోక వనానికి వెళ్ళేటప్పుడు హనుమంతుడు అనుసరించిన సూత్రాన్ని ఈ దాడిలో తాము అనుసరించినట్లు రాజ్‌నాథ్ చెప్పారు. తమ అమాయక ప్రజలను చంపిన వారిని మాత్రమే తాము లక్ష్యంగా చేసుకున్నట్లు రక్షణ మంత్రి అన్నారు. తన గడ్డపై జరిగిన దాడికి ప్రతిస్పందించే హక్కును భారత్‌కు ఉందని రాజ్‌నాథ్ చెప్పారు. ఈసారి కూడా, మునుపటిలాగే తగిన సమాధానం భారత్ ఇచ్చినట్లు వివరించారు. మౌలిక వసతులకు ప్రాధాన్యత సరిహద్దుల్లో మౌలికవసతులు మెరుగుపరిచేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. భారత్‌లో అనేక దేశాల సంస్కృతులు కనిపిస్తాయని, భారత సంస్కృతి కూడా అనేక దేశాల్లో విస్తరించి ఉన్నదని చెప్పారు. వేల సంవత్సరాలుగా అనేక దేశాలతో మైత్రీభావంతో ఉన్నామని, భారత్‌కు వివిధ మార్గాల్లో అరబ్బులు, యూరోపియన్లు వచ్చారని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా మౌలిక వసతులు పెంచేందుకు కట్టుబడి ఉన్నామని మరోసారి మంత్రి స్పష్టం చేశారు.

## మసూద్ అజహర్ కుటుంబసభ్యులు హతం

**ఇస్లామాబాద్, మే 7:** భారత్ చేపట్టిన దాడుల్లో జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్ కుటుంబసభ్యులు హతమయ్యారు. 10 మంది కుటుంబసభ్యులు, మరో నలుగురు అనుచరులు మరణించినట్లు మసూద్ అజార్ వెల్లడించాడు. భారత్ దాడుల్లో మసూద్ అజార్ అక్క, బావ, మేనల్లుడు, అతని భార్యతో పాటు మరో ఐదుగురు మరణించినట్లు చెప్పాడు. జైషే మహ్మద్ ప్రధాన కార్యాలయం బహవల్‌పుర్‌లోని జామియా మస్జిద్ సుబాన్ అల్లాహ్ ప్రాంతంలో జరిగిన దాడిలో మరణించినట్లు తెలిపాడు.

భారత్ చేపట్టిన దాడుల్లో జైషే ప్రధాన కేంద్రం కూడా ఉంది. అంతర్జాతీయ సరిహద్దుకు 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న బహవల్‌పూర్‌లోని మర్కజ్ సుబాన్ అల్లాహ్‌పై భారత సైన్యం దాడి చేసింది. దీన్ని జైషే మహ్మద్‌కు ఆపరేషనల్ హెడ్‌క్వార్టర్‌గా గుర్తిస్తారు. పుల్వామా దాడి సహా భారత్‌పై చాలా కుట్రలకు ఇక్కడే ప్రణాళిక రచించారు. దీనినే మసూద్ తన ఇంటిగా కూడా వినియోగిస్తాడు. ప్రస్తుతం జేషే నెంబర్2గా ఉన్న ముఫ్తీ అబ్దుల్ రవూఫ్ అస్గర్, మౌలానా అమర్ ఇతరుల కుటుంబ సభ్యులు కూడా ఇక్కడే ఉంటున్నట్లు తెలుస్తోంది. సుమారు 600 మంది ఉగ్రవాదుల ఇళ్లు కూడా ఈ క్యాంపస్‌లోనే ఉన్నట్లు సమాచారం. అంతకుముందు పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంతో రగిలిపోయిన భారత్, పాకిస్థాన్‌లోని ఉగ్ర శిబిరాలపై బాంబు వర్షం కురిపించింది. ఆపరేషన్ సిందూర్‌లో అంతర్జాతీయ సరిహద్దుకు 100 కిలోమీటర్ల లోపు ఉన్న 9 ఉగ్ర స్థావరాలను భారత్ లక్ష్యంగా చేసుకుంది. ముఖ్యంగా జైషే మహ్మద్, లష్కరే తోయిబా, హిజ్బుల్ ముజాహిద్దీన్ వంటి ఉగ్రసంస్థలకు చెందిన ప్రధాన స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసి వాటిని నేలమట్టం చేసింది. దేశంలో జరిగిన పలు ఉగ్రదాడులకు ఈ క్యాంపుల్లోనే ప్రణాళిక జరిగిందని కర్నల్ సోఫియా ఖురేషి తెలిపారు. 2008 ముంబయి ఉగ్రదాడుల సూత్రధారి డేవిడ్ హెడ్లీ, అజ్మల్ కసబ్ శిక్షణ పొందిన ఉగ్రస్థావరంపైనా దాడి చేశామని వెల్లడించారు. పాక్ పౌరులకు హాని కలిగించని రీతిలో కేవలం ఉగ్ర శిబిరాలపైనే దాడులు చేశామని తెలిపారు. పాక్ సైనిక శిబిరాలను కూడా లక్ష్యంగా చేసుకోలేదని స్పష్టం చేశారు.

## భారీ ఎన్‌కౌంటర్

>> భారత్ ను చూస్తారని 2026 మార్చి కల్లా మావోల అంతం తప్పదని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటనకు అనుగుణంగా మావోల ఏరివేత షూరు చేసారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో ఫార్వర్డ్ బేస్ ల నిర్మాణం చేపట్టి వారిని కట్టడి చేసారు. అనంతరం బేస్ లను ఆధారంగా చేసుకొని అబూబ్ మఢ్ నేషనల్ ఏరియా పార్క్ లను చుట్టుముట్టి భారీ ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో అనేక ఎన్ కౌంటర్లు జరిగాయి. దీంతో మావోయిస్టు మనుగడ కష్టమైన తరుణంలో మూడు దఫాలుగా చర్చల ప్రతిపాధన చేసారు. అయినా కేంద్ర చత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు చర్చలకు నో చెప్పాయి. పరిస్థితి దాటిపోతుందన్న తరుణంలో సేఫ్ జోన్ కోసం మావోయిస్టులు అగ్రనేతలు కరిగుట్టలకు మకాం మార్చారు. ఆపరేషన్ కరిగుట్టలు చేపట్టిన భద్రతా బలగాలు విశృత కూబింగ్ చేపట్టాయి. నేటికి 16 రోజులైంది. ఇప్పటి వరకు 30 మావోయిస్టులు మృతిచెందారు. కర్రిగుట్టల పైకి చేరుకున్న భద్రతా బలగాలు అక్కడే మకాం వేసాయి. తాత్కాలికి బేస్ ను ఏర్పాటు చేసి నిత్యం కూబింగ్ ఆపరేటర్ చేపడుతున్నారు. హెలీకాప్టర్ డ్రోన్ల ద్వారా నిరంతరం పర్యవేక్షణ చేస్తూ మావోయిస్టు బంకర్లను స్థావరాలు గుర్తించి వాటిని నిర్వీర్యం చేస్తున్నారు. ఇప్పటికే చాలా గుట్టలను తమ ఆధీనంలోకి తీసుకున్న బలగాలు మరింత దూకుడుగా ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో ఎన్ కౌంటర్లు చోటుచేసుకుంటున్నాయి. కాగా మృతిచెందిన 22 మందిలో 19 మృతదేహాలను స్వాధీనం చేసుకొని వాటిని బీజాపూర్ తరలించారు. ఎన్ కౌంటర్ ను సిఆర్పీఎఫ్ డిజీ జ్ఞానేంద్ర ప్రతాప్ చత్తీస్‌గఢ్ ఎడిజీ నక్సల్స్ ఆపరేషన్ వివేకానంద సిన్హా సిఆర్పీఎఫ్ ఐజీ రాకేష్ అగర్వాల్ బస్తర్ ఐజీ సుందర్ రాజ్

## ఉగ్రవాదులు హతం

>> ఉగ్రస్థావరాలపై ఇండియన్ ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ కలిసి మెరుపు దాడులు చేశాయి. ఈ దాడుల్లో సుమారు 100 మందికిపైగా ఉగ్రవాదులు హతమైనట్లు సమాచారం. భారత్ దాడితో పాకిస్థాన్‌లో అలజడి రేగింది. లాహోర్, సియాల్ కోట్ ఎయిర్ పోర్టులను మూసివేసింది. ఇస్లామాబాద్, రావల్పిండిలో మెడికల్ ఎమర్జెన్సీ ప్రకటించింది. పాక్ అధికారులు వైద్య సిబ్బందికి సెలవులు రద్దు చేసి.. వెంటనే విధుల్లో చేరాలని ఆదేశాలు జారీ చేశారు. పాకిస్థాన్ లోని ప్రధానఎయిర్ పోర్టుల్లోనూ ఎమర్జెన్సీ ప్రకటించారు. ఇస్లామాబాద్, కరాచీ, లాహోర్, ముల్తాన్, స్కార్డు, ఫైసలాబాద్, పెషావర్ ఎయిర్ పోర్టుల్లో పాక్ ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించింది. ఇస్లామాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును మూసివేయడంతో అక్కడకు చేరాల్సిన ఫ్లైట్స్‌ను కరాచీకి మళ్లిస్తున్నారు. పాక్ గగనతలాన్ని పూర్తిగా మూసివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## అంతుచూస్తాం..

>> కుటుంబంలోని సుమారు 14 మంది చనిపోయారు. వారిలో సోదరి, బావ, మేనల్లుడు వంటి వారితో మొత్తం 10 మంది ఉండగా మరో నలుగురు సహాయకులు కూడా మృతిచెందారని స్వయంగా మసూద్‌ప్రకటించాడు. ఈ క్రమంలోనే ఆతడు విషం కక్కుతూ లేఖ విడుదలచేసాడు. అందులో తానుకూడా చనిపోయి ఉంటే బాగుండేదని మసూద్ అజర్‌ప్రస్తావించాడు. ప్రధాని మోడీ కాశ్మీర్ అంశంలో అన్ని నియమనిబంధనలు ఉల్లంఘించారని ఆక్రోశించాడు. భారత్‌పై తప్పక ప్రతీకారం తీర్చుకుంటామని తీవ్రస్థాయిలో హెచ్చరికలు చేసాడు. ప్రధానిమోడీపైనా, భారత్‌పైనా ప్రతీకారం తీర్చుకుంటామంటూ లేఖలో హెచ్చరించాడు. భారత్‌పై ఇక ఎంతమాత్రం జాలిచూపించబోమని బీరాలు పలికాడు. తన కుటుంబీకులు చనిపోయారని, దీనిపై తనకు భయంలేదని, నిరాశలేదని, దుఃఖం అసలే లేదని మసూద్ లేఖలు రాసాడు. మసూద్ లేఖలు ప్రస్తుతం దేశవ్యాప్తంగా వైరల్ అయ్యాయి.

## వారం - వర్జ్యం

తేది : 08-05-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్ల పక్షం
ఏకాదశి మ.12.31
ఉత్తరఫల్గుణి రా.9.07
వర్జ్యం ఉ.6.35 - ఉ.8.23
దు.మ.3.04-3.55
శుభసమయం: ఉ..5.15-5.55
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** ఆత్మీయుల నుంచి ఆహ్వానాలు అందుతాయి. వాహనాలు, గృహం కొనుగోలు చేస్తారు.

**వృషభం :** వ్యాపారాలలో ఒడిదుడుకులు తొలుగుతాయి. ఉద్యోగాలలో హోదాలు, పదోన్నతులు పొందుతారు.

**మిథునం:** చిన్ననాటి మిత్రులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు. సంఘంలో గౌరవం పెరుగుతుంది.

**కర్కాటకం :** సేవాకార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. వృత్తి, వ్యాపారాలలో లాభాలు పొందుతారు.

**సింహం:** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

**కన్య :** అనుకోని అవకాశాలు లభిస్తాయి. వాటిని సద్వినియోగం చేసుకొంటారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం.

**తుల :** ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారాలలో కొంత సామాన్యంగా ఉంటాయి. వస్తులాభం.

**వృశ్చికం:** ఉద్యోగాలలో సమస్యలు ఎదురైన అధిగమిస్తారు. కొత్త మిత్రులు పరిచయమై సాయం అందిస్తారు.

**ధనుస్సు:** దూరప్రాంతాల నుండి శుభ వార్తలు అందుకుంటారు. వ్యవహారాలలో విజయం సాధిస్తారు.

**మకరం:** కొత్త కాంట్రాక్టులు దక్కుతాయి. ఆస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. వాహన సౌఖ్యం.

**కుంభం:** వ్యాపారాలలో లాభాలు పొందుతారు. ఉద్యోగాలలో ప్రోత్సాహం లభిస్తుంది. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**మీనం:** పరిస్థితులు అనుకూలిస్తాయి. సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. వాహన యోగం. ధనలాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## ఆ 9 టార్గెట్లు ఇవే..

>> సంస్థల స్థావరాలన్నీ ధ్వంసమయ్యాయని సమాచారం. ఈ ఉగ్రవాద సంస్థలకు చెందిన అనేక శిక్షణా శిబిరాలు (మర్కజ్) లాంచ్ ప్యాడ్‌లు ప్రస్తుతం పాక్ సైనిక స్థావరాలకు సమీపంలో నడుస్తున్నాయి. భారతదేశంకు వ్యతిరేకంగా ఉగ్రవాద నెట్‌వర్క్‌ను నడుపుతున్న 9 స్థావరాలు పూర్తిగా ధ్వంసమయ్యాయని నిఘా వర్గాలు నిర్ధారించాయి.

**మర్కజ్ సుభాన్ అల్లా, బహావల్పూర్:** ఈ ఉగ్రవాద స్థావరం 2015 నుండి చురుకుగా ఉంది. ఇది జైష్‌ఎమహ్మద్ ప్రధాన కార్యాలయం అని కూడా చెబుతారు. ఈ రహస్య స్థావరం 2019 పుల్వామా దాడితో సహా జెఎం ఉగ్రవాద ప్రణాళికలతో ముడిపడి ఉంది. జెఎం చీఫ్ మౌలానా మసూద్ అజార్, ముఫ్తీ అబ్దుల్ రవూఫ్ అస్గర్, మౌలానా అమ్మర్, మసూద్ అజార్ కుటుంబ సభ్యులు మర్కజ్‌లో నివసించారు. ఇక్కడి నుండే మసూద్ అజార్ భారత్‌కు వ్యతిరేకంగా ప్రచారాలు చేస్తూ, యువత ఇస్లామిక్ జిహాద్‌లో చేరాలని ప్రసంగాలు చేసేవాడు. మర్కజ్ సుభాన్ అల్లాహ్ వద్ద తన కార్యకర్తలకు జెఇఎం క్రమం తప్పకుండా ఆయుధాలు, శారీరక, మతపరమైన శిక్షణను అందించింది.

**మర్కజ్ తైబా, మురిడ్కే:** 2000లో స్థాపించబడిన మర్కజ్ తైబా, పాకిస్తాన్‌లోని పంజాబ్‌లోని నంగల్ సహదాన్ మురిడ్కేలో ఉన్న అల్మా మేటర్, ఎల్‌ఇటి అతిపెద్ద శిక్షణా కేంద్రం. దీనిలో ఆయుధాలు, శారీరక శిక్షణా సౌకర్యాలు ఉన్నాయి. ప్రతి సంవత్సరం 1000 మంది విద్యార్థులు ఈ మర్కజ్‌లో చేరుతారని తెలుస్తోంది. ప్రతి సంవత్సరం లష్కర్ కోసం ఉగ్రవాద సంస్థలను సిద్ధం చేస్తుంది. మర్కజ్ తైబా కాంప్లెక్స్ లోపల మసీదు, అతిథి గృహం నిర్మాణానికి ఒసామా బిన్ లాడెన్ రూ. 10 మిలియన్ డాలర్లు ఆర్థిక సహాయం చేశాడు.

**సర్జల్ /తెహ్రా కలాన్:** పాకిస్తాన్‌లోని పంజాబ్‌లో నరోవాల్ జిల్లాలోని షకర్‌గఢ్ తహసీల్‌లో ఉన్న ఈ స్థావరం, జమ్మూ కాశ్మీర్‌లోకి ఉగ్రవాదుల చొరబాటుకు జైష్‌ఎమొహమ్మద్ (జెఎం) ప్రధాన కేంద్రం. జెఎం ఉగ్రవాదులు మహ్మద్ అద్నాన్ అలీ అలియాస్ డాక్టర్, కాషిఫ్ జాన్ ఆ ప్రదేశాన్ని క్రమం తప్పకుండా సందర్శించేవారు.

**మహ్మూనా జోయా సెంటర్, సియాల్‌కోట్:** హిజ్బుల్ ముజాహిదీన్ మహ్మూనా జోయా ఉగ్రవాద స్థావరం భుట్టా కోట్లి ప్రభుత్వ కేంద్రంలో ఉంది. దీనిని హిజ్బుల్ ముజాహిదీన్ క్యాడర్లను జమ్మూ ప్రాంతంలోకి చొరబడటానికి ఉపయోగిస్తారు.

**మర్కజ్ అహ్లే హదీత్ బర్నాలా:** బర్నాలా నగర శివార్లలో కోటే జమీల్ రోడ్డులో ఉన్న భీంబర్, జమ్మూ కాశ్మీర్‌లోని ఎల్‌ఇటి ప్రధాన శిక్షణా కేంద్రం. పూంచ్‌రాజౌరి రియాసి సెక్టార్‌కు ఎల్‌ఇటి ఉగ్రవాదులను ఆయుధాలను పంపడానికి ఉపయోగించేవారు.

**మర్కజ్ అబ్బాస్, కోట్లి:** ఇది పాకిస్తాన్‌లోని కోట్లిలో ఉన్న జెఇఎమ్ ముఖ్యమైన ఉగ్రవాద స్థావరం. జేఈఎం టాప్ కమాండర్ ముఫ్తీ అబ్దుల్ రవూఫ్ అస్గర్ సన్నిహితుడు హాఫీజ్ అబ్దుల్ షకూర్ అలియాస్ ఖారీ జర్రార్ ఈ మర్కజ్‌కి నాయకత్వం వహిస్తున్నారు. జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాద దాడులకు ప్రణాళికలు వేయడంలో, అమలు చేయడంలో ఖారీ జర్రార్ ప్రత్యక్షంగా పాల్గొన్నాడు.

**మస్కర్ రహీల్ షాహిద్, కోట్లి:** ఇది హిజ్బుల్ ముజాహిదీన్ పురాతన శిక్షణా కేంద్రం. ఇది దాదాపు 150-200 మంది హిజ్బుల్ ముజాహిదీన్ ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తుంది.

**షావై నల్లా క్యాంప్, ముజఫరాబాద్:** ఆక్రమిత కశ్మీర్‌లోని చెలబుండి వంతెన సమీపంలో ఉన్న ఈ ఉగ్రవాద స్థావరం లష్కర్ అత్యంత ముఖ్యమైన శిబిరాలలో ఒకటి. అజ్మల్ కసబ్ సహా 26/11 ముంబైలో దాడి చేసిన ఉగ్రవాదులు ఈ శిబిరంలోనే ఉగ్రవాద శిక్షణ పొందారు. ఈ శిబిరం ఎల్‌ఇటి కార్యకర్తల నియామకం, నమోదు, శిక్షణ కోసం ఉపయోగిస్తారు. ఇది 2000ల సంవత్సరం నుండి నడుస్తోంది.

**మర్కజ్ సయ్యద్నా బిలాల్:** ముజఫరాబాద్‌లోని ఎర్రకోట ఎదురుగా ఉన్న ఇది ఆక్రమిత కాశ్మీర్‌లోని జైష్ ప్రధాన కేంద్రం. ఈ స్థావరాన్ని ఉగ్రవాదులు జమ్మూ కాశ్మీర్‌లోకి ప్రవేశించే ముందు వారికి రవాణా శిబిరంగా ఉపయోగిస్తారు. భారతదేశం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను భారత సైన్యం, నావికాదళం, వైమానిక దళం నిర్వహించాయి. అదే సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆపరేషన్ సిందూర్‌ను నిరంతరం పర్యవేక్షించారు. ఈ దాడిలో 9 ఉగ్రవాద స్థావరాలు పూర్తిగా నాశనం అయ్యాయని సమాచారం

## 4 చోట్ల 'మాక్ డ్రిల్'

>> కూడా ఆపేశారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ, పోలీసు, రక్షణ శాఖ, సివిల్ డిఫెన్స్ విభాగాలకు చెందిన అధికారులు ప్రజలకు రక్షణ చర్యల గురించి వివరించారు. ఈ నాగులు చోట్ల వైమానిక దాడులు జరిగినట్లుగా ప్రజలకు చెబుతూ రక్షణ చర్యల గురించి వివరించారు. ఈ సమయంలో కొంద రు గాయపడినట్లుగా కింద పడిపోగా వారిని సహాయ సిబ్బంది అంబులెన్స్‌లలో ఎక్కించి ఆసుపత్రులకు తరలించారు. ఆపరేషన్ అభ్యాస్ పేరిట ఈ మాక్ డ్రిల్ నిర్వహించినట్లు సిటీ కొత్వాల్ ఆనంద్ మీడియాకు తెలిపారు. ఈ నాలుగు ప్రాంతాలలో మాక్ డ్రిల్ అరగంట పాటు సాగింది. సాయంత్రం నాలుగున్నర గంటలకు తిరిగి సైరన్ మోగగానే మాక్ డ్రిల్‌ను ముగించి అధికారులు, ఇతర సిబ్బంది వెళ్లిపోయారు. కాగా ఈ మాక్ డ్రిల్‌ను బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ నుంచి కొత్వాల్ ఆనంద్ స్వయంగా పర్యవేక్షించారు. ఇక్కడి నుంచి ఆయా ప్రాంతాలలో గల సిసి కెమెరాల ద్వారా సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కొత్వాల్ ఆనంద్ వచ్చే కొన్ని రోజుల పాటు సంబంధిత విభాగాల్లో ఎవరూ సెలవులు తీసుకోవద్దని కోరారు. పోలీసు, అగ్ని మాపక, వైద్య శాఖ సిబ్బంది తగిన విధంగా సన్నద్ధంగా వుండాలని ఆయన సూచించారు. ఆసుపత్రుల్లో అత్యవసర పరిస్థితులు ఎదురయితే రోగులకు వైద్యం అందించేందుకు ఔషధాలు అందుబాటులో వుంచుకోవాలని ఆయన తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ విభాగాలు తమ ఉపకరణాల పనితీరును సరిచేసుకుని సవ్యంగా వుండేలా చూసుకోవాలని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లో రక్షణ శాఖకు సంబంధించి చాలా విభాగాలు వున్నాయని, అందుకు అప్రమత్తం కావాల్సి వచ్చిందని ఆయన తెలిపారు. జంట నగరాలలో వున్న పాక్ పౌరులను దేశం నుంచి పంపించే ప్రక్రియ కొనసాగుతోందని, బంగ్లాదేశీయులను కూడా పంపించి వేస్తామని ఆనంద్ తెలిపారు. ఈ విషయంలో ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు. భద్రతా దళాలకు సంఘీ భావంగా గురువారం నాడు హైదరాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇదిలావుండగా బుధవారం నాడు దేశ వ్యాప్తంగా మాక్ డ్రిల్ వుందని కేంద్రం ప్రకటించగా అందుకు తగినట్లుగా అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే మంగళవారం అర్ధరాత్రి పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలపై సైన్యం దాడుల తరువాత హైదరాబాద్ సహా దేశ వ్యాప్తంగా సైనిక కంటోన్మెంట్లు వున్న చోట హై అలర్ట్ ప్రకటించారు.

## ఓఎంసి కేసులో శ్రీలక్ష్మికి 'సుప్రీం'లో చుక్కెదురు

>> ఏకీభవించిన సుప్రీం కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. దీంతో పాటు ఓబుళాపురం గనుల అక్రమ మైనింగ్ కేసులో శ్రీలక్ష్మి పాత్రను మళ్లీ విచారించాలని తెలంగాణ హైకోర్టును సుప్రీం కోర్టు ఆదేశించింది. ఈ విచారణ మూడు నెలల్లో ముగించాలని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. ఉమ్మడి ఎపి హయాంలో అనంతపురం జిల్లా ఓబుళాపురం మైనింగ్స్‌లో అక్రమాలు జరిగాయని సిబిఐ కేసు నమోదు చేయడం తెలిసిందే. ఈ కేసులో మొదటి ముద్దాయిగా వున్న గాలి జనార్ధన్ రెడ్డి సహా ఐదుగురికి సిబిఐ కోర్టు మంగళవారం నాడు ఏడేళ్ల జైలు శిక్ష విధించడం విదితమే. వీరిని మంగళవారం రాత్రి చంచల్‌గూడ జైలుకు తరలించారు.

## సెలవులు రద్దు

>> ఉండాలని, ఫేక్ న్యూస్ ప్రచారం చేసే వారిపైన ఉక్కుపాదం మోపాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఫేక్ న్యూస్ వల్ల ప్రజల్లో మరింత ఆందోళన పెరిగే అవకాశం ఉందన్నారు. ఫేక్ న్యూస్‌ను అరికట్టడానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని సూచించారు. రాజధానిలోని మూడు కమిషనరేట్ల పరిధిలో సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయాలన్నారు. అన్ని జిల్లా కేంద్రాలతో పాటు సున్నిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండటంతో పాటు భద్రతను పెంచాలని వివరించారు. హైదరాబాద్‌లోని అన్ని విదేశీ రాయబార కార్యాలయాల దగ్గర భద్రతను పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఐటీ సంస్థల దగ్గర భద్రతను పెంచాలని, హైదరాబాద్ నగరంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. అవసరమైతే పీస్ కమిటీలతో మాట్లాడాలని సంబంధిత అధికారులకు సూచించారు. పాత నేరస్తుల పట్ల పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. భారత సైన్యానికి సంఘీభావంగా గురువారం సాయంత్రం 6 గంటలకు ర్యాలీ నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. సచివాలయం నుంచి నెక్లెస్ రోడ్ వరకు జరిగే ర్యాలీలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, అధికారులు పాల్గొననున్నారు.

## సైన్యానికి సెల్యూట్: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే7:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం మిస్సైళ్లతో మెరుపు దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలపై మెరుపు దాడులు చేసిన భారత సైన్యానికి సెల్యూట్ చేస్తున్నానని కేటీఆర్ పేర్కొన్నారు. తీవ్రవాద శిబిరాలను పూర్తిగా తుడిచిపెట్టే ప్రక్రియలో వారికి మరింత బలం చేకూరాలి.. ప్రతి ఒక్కరం భారత సైన్యానికి అండగా ఉందాం అని అన్నారు. చివరగా జైహింద్ అని కేటీఆర్ పేర్కొన్నారు.

## హై అలర్ట్ రాష్ట్రాలతో హోంమంత్రి అమిత్‌షా సమీక్ష

**న్యూఢిల్లీ, మే 7:** పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత సైన్యం విరుచుకుపడిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా భద్రతా బలగాలు, పోలీసులు అప్రమత్తమయ్యారు. ముందస్తు జాగ్రత్తగా దేశంలోని పలు ముఖ్య నగరాల్లో భద్రతా బలగాలు భారీగా మోహరించాయి. పంజాబ్, రాజస్థాన్‌లో హై అలర్ట్ ప్రకటించారు. ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం రెడ్ అలర్ట్ జారీ చేసింది. పోలీసులు, రక్షణ శాఖ వర్గాలతో సమన్వయం చేసుకొని ముందుకుసాగాలని ప్రజలకు కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని యూపీ డీజీపీ సూచించారు. సురక్షిత ప్రాంతాలకు తరలింపు మరోవైపు ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ప్రకటించారు. సరిహద్దు గ్రామాల ప్రజలను ఖాళీ చేయించి, సురక్షిత ప్రాంతాలకు, బంకర్లకు తరలించాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. జమ్మూలోని భారత సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం చేసినట్లు జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. సీఎం ఒమర్ అబ్దుల్లాతో కశ్మీర్‌లో పరిస్థితిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో నివసించే ప్రజలకు అన్ని భద్రతా చర్యలు కల్పించాలని సైన్యానికి ఆదేశాలు జారీ చేశారు.



మేకగూడలో గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే తదితరులు

## సైనికుల సాహసానికి సెల్యూట్

### దేశ ప్రజల సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిది: మంత్రి శ్రీధర్ బాబు

**నందిగామ, మే 7 ప్రభాతవార్త:** భారతదేశ ప్రజల సంరక్షణ, బాధ్యత ప్రతి ఒక్కరి దని, దేశ సరిహద్దుల్లో సాహసం చేస్తున్న మన సైనికులకు సెల్యూట్ అని రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. బుధవారం నందిగామ మండలంలో నాట్కో సౌజన్యంతో సుమారు 5 కోట్ల రూపాయల వ్యయంతో తాటిగడ్డ తండ, సంఘిగూడ, నందిగామ గ్రామాలలో నిర్మించిన అంగన్వాడి కేంద్రాలను మంత్రి శ్రీధర్‌బాబు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మేకగూడలో కొత్తగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చదువులను ప్రోత్సహిస్తూనే, వైద్యానికి పెద్దపీట వేసిన నాట్కో సేవలు అభినందనీయ మన్నారు. యుద్ధ సమయంలోదేశ సమగ్రతను కాపాడాల్సిన బాధ్యత అందరిది, సైన్యం చేస్తున్న చర్యలకు రాష్ట్ర ప్రజలతో పాటు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. దేశ సంరక్షణలో కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీతో పాటు తాము వెన్నంటే ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్, నాట్కో ట్రస్ట్ ప్రతినిధులు లక్ష్మీ నారాయణ, సత్యనా రాయణ, సాంబశివరావు, ప్రసాద్, తహసిల్దార్ రాజేశ్వర్, ఎంపీడీవో సుమతి, మాజీ ఎంపీటీసీ రాజు నాయక్, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జంగా నరసింహులు, కొమ్ము కృష్ణ, దేవల్లె కుమార్ గౌడ్, చంద్రపాల్ రెడ్డి, మాజీ సర్పంచులు పాండురంగ రెడ్డి, జేటావత్ రాజు నాయక్, కాంగ్రెస్ నేతలు జిల్లెల్ల రామ్ రెడ్డి, పి రఘు, పర్వతాలు, సుక్య నాయక్,బండారి రాజు తదితరులున్నారు.

## ‘ఆపరేషన్ సిందూర్’ అభినందనీయం

### బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**హైదరాబాద్, మే 7 ప్రభాతవార్త:** భారత సైన్యం ఆపరేషన్ సింధూర్‌ను చేపట్టడం అభినందనీయని బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. పాకిస్తాన్‌లోని మూడు ఉగ్రవాద సంస్థలకు చెందిన తొమ్మిది శిబిరాల్లో దాక్కున్న టెర్రరిస్టు లను పెద్దసంఖ్యలో హతమార్చిన భారత సైన్యానికి అభినందనలు తెలిపారు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదుల ఏరివేతకు భారత త్రివిధ దళాలు ఆపరేషన్ సింధూర్‌ను చేపట్టడం పట్ల దేశప్రజలంతా గర్వపడుతున్నారని అన్నారు. ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణిచివేసేలా చర్యలు తీసుకోవాలంటూ సైన్యానికి ఆదేశించడం ద్వారా భారత ప్రధాని మోదీ తీసుకున్న సాహసోపేత నిర్ణయం ప్రపంచానికి దిక్సూచిగా నిలువనుందన్నారు. భారతీయులకు హాని తలపెట్టాలని చూసే దుష్ట శక్తులను మోదీ ప్రభుత్వం ఎప్పటి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టదని, వాటి అంతు చూస్తుందని ఆపరేషన్ సింధూర్ ద్వారా ప్రధాని మోదీ మరోసారి నిరూపించారని అన్నారు. ఆత్మగౌరవ భారత్, దుర్భేద్య భారత్‌ను తన సమర్థ నాయకత్వం ద్వారా ఆవిష్కరిస్తున్న ప్రధాని మోదీకి, భారత సైన్యానికి మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు.

## ఉద్రిక్తత పరిస్థితి ఉంటే ‘మిస్ వరల్డ్’ పోటీల షెడ్యూల్ మారొచ్చు

**హైదరాబాద్, మే7,ప్రభాతవార్త:** పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత భారత ఆర్మీ ఆపరేషన్ సింధూర్‌ను చేపట్టింది. పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రస్థావరాలపై దాడులు నిర్వహించింది. దీంతో భారత్, పాక్ మధ్య యుద్ధానికి తొలి అడుగు పడి నట్లయ్యింది. ఈ పరిణామాలు భారత్, పాకిస్తాన్ మధ్య సంబంధాలను మరింత ఉద్రిక్తతకు దారి తీయనుంది. ఈ క్రమంలో ప్రభుత్వం ప్రజలకు యుద్ధం అనేది జరుగుతున్న నేపథ్యంలో ఎలా ఉండాలి, ఎలా వ్యవహరించాలి, ప్రమాదాన్ని ఎలా ఎదుర్కోవాలి అనే విషయాలపైన కేంద్ర ప్రభుత్వం మాక్ డ్రిల్స్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. తెలంగాణలో హైదరాబాద్ వేదిక గా మిస్ వరల్డ్ పోటీలు జరుగనున్నాయి. సుమారు 120 దేశాల నుంచి ప్రతిని ధులు ఈ పోటీలను వస్తున్నారు. ఈ వేడుకలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం ఇప్పటికే ఘనంగా ఏర్పాట్లు చేసింది. అయితే, ఉద్రిక్తత నేపథ్యం లో ఈపోటీలపై అనిశ్చితి నెలకొంటుందా? అనే ప్రశ్నలు వస్తున్నాయి. భద్ర తాపరంగా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటే మిస్‌వరల్డ్ పోటీల నిర్వ హణ కుసంబంధించిన షెడ్యూల్‌మార్చే అవకాశం లేకపోలేదంటున్నారు. ఇప్పటికే ప్రపం చ నలుమూలల నుంచి పోటీదారులంతా హైదరాబాద్ నగరానికి చేరుకున్నారు.


## గాలి జనార్దన్ రెడ్డి మరో ముగ్గురిని సాధారణ ఖైదీలుగానే పరిగణించిన జైళ్ల శాఖ

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** ఉమ్మడి ఏపి హయాంలో సంచలనం రేపిన ఓబుళాపురం గనుల అక్రమ మైనింగ్ కేసులో నాంపల్లి సీబీఐ కోర్టు ఏడేళ్ల జైలు శిక్ష విధించిన దరిమిలా కర్ణాటక బిజెపి ఎంఎల్ఏ గాలి జనార్దన్ రెడ్డి, ఆయన సోదరుడు గాలి శ్రీనివాస్ రెడ్డి, వీరి సన్నిహితుడు మెఫజ్ అలీఖాన్, నాటి గనుల శాఖ డైరెక్టర్ రాజగోపాల్‌లను చంచల్‌గూడ జైల్లో సాధారణ ఖైదీలుగానే పరిగణిస్తున్నట్లు జైళ్ల శాఖ అధికారులు తెలిపారు. ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో ఈ నలుగురికి మంగళవారం నాడు నాంపల్లి సిబిఐ కోర్టు ఏడేళ్ల శిక్ష విధించడం తెలిసిందే. అనంతరం వీరిని మంగళవారం రాత్రి భద్రత మధ్య నాంపల్లి కోర్టు నుంచి చంచల్‌గూడ జైలుకు తరలించారు. వీరిని ప్రత్యేక సెల్‌లో ఉంచలేదని, శిక్షపడ్డ ఇతర ఖైదీలతో సమానంగానే చూస్తున్నా మని అధికారులు తెలిపారు. గాలి జనార్దన్ రెడ్డి ఎంఎల్ఏ అయినప్పటికీ ఆయన కోసం ప్రత్యేకంగా ఎలాంటి వసతులు కల్పించలేదని అధికారులు వెల్లడించారు. అయితే శిక్ష పడ్డ ఖైదీలకు కేటాయించే నంబర్లను వీరికి కేటాయించేందుకు అధికారులు నిరాకరించారు. వీరికి తెలుపు దుస్తులు ఇవ్వనేట్లు వివ రించారు. వీరికి ఒకవేళ ప్రత్యేక వసతులు కల్పించాలని కోర్టు ఆదేశిస్తే అప్పుడు ఏర్పాట్లు చేస్తామని వారు తెలిపారు.

## టిజిట్రాన్స్‌కో డైరెక్టర్ జగత్‌రెడ్డి రాజీనామా

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** తెలంగాణ విద్యుత్ సంస్థ ట్రాన్స్ మిషన్ కార్పొరేషన్ (టిజిట్రాన్స్‌కో) డైరెక్టర్ టీ.జగత్‌రెడ్డి రాజీనామా చేశారు. అనారోగ్య కారణాలతో ఇటీవల ఆయనకు ఆపరేషన్ కావడంతో విధులకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే విద్యుత్ శాఖకు సంబంధించిన ట్రాన్స్‌కోలో కీలకమైన డైరెక్టర్ పదవికి రాజీనామా చేశారు. దీంతో జగత్‌రెడ్డి నిర్వహించిన ట్రాన్స్‌కో డైరెక్టర్ బాధ్యతలను నిర్వహించేందుకు విద్యుత్ శాఖ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది. డైరెక్టర్ పోస్టును పూర్తి స్థాయిలో నియామకం చేసేంత వరకూ ప్రత్యామ్నాయంగా ప్రాజెక్ట్స్ విభాగానికి సంబంధించిన డైరెక్టర్ జి. నర్సింగారావుకు వాటి బాధ్యతలను అప్పగిస్తు ట్రాన్స్ కో సిఎండి డి. కృష్ణభాస్కర్ నిర్ణయం తీసుకున్నారు.

## ఐపిఎస్ అధికారి ఎబివెంకటేశ్వరరావుకు ఏపి హైకోర్టులో ఊరట



**విజయవాడ,మే7,ప్రభాతవార్తప్రతినిధి:** విశ్రాంత సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుకు హైకోర్టులో ఊరట లభించింది. నిఘా పరికరాల కొనుగోలు వ్యవ హారంలో ఆయనపై ఏసీబీ అధి కారులు నమోదు చేసిన కేసుతో పాటు ఛార్జిషీట్‌ను కొట్టివేసింది. వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో దేశ, రాష్ట్ర భద్రతా వ్యవహారాల్లో నిబంధనలు అతిక్రమించారంటూ నిఘా విభాగం డైరెక్టర్ జనరల్‌గా పనిచేసిన ఏబీవీ వెంకటేశ్వరరావుపై అభియోగాలు మోపింది. జాతీయ, రాష్ట్ర భద్రతకు ముప్పు కలిగించేలా ఓ విదేశీ రక్షణ ఉత్పత్తుల తయారీ సంస్థకు పోలీసు సెక్యూరిటీ ప్రోటోకాల్ వ్యవస్థ వివరాలను అప్పగిం చారని పేర్కొంది.

# భారత పౌరుడిగా గర్వంగా ఉంది



## ఆపరేషన్ సిందూర్‌పై సిఎం రేవంత్‌రెడ్డి

### సిఎంగా నా బాధ్యతలు నిర్వహిస్తున్నా, మీడియాతో చిట్‌చాట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే7:** భారత భద్రతా దళాలు చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌పై దేశ వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే పలువురు ప్రముఖులు, సెలబ్రిటీలు, రాజకీయ నాయకులు స్పందనను తెలియ జేస్తున్నారు. పాక్‌లోని ఉగ్ర శిబిరాలపై మన సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ పట్ల భారత పౌరుడిగా గర్వంగా ఉం దని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవం త్‌రెడ్డి తెలిపారు. దేశ పౌరులుగా అందరూ ఏకతాటిగా నిలిచి ఐక్యత చాటాల్సిన సమయం ఇదంటూ ‘జైహింద్’ అని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. బుధవారం సాయంత్రం కమాండ్ కం ట్రోల్ సెంటర్ వద్ద తన వాహనాన్ని ఆపి మీడియా ప్రతినిధులతో కొద్దిసేపు చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భద్రతా బలగాలు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ పట్ల ప్రతి భారతీయుడు గర్వ పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సమ యంలో ప్రతి భారతీయుడు ఆర్మీకి బాసటగా నిలువాలని పిలుపునిచ్చారు. మనమంతా సైన్యం వెనుక ఉన్న సందేశాన్ని పంపాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రిగా తన బాధ్యతలు తాను నిర్వర్తిస్తున్నానని పేర్కొ న్నారు. ఇలాంటి సమయంలో రాజకీయాలకు అతీతంగా అందరూ పార్టీలను పక్కకు పెట్టి ఒక్కటిగా ఉండాల్సిన సమయం అని అని చెప్పారు. రాజకీయాలు కాదు దేశం ముందు దేశంలోకి వచ్చి చంపు తుంటే చూస్తూ ఉరుకుంటే ఎలా? అని ప్రశ్నిం చారు. భారత రక్షణ రంగంలో హైదరాబాద్ అత్యంత కీలక ప్రాంతమని తెలిపారు. అపరేషన్ సిందూర్ నేపథ్యంలో శత్రుదేశం దాడి చేస్తుం దన్న సంకేతాల మేరకు రాష్ట్రంలో అన్ని విభాగా లను అప్రమత్తం చేశామని సిఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఆర్మీకి మద్దతుగా గురువారం నగ రంలో సంఘీభావ ర్యాలీ ఉంటుందని, సెక్రటేరి యట్ నుండి నెక్లెస్‌రోడ్ వరకు ర్యాలీ ఉంటుం దని, రాజకీయాలకు అతీతంగా అందరూ పాల్గొ నాలని చెప్పారు. ర్యాలీ ప్రభుత్వం చేపట్టిందని, అన్ని రాజకీయపార్టీలు పాల్గొనవచ్చునని పేర్కొ న్నారు. తమకు నేషన్ ఫస్ట్, అని ఈ సమయలో తాము రాజకీయాలకు అతీతంగా పనిచేస్తామని స్పష్టంచేశారు. మనమద్దతు ఉంటే ఆర్మీకి బల మని, రాష్ట్ర ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటుందన్నారు. భద్రతా చర్యల దృష్ట్యా మాక్ డ్రిల్‌లో పాల్గొనలేదని పేర్కొన్నారు.

# సైన్యానికి సంఘీభావంగా ర్యాలీలో భారీగా పాల్గొనండి

### మిస్ వరల్డ్ కోసం వచ్చిన వారికి తగిన రక్షణ కల్పించాలి

### డిప్యూటీ సిఎం భట్టితో కలిసి సమీక్షించిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే7:** ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత సైన్యా నికి సంఘీభావంగా గురువారం సాయంత్రం చేపట్టే ర్యాలీలో యువత పెద్ద ఎత్తున పాల్గొ నాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పిలుపుని చ్చారు. ఆపరేషన్ సిందూర్, మాక్ డ్రిల్ అనం తర పరిస్థితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సాయంత్రం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, అధికారులతో కలిసి సమీక్ష చేశారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సిఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. భారత సైన్యానికి సంఘీభావంగా గురువారం సాయం త్రం ఆరు గంటలకు సెక్రటేరియట్ నుంచి నక్లెస్ రోడ్ వరకు నిర్వహించే ర్యాలీ పైన చర్చించారు. రాష్ట్రంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. రాష్ట్రంలో ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలపై ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం పలు సూచనలు చేశారు. అన్ని శాఖలు పూర్తిగా సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని దిశానిర్దేశం చేశారు. నిత్యావసర వస్తువుల కొరత ఏర్పడకుండా జాగ్రత్త తీసుకోవాలని చెప్పారు. అత్యవసర సేవలకు ఎలాంటి ఆటంకం కలగ కుండా చూడాలని పేర్కొన్నారు. హైదరాబాద్ పరిధిలో ఉన్న ఆర్మీ, నేవీ కార్యాలయాలవద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. రక్షణ రంగానికి చెందిన సంస్థల దగ్గర భద్రతా పరమైన చర్యలు చేపట్టాలని చెప్పారు. రాజీవ్ గాంధీ అంతర్జా తీయ విమానాశ్రయం వద్ద భద్రతను కట్టుదిట్టం చేయాలని చెప్పారు. హైదరాబాద్ నగరంలో విదేశీ రాయబార కార్యాలయాలవద్ద భద్రత కల్పించాలని పేర్కొన్నారు. తెలంగాణ పర్య టనకు వచ్చిన విదేశీ పర్యాటకులకు తగిన రక్షణ కల్పించాలని చెప్పారు. కేంద్ర నిఘా బృందాలతో రాష్ట్ర నిఘా బృందాలు సమన్వయం చేసుకో వాలని అధికారులకు సూచించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ కేంద్రంగా సమాచార వ్యవ స్థను ఏర్పాటు చేసుకుని నిరంతరం పర్య వేక్షించాలని చెప్పారు.

# ఆపరేషన్ సిందూర్‌కు సంపూర్ణ మద్దతు



### ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

### ఆర్‌టిసి కార్మికుల సమస్యలపై త్వరలో సిఎంను కలుస్తాం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** ఉగ్రవాదాన్ని తుద ముట్టించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌ను స్వాగతిస్తూ సంపూర్ణ మద్దతును తెలియజేస్తున్నామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంని సాంబశివరావు తెలిపారు. ఇదే సమయంలో కగార్ ఆపరేషన్‌ను నిలిపివేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూం భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో కూనంనేని మీడియాతో మాట్లాడారు. ఉగ్రవాదానికి కులం, మతం, దేశం లేదని, గతం లో మాజీ ప్రధాన మంత్రి బెనజీర్ భుట్టోను, ముజఫర్ రెహమాన్‌ను హత్య చేసింది వారేనన్నారు. పాకిస్థాన్ పాలకులు, ఉగ్రవాదులు ఒకరిపై ఒకరు ఆధారపడి భారత్‌లో నరమేధాన్ని సృష్టించేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌ను ఆసరాగా చేసుకుని ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోందని, దానికి సరైన గుణపాఠం చెప్పాలిందేనన్నారు. సహనానికి మారుపేరైన భారతదేశానికి ఉగ్రవాదం నుంచి శాశ్వతంగా విముక్తి జరగాలని, ఇందుకు కేంద్రానికి సిపిఐ బాసటగా నిలుస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పక్కా కార్యచరణతో ముందుకు సాగేలా అన్ని రాజకీయ పార్టీలతో చర్చించి సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు. ఆపరేషన్ సింధూర్ విజ యవంతం కావాలని ఆకాంక్షించారు. మావోయిస్టులను ఏరివేసేందుకు ఆపరేషన్ కగార్ చేపట్టడం సరైంది కాదని తక్షణమే దీనిని నిలిపివేయాలని కూనంనేని డిమాండ్ చేశారు. మావోయిస్టులు చర్చలకు వస్తామంటే చర్చలకు ఒప్పుకునేదిలేదని, లొంగిపోవాల్సిందేనని ఒక కేంద్ర మంత్రి నియంతలా మాట్లాడుతున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. మావోయిస్టులు తప్పు చేస్తే తప్పకుండా ఖండిస్తామని, అయితే దేశ పౌరులైన వారికి దేశంలోని అన్ని చట్టాలు వర్తిస్తా యని, వాటి ప్రకారం వారిని శిక్షించాలే తప్ప ఎన్‌కౌంటర్ చేయడం తగదన్నారు. కూంబింగ్ పేరుతో కర్రెగుట్టలను చుట్టుముట్టి 22 మందిని ఎన్‌కౌంటర్ చేయడమేంటని ప్రశ్నించారు. సమ్మె అనేది ఉద్యోగుల హక్కు అని, పాలకులు వారి సమస్యలను పట్టించుకోనప్పుడు వాటిని సాధించుకునేందుకు సమ్మె ఒక సాధనమని సాంబశివరావు అన్నారు. ఉద్యోగ సంఘాల ప్రకటనపై రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవేదనతో ప్రకటన చేయడం తప్పు కాకపోయినప్పటికీ, ఈ సమస్యకు అందుకు కారణమైన వారు ఎవరో ప్రజలకు అర్థమయ్యే విధంగా చెప్పాలని సూ చించారు. ఇందుకు ముందుగా ఉద్యోగ సం ఘాలతో సిఎం చర్చలు జరిపితే సగం సమ స్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఇప్పటి కిప్పుడు పరిష్కరించే సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, ఆర్థికపరమైన అంశాలను ఒకేసారి కాకపోయినా విడతల వారీగా చెల్లిం చడం ద్వారా వారికి న్యాయం చేయాలన్నారు. టిజిఎస్ఆర్‌టిసి కార్మికుల సమస్యలపై త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశం కానున్నామని కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఆర్‌టిసి కార్మికులు బుధవారం నుంచి సమ్మె తలపెట్టిన నేపథ్యంలో మంగళవారం రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జరిపిన చర్చల్లో ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చిందని, సిఎంతో చర్చించి సమస్య లను పరిష్కరిస్తామని చెప్పారని, దీంతో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేశారన్నారు.

# ఆపరేషన్ సిందూర్‌ను స్వాగతిస్తున్నాం

### సిపిఐఎం పొలిట్‌బ్యూరో

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** కేంద్రం చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌ను స్వాగతిస్తున్నట్టు భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు(సిపిఐఎం) పొలిట్‌బ్యూరో బుధవారం ఒక ప్రకటనలో తెలి పింది. పీఓకేతోపాటు పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేయాలనే లక్ష్యంతో భారత సాయుధ బలగాలు ఆపరేషన్ సిందూర్ నిర్వహించాయని పేర్కొన్నాయని తెలిపింది. సాయుధ దళాల ప్రకారం ఈ దాడులు 9 ప్రదేశాల్లో విజయవంతంగా నిర్వహించబడ్డాయని తెలిపింది. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆల్ పార్టీ మీటింగ్‌లో, ఉగ్రవాదులు వారి నిర్వాహకులపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతుని చ్చాయని పేర్కొందని తెలిపింది.

పహల్గామ్‌లో అమాయక ప్రజల ఊచకోతకు బాధ్యులైన వారిని అప్పగించాలని దాంతోపాటు పాకిస్థాన్ నుంచి ఎటువంటి ఉగ్రవాద శిబిరాలు పనిచేయకుండా చూసుకోవాలని పాకిస్తాన్‌పై ఒత్తిడి కొనసాగించేలా చూడాలని ప్రకటనలో పేర్కొంది.

దేశ ప్రజల ఐక్యతను, దేశ సమగ్రతను కాపాడేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని సిపిఎం పొలిట్‌బ్యూరో ప్రకటనలో పేర్కొంది.

# మీడియాకు వివరాలు వెల్లడించిన మహిళా అధికారిణిలపై చర్చించుకుంటున్న భారత్

**న్యూఢిల్లీ, మే 7:** జమ్ముకశ్మీర్‌లోని ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉగ్రవాద శిబిరాలపై భారత ఆర్మీ మెరు పు దాడి చేసింది. ఆపరేషన్ సిందూర్ పేరుతో దాడులు నిర్వహించగా దాదాపు 100 మంది వరకు ఉగ్రవాదులు హతమైనట్లు తెలుస్తోంది. భారత్ ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై బుధవారం ఉదయం విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మీడియాకు వివరాలు వెల్లడించారు. మిస్రీతో పాటు ఇద్దరు మహిళా అధికారులు కూడా ఆపరేషన్ సిందూర్ గురించి వివరిం చారు. భారత చరిత్రలోనే తొలిసారిగా ఇద్దరు మహిళా అధికారులు సైనిక్ ఆపరేషన్‌పై అధి కారిక విలేకరుల సమావేశానికి నాయకత్వం వహించారు. ఇప్పుడు వీరిద్దరి గురించే యావత్ భారత్ చర్చించుకుంటోంది. కర్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ ఈ క్లిష్టమైన ఆపరేషన్ గురించి చెప్పుకొచ్చారు. ఈ ఇద్దరు మహిళా అధికారులు ఎవరు వీరి బ్యాగ్రౌండ్ పై నెట్టింట తెగ శోధిస్తున్నారు.



**వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్:** పైలెట్ కావాలన్నది వ్యోమికా సింగ్ కల. అందుకోసం ఎంతో కష్టపడ్డారు కూడా. ఇంజనీరింగ్ పూర్తి చేసి వ్యోమికా తన కలను తీర్చుకునే దిశగా అడు గులు వేశారు. ఇందులో భాగంగానే 2004లో ఐఎఎఫ్‌లో చేరారు ఆమె. 2017లో వింగ్ కమాండర్ హోదా పొందారు. డిసెంబర్ 18, 2019న ఫ్లయింగ్ బ్రాంచ్‌లో శాశ్వత కమిషన్ హోదా పొందారు. అత్యంత క్లిష్టమైన ప్రాం తాల్లో కూడా చేతక్, చీతా హెలికాప్టర్లను నడిపి రికార్డు సృష్టించారు వ్యోమికా సింగ్. వైమానికి రంగంలో ఎంతో పేరు పొందారు. హైరిస్క్ ఫ్ల యింగ్ ఆపరేషన్లలో వ్యోమికా సింగ్ సేవలం దించారు. **కర్నల్ సోఫియా ఖురేషి:** సోఫియా ఖురేషీ స్వస్థలం గుజరాత్. 1990లో సోఫియా సైన్యంలో చేశారు. కార్ప్స్ ఆఫ్ సిగ్నల్స్‌కు చెందిన లెఫ్టినెంట్ కల్నల్ సోఫియా ఖురేషి. 2016లో పుణెలో జరిగిన ఎక్సర్‌సైజ్ 18 పేరిట భారత ఆర్మీకి చెందిన బృందానికి నాయకత్వం వహించి తొలి మహిళా అధికారిణిగా చరిత్ర సృష్టించారు. ఇందులో 18 దేశాలు పాల్గొనగా కేవలం భారత్ బృందానికి మాత్రమే మహిళ నాయకత్వం వహించారు. ఆమెకు పీస్ కీపర్‌గా ఎంతో అనుభవం ఉంది. 2006 కాంగోలో పీస్ మిషన్‌కు ఆమె అందించిన సహ కారం ప్రత్యే కంగా నిలిచింది. ప్రపంచ వేదికపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడం ఎంతో గర్వకారణం. మూడు దశాబ్దాలకు పైగా భారత సైన్యానికి సేవలందించారు. ఆమె రాజీలేని వైఖరి, నిర్భయ ప్రయత్నాలతో ఎన్నో ప్రశంసలను అందు కున్నారు. అలాగే దేశ యువతను భారత సైన్యం లో చేరాలని కూడా సోఫియా ఖురేషి పిలుపునిచ్చారు.

## మరో రూ.2 వేల కోట్ల రుణం చేసిన సర్కార్

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** తెలంగాణ సర్కారు రిజర్వ్ బ్యాంక్ నుంచి మరో రూ.2,000 కోట్ల అప్పు తీసుకున్నది. రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను బహిరంగ మార్కెట్లో నిర్వహించిన ఈవేలం ద్వారా ఈ రుణం సేకరించినట్టు ఆర్బీఐ వెల్లడించింది. ఈ మొత్తంలో 28 ఏండ్లకాల పరిమితికి 6.79 వార్షిక వడ్డీతో రూ.1,000 కోట్లు తీసుకున్నది. మరో రూ. 1,000 కోట్లను 32 ఏండ్లకాల పరిమితికి 6.80 వార్షిక వడ్డీకి సేకరించింది. కాగా ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం ఏప్రిల్ నుండి జూన్ నెల వరకూ రూ.14 వేల కోట్ల రుణ సమీకరణ కోసం ఆర్బీఐకి ప్రతిపాదనలు పంపింది. ఏప్రిల్‌లో 3 దఫాల్లో రూ.4,400 కోట్లు తీసుకున్నది. ఇందులో ఏప్రిల్ 8వ తేదీన రూ.1,000 కోట్లు, 15వ తేదీన రూ.2 వేల కోట్లు, 30న మరో రూ.1,400 కోట్లను రిజర్వ్ బ్యాంక్ నుండి బాండ్ల తనఖా ద్వారా సేకరించింది. ఇక ఈ త్రైమాసికం రెండో నెలలో ఇప్పుడు ఇంకో రూ.2,000 కోట్లు సేకరించింది. దీంతో ఈ క్వార్టర్‌లో ఇప్పటి వరకూ రూ.6,400 కోట్ల రుణం తీసుకున్నట్లయింది. ఇక ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ రుణాల కింద రూ.64,539 కోట్లు సమీకరిస్తామని వార్షిక అంచనా బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రతిపాదించింది.

# ఆపరేషన్ సిందూర్ పై తప్పుడు ప్రచారం జరగకుండా చూడాలి

### అధికారుల సమావేశంలో ఏపి సిఎం చంద్రబాబు

**విజయవాడ,మే7,ప్రభాతవార్తప్రతినిధి:** ఆపరేషన్ సిందూర్థ్ అనంతర సివిల్ డిఫెన్స్ కార్యాచరణపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష చేశారు. సమీక్షకు సిఎస్, డీజీపీలతో పాటు టూరిజం, ఎండోమెంట్, డిజాస్టర్ మేనేజ్మెంట్, హెల్త్, ఆర్ అండ్ బి తో పాటు పలు శాఖల అధికారులు హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, రైల్వే, ఇండియన్ ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్, సిఐఎస్ఎఫ్ అధికారులు సమీక్షలో పాల్గొన్నారు. ఆపరేషన్ సిందూర్థ్ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా తీసుకుంటున్న భద్రతా చర్యలు, సన్నద్ధతపైనా... అలాగే మాక్ డ్రిల్స్ నిర్వహణ, ప్రస్తుత పరిస్థి తులపై ప్రజలకు అవగాహన కల్పించడంపైనా చర్చించారు. ఊహించని ఘటనలు జరిగితే తీసుకోవాల్సిన చర్యలు, ప్రజలను అప్రమత్తం చేయడం వంటి అంశాలపై మాట్లాడారు. ఈ సమీక్షలో ఆయా విభాగాలు తమ సన్నద్ధతను సమావేశంలో వివరించాయి. అనంతరం సిఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... ఆపరేషన్ సిందూర్థ్ నేపథ్యంలో అన్ని స్థాయిల్లో అధికారులు, సంస్థలు సిద్ధంగా ఉండాలి. కేంద్రం సైతం రాష్ట్ర ప్రభుత్వాల సన్నద్ధతపై పలు సూచనలు చేసింది. వాటిని పూర్తిగా అమలు చేయాలి. ఇలాంటి సమయంలో అన్ని శాఖలు అత్యంత సమన్వయంతో పనిచేయాలి. ప్రజలు ఆందోళన చెందకుండా చూడాల్సిన అవసరం ఉంది. ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలి. ఇలాంటి సమయంలో తప్పుడు సమాచారం వ్యాప్తి చెందకుండా చూడాలి. ఎవరైనా తప్పుడు ప్రచారం చేస్తే... అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. తీర ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. టీటీడీ వంటి చోట్ల ప్రత్యేక రక్షణ చర్యలు, జాగ్రత్తలు తీసుకోవాలి. 24 గంటలు అన్ని శాఖల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాల్థి అని సిఎం సూచించారు.

## ఉగ్రవాదం అంతమే అంతిమ లక్ష్యం : ఏపి మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ,మే7,ప్రభాతవార్తప్రతినిధి:** అందమైన ప్రదేశాలను చూసి ఆస్వాదిం చేందుకు, ఆహ్లాదమైన వాతావరణంలో గడిపేందుకు వెళ్లిన అమాయకులైన పర్యాట కులను అన్యాయంగా పొట్టనబెట్టుకున్న ఉగ్రమూకల చర్యకు ప్రతిచర్యే “ఆపరేషన్ సిందూర్“ అని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.. పహల్గామ్ దాడికి భారత్ ప్రతీకారం తీర్చుకోవడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. భారత సాయుధ బలగాలు ఉగ్రవాద శిబిరాలపై మెరుపుదాడి చేసి గట్టి సమాధానమిచ్చాయని, తీవ్రవాదంపై భారత ఉక్కు సంకల్పానికి ఇది ఒక నిదర్శనం అని వెల్లడించారు. ఈ సందర్భంగా భారత సైన్యానికి వందనం అని పేర్కొన్నారు. కశ్మీర్ లోని అనంత్ నాగ్ జిల్లాలోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన బైసరన్ లోయలో ఉగ్రమూకల విచక్షణ రహిత కాల్పులతో పహల్గాంలో అన్యాయంగా ఎంతో మంది భారతీయ స్త్రీల నుదటన సింధూరం లేకుండా చేసిన బాధిత పర్యాటకుల ఆత్మలకు ఈ దాడితో శాంతి చేకూరు తుందని ఆశిస్తున్నానని తెలిపారు. ఈ దాడి పర్యాటకులపై కాదు, భారత్ పై జరిగిన దాడిగా భావిస్తున్నామన్నారు.. అమాయకులైన పర్యాటకులను బలిగొన్న ఘటన హృదయ విదారకమైనదని, దేశ సమగ్రతకు, ఐక్యతకు చిచ్చుపెట్టాలని చూస్తే సహించబోమని తెలిపారు. చేసిన పాపానికి పాకిస్థాన్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు..యావత్ భారత దేశం ఉగ్రవాదుల దుశ్చర్యను ఖండిం చాల్సిన సమయం ఇదని... భారత సైన్యానికి అండగా నిలవాల్సిన తరుణమని పిలుపు నిచ్చారు... భారతదేశ ఐక్యతను ఉగ్రవాదం విచ్ఛిన్నంచేయలేదని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలని సూచించారు.. అందరూ ఏకతాటిపై నిలిచి ఉగ్రవాదాన్ని తిప్పికొట్టాలని, సార్వభౌమత్వాన్ని కాపాడు కుందాం.. ఉగ్రవాదుల దాడుల నుంచి దేశ పౌరులను రక్షించుకుందామన్నారు.

## ఆపరేషన్ సిందూర హర్షణీయం: ఏపి హోంమంత్రి అనిత

**విజయవాడ,మే7,ప్రభాతవార్తప్రతినిధి:** భారత సైన్యం పాకిస్తాన్ భూభాగంలోని ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడంపై హోంమంత్రి వంగలపూడి అనిత హర్షం వ్యక్తం చేశారు. “ ఎక్స్” వేదికగా అనిత ఒక పోస్టులో ఆపరేషన్ సిందూర్ భారత దేశ గౌరవాన్ని, సార్వభౌమత్వాన్ని ప్రపంచ పటముపై మరోసారి నిలిపిందని కొనియాడారు. పహల్గామ్ దాడికి భారతదేశం సాహసోపేతంగా తగిన ప్రతీకారం తీర్చుకుందన్నారు. ఉగ్రవాదానికి శాశ్వతంగా ముగింపు వచ్చే వరకు భారతదేశం తన ఆపరేషన్‌లను కొనసాగిస్తుందని ఆమె స్పష్టం చేశారు. పాకిస్తాన్ ఇకనైనా చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోవాలన్నారు. ఉగ్రవాదులకు ఆశ్రయమివ్వడం నిలిపివేయాలని, దేశ రక్షణలో ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం చూపుతున్న కట్టుదిట్టమైన విధానం అభినందనీయమని వంగలపూడి అనిత అన్నారు.

## ఉగ్రవాద స్థావరాలు, శిబిరాలపై దాడి అనివార్య చర్య

### పార్టీ ముఖ్య నాయకులతో ఏపి మాజీ సిఎం వైఎస్ జగన్



**విజయవాడ,మే7,ప్రభాత వార్తప్రతి నిధి:** ఉగ్రవాద స్థావరాలు, శిబిరాలపై దాడి అనివార్య చర్యఅని మాజీ సీఎం వైయస్ జగన్ అన్నారు. వైకాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో మాజీ సీఎం వైయస్ జగన్ వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్లమెంటు నియోజకవర్గాల పార్టీ పరిశీలకులు, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్లతో సమావేశమైన మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు శ్రీ వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఈ సమావేశానికి ముందు పార్టీ ముఖ్యనేతలతో శ్రీ వైయస్ జగన్ కాసేపు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్‌ను ప్రస్తావించిన శ్రీ వైయస్ జగన్ ఏమన్నారంటే.. భారత్‌లో రక్తపాతం సృష్టిస్తున్న ఉగ్రవాదుల, వారి శిబిరాలు, స్థావరాలపై చర్యలు అనివార్యం. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడం, ఉగ్రవాదుల దాడుల నుంచి తన పౌరులను రక్షించుకోడం అన్నది దేశానికి అత్యంత ముఖ్యమైన కర్తవ్యం. కశ్మీర్‌లోని పహల్గావ్‌లో ఉన్న బైసరన్ వ్యాలీకి పర్యాటకులుగా వెళ్లిన అమాయక పౌరులపై ఉగ్రవాదుల దాడి మానవత్వంపై జరిగిన దాడి. అలాంటి ఉగ్ర చర్యలపై భారత రక్షణ దళాలు గట్టిగా స్పందించాయి. ఆపరేషన్ సిందూర్ అనివార్యమైన చర్య. భారత రక్షణ బలగాలకు యావత్‌దేశం అండగా నిలుస్తుంది. దేశ పౌరుల భద్రత ధ్యేయంగా రక్షణ బలగాలు తీసుకుంటున్న చర్యలకు దేశమంతా మద్దతుగా నిలుస్తోంది.

ఇతరులు అనుసరించడానికి, తమనే ఉదాహరణగా తీసుకోవాలని తమకు తామే ఎవరైతే అనుకుంటారో, వారు అభివృద్ధి చెందలేరు.

-గోల్డ్‌స్మిత్

# ఇక సమరమే!

కయ్యానికి కాలు దువ్వుతూ కవ్వింపు చర్యలతో రెచ్చగొట్టిన పాక్ సైన్యానికి బుద్ధి చెప్పేందుకు భారత్ సైన్యం ఒకడుగు ముందుకేసింది. ఉగ్రవాదాన్ని సమర్థించే పాక్‌కు బుద్ధిచెప్పాలని తలపోసిన కేంద్ర మంత్రివర్గ నిర్ణయాన్ని త్రివిధ దళాలు మరో అడుగు ముందుకేసి మంగళవారం అర్ధరాత్రి బాగా పొద్దుపోయాక పాక్‌సేనలపై లంఘించుకున్నాయి. కొద్ది రోజుల క్రితం త్రివిధ దళాధిపతులతో జరిగిన అత్యున్నత సమావేశంలో పహెల్గాం ఉగ్రదాడికి ప్రతీకార చర్యగా దేనికైనా తాము సిద్ధమేనని త్రివిధదళాలు ముందుకొచ్చాయి. అందుకు ప్రధాని మోడీ అంగీకార ముద్రవేసి పూర్తి భద్రత బాధ్యతతోపాటు అన్ని అధికారాలనూ త్రివిధ దళాలకు దఖలుపరిచారు. ఇంత పెద్ద నిర్ణయం తీసుకున్నారంటే యుద్ధ సన్నాహాలు జరుగుతున్నట్లే దేశ ప్రజలు యావత్తూ భావించారు. మిత్రదేశాలే కాకుండా ప్రపంచ దేశాలన్నీ భారత్ ఉగ్రవాదంపై తీసుకునే ఎలాంటి చర్యలనైనా సమర్థించేందుకు మద్దతు పలికాయి. ఈ విషయంలో ఐక్యరాజ్యసమితితో పాకిస్థాన్‌కు ఎలాంటి మద్దతు లభించలేదు. సభ్యదేశాలు పాక్ ఉగ్రవాదాన్ని ఎగోదస్తోందనే అభిప్రాయానికి రావడంలో భారత్ తన విజ్ఞతను ప్రదర్శించింది. పాక్‌ను ఒంటరి చేయడంలో భారత్ పాలకులు దౌత్యనీతితో వ్యవహరించారు. నిశ్శబ్ధం బద్దలయ్యే ముందు భారత ప్రజలకు పేరిట 'మాక్ డ్రిల్' ప్రదర్శనలు నిర్వహించి వైమానిక దాడులను ఎదుర్కొనడమెలాగో నేర్పారు. అది యుద్ధ సన్నద్ధతలో ఒక భాగం. మాతృభూమిలో జరిగిన మారణహోమానికి విదేశాల్లో ఉన్న ప్రతి భారతీయుడు తల్లడిల్లిపోయారు. పాకిస్థాన్ పీచమణచాలని ప్రధాని నరేంద్రమోడీని వేడుకున్నారు. కాంగ్రెస్ వంటి ప్రధాన ప్రతిపక్షం మజ్లిస్ ఎ ఇత్తెహదుల్ ముస్లిమీన్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీలతో సహా అన్ని రాజకీయ పక్షాలు బేషరతుగా మద్దతు పలి కాయి. అన్ని విపక్షాలు, విజ్ఞులు సైతం పాక్‌పై సైనిక చర్య తీసుకోవాలని కోరాయి. ఈసారి ఎలాగైనా మనదైన పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను స్వాధీనపరుచుకోవడమొక్కటే మనముందున్న తక్షణ కర్తవ్యంగా పాలకులకు హితోబోధ చేశాయి. ఇలాంటి క్లిష్టసమయంలో ప్రభుత్వం బహిరంగంగా నోరు మెదపదు. సమయం కోసం వేచి చూసింది. ఉన్నట్టుండి భారత్ సైన్యం పాక్ 9 ఉగ్రవాద శిబిరాలపై దాడి చేసి ధ్వంసం చేసింది. ఎప్పుడూ జరిగే యుద్ధరీతి కన్నా ఈసారి అందుకు భిన్నంగా భారత్ ప్రణాళికాబద్ధంగా ఆపరేషన్ సింధూర్' దాడికి అంకురార్పణ చేసింది. 23 నిమిషాల పాటు చేసిన దాడిలో వందకుపైగా శిక్షణ పొందుతున్న ఉగ్రవాదులు హతమాయ్యారు. 4 జైష్ మహ్మద్, 3 లష్కర్ తొయిబా, 2 హిజ్‌బుల్ ముజాహిదీన్‌లకు చెందిన ఆయా శిబిరాల్లో ఉగ్రవాద శిక్షణ జరుగుతోందని స్పష్టమైన సమాచారంతో సైన్యం అటు దృష్టి సారించింది. పహెల్గాం దాడిలో 26 మంది మృతులు పురుషులే. వారి భార్యల సింధూరానికి ప్రతీకగా 'ఆపరేషన్ సింధూర్' పేరిట ఉగ్రవాదుల ఏరివేత కార్యక్రమాన్ని చేపట్టడం భారత్ ఏస్థాయిలో పాక్ మీద ప్రతీకార చర్యకు దిగనున్నదో స్పష్టమవుతోంది.. దేశంలో చాలా ప్రాంతాల్లో ప్రజలు గుమిగూడి 'భారత్ దేశం ఉగ్రవాద దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదని ప్రపంచానికి తెలియచేస్తున్నందుకు భారత్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియచేస్తోంది. ఆసేతు హిమాచలం భారతీయులంతా పాక్‌పై సైనిక చర్యపట్ల హర్షం వెలిబుచ్చుతోంది. జమ్మూకాశ్మీర్ ఆర్థికాభివృద్ధిని అడ్డుకునేందుకే ఏప్రిల్22న ఉగ్రవాదులు దాడిచేసి 26మంది పర్యాటకులను హతమార్చారని, లష్కర్ తోయిబా అనుబంధ సంస్థ టిఆర్‌ఎఫ్ (ది రెసిస్టెంట్ ఫ్రంట్) సోషల్ మీడియా ద్వారా తామే ఆ దాడి చేశామని ప్రకటించుకున్నందున ఆ సంస్థను మట్టు పెట్టే దిశగా ఆలోచించామని విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీ మీడియాకు వెల్లడించారు. గతంలో 'సర్జికల్ స్ట్రైక్స్'లో భంగపడినా అణ్వాయుధాలున్నాయననే గర్వంతోనే పాక్‌దురాగతానికి పాల్పడింది. అడుగడుగునా పాక్ భారత్‌ను కవ్విస్తోంది. గతానికి ఇప్పటికీ తేడా ఏమిటంటే నిన్నమొన్నటి పహల్గామ్ ఊచకోత అనంతరం పాక్ తమదేశంలో ఉగ్రవాద శిబిరాలున్నాయన్న విషయం నిజమేనని అంగీకరించారు. భారత్ భూభాగంలో విమానాలు కూల్చేసినట్లు, భారత్ సైనికులు 26మంది హతమైనట్లు పాక్ గ్లోబెల్ ప్రచారానికి పాల్పడింది. కేవలం తమను నమ్మని పాక్ ప్రజల నుండి సానుభూతిని పొందేందు కు ఇలాంటి ప్రచారాలు చేస్తున్నట్లు జనానికి విదితమే. ఈసారైనా పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను స్వాధీనపరచుకోలేకపోతే భారత్ ఉదార స్వభావాన్ని అంగీకరించలేనివారు విమర్శలు గుప్పించే అవకా శముంది. అందుకే భారత్ లక్ష్యం పాక్ ఆక్రమ కాశ్మీర్ స్వాధీనమే కావాలని భారతీయులంతా కోరుకుంటున్నారు. భారత్ సైన్యానికి సంఘీభావంగా దేశమంతటా పౌరులు ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఇలాంటి తరుణంలో జాతి మొత్తం ఏకమవ్వాల్సి న అవసరాన్ని అన్నివర్గాల ప్రజలూ గుర్తించారు. ఇంతాజరిగాక ఇప్పుడు 'ఆపరేషన్ సింధూర్' పైమౌనంగా ఉండాలని పాక్‌కు అమెరికా హితవు పలుకుతోంది. పాక్ నేతలు తామే భారత్‌కు చెందిన క్షిపణులు, డ్రోన్లను మట్టికరిపించామని మేకపోతు గాంభీర్యాన్ని ప్రకటిస్తున్నారు. కాశ్మీర్ ముజాహిదీన్‌లు దాడి జరిపిన వెంటనే కాశ్మీర్ తమ వశమవుతుందంటూ పాక్ ఆర్మీ ఛీప్ జనరల్ సయ్యద్ అసిమ్ మునీర్ రెచ్చగొట్టే ప్రసంగమే భారత్‌కు కోపకారణమైంది. లేకుంటే పాక్ ఉగ్రవాదాన్ని వదిలిపెడతానన్నా భారత్ శాంతించేది.

ఒక గొప్ప జాతిగా మారాలనుకున్న దేశ ప్రజలకు సామూహిక క్రమశిక్షణ అన్నది అత్యావశ్యకమైన నిబంధన.




మహాత్మాగాంధీ

ప్రతి ఒక్కరికీ తనని గురించి బహుకొద్దిగా మాత్రమే తెలుస్తుంది. మనిషికి తనని తాను తెలుసుకోవడం చాలా కష్టమైన పని.



సిసిరో

# ప్రజావాక్కు



## వాగ్దానాలు చేయడం మానుకోవాలి

ఎంప్లాయిస్ పెన్షన్ స్కీమ్1995లో పదవీ విరమణ చేసినవారికి2014నుండి కదలని వెయ్యిరూపాయల పెన్షన్ను ఈ మే నెలనుండి కేంద్రప్రభుత్వం పెంచేసిందని తప్పుడు వార్తలు గూగుల్‌న్యూస్ నుండి ప్రతీరోజు ప్రధాని మోడి, ఫైనాన్స్ మినిష్టరు నిర్మలా సీతారామన్ గారి ఫోటోలతో వస్తున్నాయి. పెన్షను కూడా 3000, 7000,7500, 8000,9000వరకు పెంచారని రకరకాలఅవాస్తవ సమాచారాన్ని ప్రసారం చేస్తున్నది. ఇదంతా వట్టి బూటకమని ఈ పెన్షన్ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వంతో నిత్యం సంప్రదిస్తున్న నేషనల్ ఏజిటేషన్ కమిటి నాయకులు విజ్ఞప్తులు చేస్తున్నారు. కేంద్రం మోసపూరిత వాగ్దానాలు చేయడం మానుకోవాలి.

- డా. ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

## అసమాతలను తగ్గించాలి

ఉపాధిహామీ పథకం పౌరుల కనీస హక్కుగా రూపొందించబడిన ఈ పథకం అసమానతలకు ఆలవాలంగా ఉంటుంది. ఉపాధి హామీలో రాష్ట్రాలకు కనీసం హక్కు లేకుండా ఉన్నది. రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా పనులను ఎంపిక చేసుకునే బాధ్యత రాష్ట్రాల చేతిలో ఉండాలి. కానీ కేంద్రం కర్ర పెత్తనం చేస్తున్నది. సాగులో లేని బీడు భూములు తెలంగాణలో అయిదు శాతంవరకు ఉన్నాయి. వాటిని సాగులోకి తెచ్చేందుకు భూమి అభివృద్ధికార్యక్రమాలు చేపడుదాం అంటే ఆ ప్రాజెక్ట్‌ను పనుల జాబితాలోంచి తీసివేశారు.

-బి. అవినాష్, జనగామ

## హైస్కూళ్లలో ప్రాథమిక తరగతులు వద్దు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 900ఉన్నతపాఠశాలల్లో 3,4, 5 తరగతులను కొనసాగిస్తూ కొత్తగా 1,2 తరగతులను కూడా విలీనంచేస్తామని విద్యాశాఖ పేర్కొన్నది. 117 రద్దు చేసి హై స్కూళ్లలోని 3,4,5 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లోకి వెనక్కి పంపంచమని విజ్ఞప్తి చేస్తుంటే 1,2 తరగతులనుకూడా హైస్కూళ్లలో విలీనం చేయటం ఎంత వరకు సబబు. 3,4,5 తరగతులను హైస్కూళ్లలో గత ప్రభుత్వంవిలీనం చేయటంతో ప్రభుత్వ ప్రాథమిక విద్యా వ్యవస్థ నిర్వీర్యమైంది. ప్రస్తుత ప్రభుత్వం 1,2 తరగతులను కూడా హై స్కూళ్లలో విలీనం చేస్తే ప్రాథమిక విద్యా వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయ్యే అవకాశం ఉంది.

-వి. సురేష్, నెల్లూరు జిల్లా

## ఎన్ఐసిని అనుసంధించాలి

సెంట్రల్ గోవ్స్ హెల్త్ సిస్టమ్ లబ్ధిదారుల అన్ని ప్రయోజనాల కోసం ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్‌పై అమలు చేయబడుతోంది. చాలా రోజులనుండివ్యవస్థ ఎన్ఐసితో అనుసంధానించబడింది. రోగులకు చికిత్స చేసేటప్పుడు కొన్ని రోజులలో ఈ సమస్య ఉన్నప్పటికీ, ఇది ఎక్కువ కాలం అడ్డంకిని సృష్టించలేదు. ఇటీవల కొత్త సాఫ్ట్‌వేర్‌బదులుగా ఎన్ఐసిని అనుసంధానించినట్లు కనిపిస్తుంది. లబ్ధిదారులు టోకెన్లను పొందలేకపోతున్నారు. ఈ కొత్త వ్యవస్థ దాని వ్యయంతో సంబంధం లేకుండా అధికారికంగా మరింత వేగంగా సౌకర్యవంతంగా ఉండాలి. దీనితీవ్రత శీఘ్ర చికిత్స లేదా ప్రవేశం అవసరమయ్యే రోగులతోముడిపడిఉంది. ఈలబ్ధిదారుల సెంట్రల్ యూనియన్ ఈ పరిస్థితిని దాని పరిచర్యకునివేదించింది. మంచి, వేగవంతమైన పనిచేయగల వ్యవస్థను వెంటనే కనెక్ట్‌చేయాలి. లేదా దానిలోపాలను ఎత్తి చూపాలి.

- బొల్లోజు మేఘనధమ్, విశాఖపట్నం

## సహజ డెలివరీలకు ప్రాధాన్యమివ్వాలి

మే నెలమొదటివారంలో అంతర్జాతీయ మంత్రసానుల దినోత్సవం జరిగిందని వార్తల్లోచూసాను. హైదరాబాద్‌లోని ఫెర్నాండజ్ హాస్పటల్‌వారు మేనెల 3నుండి5 వతారీఖు వరకు మంత్రసాని దినోత్సవం ఘనంగా జరుపుకున్నది. దశాబ్దాలక్రితం వరకు పల్లెటూళ్లలో మంత్రసానులు ఎటువంటి కష్టమైన పురుళ్లను ఇళ్ళల్లోనే నులకమంచాల మీద ఏ పరికరాలు వాడకుండా అతి తెలిగ్గా పోసేవారు. వీరికి చదువు లేకపోయినా అనుభవంతోనే ఈ పనిచేసేవారు. పురిటిగదులు ఎ.సి.లుకావు. గదుల శానిటైజేషను కూడాచేసేవారుకారు. ఈమధ్య ప్రభుత్వం కూడా సాధ్యమైనంత వరకు సిజేరియన్ జోలికి వెళ్లక సహజ డెలివరీలకు ప్రాధాన్యమివ్వాలని సూచన చేయడం హర్షదాయకం.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## నిపుణుల కమిటీ అవసరం

తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల విషయంలో ఒక విచిత్రమైన పరిస్థితి ఏర్పడింది. ఏర్పడింది అనడం కంటె రాష్ట్ర ప్రభుత్వమే ఇలాంటి పరిస్థితిని సృష్టించింది అని చెప్పడమే సమంజసంగా ఉంటుంది. పదవీ విరమణ చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకుపదవీ విరమణ బెనిఫిట్స్ ఇవ్వటం సంప్రదాయం. కాని ఆసంప్రదాయాన్ని ప్రస్తుత ప్రభుత్వం పక్కన పెటడం వలన దుస్థితి ఏర్పడింది. ఆదాయమంతా గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించడానికే పోతోందని చెప్తున్నారు.

-జి.అశోక్, గోదూరు, జగిత్యాలజిల్లా

మన విని: ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# సాగు రంగంలో జన్యు సవరణ సరికొత్త విప్లవం

ప్రయోగశాలలు పరిశోధనా క్షేత్రాల్లో కనిపించిన అద్భుతమైన ఫలితాలు రైతు పొలాల్లోనూ రావాలంటే సరైన సాగు పద్ధతులు పాటించాలి. దీనిపై రైతులకు తగిన శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉంది. నాణ్యమైన, ప్రమాణీకరించిన విత్తనాలను సరైన సమయంలో, సరసమైన ధరలకు రైతులకు అందుబాటులో ఉంచడం మరో సవాలు. ఈ కొత్తసాంకేతిక పరిజ్ఞానం వంగడాలపై శాస్త్రీయ సమాచారాన్ని సులభమైన భాషలో రైతులకు, ప్రజా సంఘాలకు, వినియోగదారులకు చేరవేయడం ద్వారా అవగాహన పెంచాలి. రైతులకు ప్రదర్శన క్షేత్రాలను ఏర్పాటు చేసి,వారు స్వయంగా వీటి పనితీరును పరిశీలించే అవకాశం కల్పించాలి. సమర్థవంతమైన విత్తన ఉత్పత్తి పంపిణీ వ్యవస్థను నెలకొల్పాలి. ఈ వంగడాలపై జరిగిన జరుగుతున్న భద్రతా పరీక్షల వివరాలను పారదర్శకంగా వెల్లడించాలి. అలాగే నియంత్రణ పరమైన అడ్డంకులను తగ్గించాలి. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయం.

డి.జె మోహన రావు

భారతీయ వ్యవసాయ పరిశోధనా చరిత్రలో ఒక మహత్తర ఘట్టం ఆవిష్కృతమైంది. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దేశంలోనే మొట్టమొదటి సారిగా జన్యు సవరణ (జీనోమ్ ఎడిటెడ్) సాంకేతికతద్వారా అభివృద్ధి చేయబడిన విప్లవాత్మకమైన రెండు వరి వంగడాలను విజయవంతంగా విడుదల చేసినట్లు ప్రకటించారు. ఈ నూతన వంగడాలు 'కమల' (డీఆర్ఆర్ ధాన్ 100), 'పూసా డీఎస్టీ రైస్ 1' భారతీయ వ్యవసాయ పరిశోధనా రంగానికి ఒక కొత్త దిక్సూచిగా నిలుస్తాయి. ఇది కేవలం సాంకేతికపరమైన విజయం మాత్రమే కాదు, మారుతున్న వాతావరణ పరిస్థితులు దేశంలో వేగంగా పెరుగుతున్న జనాభా ఆహార అవసరాలను దృష్టిలో ఉంచుకుని చూస్తే ఈ పరిణామం దేశ వ్యవసాయ భవిష్యత్తుకు ఒక బలమైన భరోసాను కలిగిస్తుంది. ఈ చారిత్రాత్మకమైన వంగడాలను మే 2025లో అధికారికంగా విడుదల చేయడం జరిగింది. అయితే ఇవి ప్రస్తుతం పరిశోధనా దశ నుండి క్షేత్రస్థాయిలో రైతుల సాగుకు అందుబాటులోకి రావడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉంది. రైతుల కోసం నాణ్యమైన విత్తనాలఉత్పత్తి, వాటిని విస్తృతంగా పంపిణీ చేసే ప్రక్రియలు పూర్తి కావాల్సి ఉంది. ఈ నూతన వంగడాలు జన్యు సవరణ పద్ధతిలో అభివృద్ధి చేయబడ్డాయి. జన్యుమార్పిడి (జీఎం) పద్ధతిలో ఒక జీవి (ఉదా: వరి మొక్క) జన్యువులలోకి పూర్తిగా భిన్నమైన మరొక జీవి (ఉదా: బ్యాక్టీరియా, వైరస్ వేరే మొక్క) నుండి వేరుచేసిన జన్యువులను శాశ్వతంగా ప్రవేశపెడతారు. అంటే, మొక్క జన్యు పదార్థంలోకి 'విదే' డీఎన్ఏ' చేరుతుంది. ఈ విధంగా బయటి నుండి చేర్చబడిన జన్యువుల ద్వారా మొక్కలో కొత్త లక్షణాలు వస్తాయి. దీనికి భిన్నంగా, జన్యు సవరణ (జీనోమ్ ఎడిటింగ్) అనేది ఒక మొక్క సొంత జన్యువులలోనే అత్యంత ఖచ్చితమైన, నిర్దిష్టమైన మార్పులు చేసే అధునాతన పద్ధతి. క్రిస్పర్‌కాస్ వంటి సాధనాలను ఉపయోగించి, మొక్క డీఎన్ఏలోని కావలసిన నిర్దిష్ట భాగాలను కత్తిరించడం, తొలగించడం చాలా స్వల్ప మార్పులు చేయడం జరుగుతుంది. ఈ ప్రక్రియ సహజంగా జరిగే మ్యూటేషన్స్ వలెనే ఉంటుంది. కానీ ప్రయోగశాలలో అత్యంత నియంత్రిత, ఖచ్చితమైన పద్ధతిలో నిర్వహిస్తారు. ఈ పద్ధతిలో బయటి నుండి ఎటువంటి అదనపు జన్యువులను మొక్కలోకి చేర్చరు. బదులుగా మొక్క సొంత జన్యు పదార్థంలోనే నిర్దిష్టమైన మార్పులు చేయడం ద్వారా కావలసిన లక్షణాలను (అధిక దిగుబడి, తెగుళ్ల నిరోధకత వంటివి) తీసుకురావడం దీని ముఖ్య ఉద్దేశ్యం. జన్యు సవరణలో మొక్క సొంత జన్యువులలోనే నిర్దిష్ట మార్పులుచేస్తారు. బయటి డీఎన్ఏ సాధారణంగా ఉపయోగించరు. ఈ ప్రాథమిక భేదం నియంత్రణ ఆమోదం పరంగా చాలా ప్రాధాన్యతను సంతరించుకుంది. 'కమల' (డీఆర్ఆర్ ధాన్ 100) వంగడాన్ని ఐసీఏఆర్ ఆధ్వర్యంలోని ఐఐఆర్ఆర్, హైదరాబాద్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఇది తెలుగు రాష్ట్రాలతో సహా దేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందిన సాంబ మసూరి (బీపీటీ 5204) రకం నుండి జన్యు సవరణ ద్వారా మెరుగుపరచబడింది. రెండవ వంగడం 'పూసా డీఎస్టీరైస్ 1' ను ఐసీఏఆర్ ఆధ్వర్యంలోనిఐఏఆర్ఐ, న్యూఢిల్లీ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. దీనికి మూలంగా ఎంటీయు 1010 (కాటన్ దొరా సన్నాలు) అనే మరొక ప్రసిద్ధ సన్నగింజల వరి రకాన్ని ఉపయోగించారు. ఈ రెండు వినూత్నమైన వంగడాలను క్రిస్పర్‌కాస్ ఆధారిత ఎస్డీఎన్1 అనే ఒక ప్రత్యేకమైన జన్యు సవరణ పద్ధతిని ఉపయోగించి అభివృద్ధి చేయడం జరిగింది. 'కమల'



వంగడం, సాంబ మసూరి కంటే దాదాపు 19శాతం అధిక దిగుబడినిచ్చే సామర్థ్యాన్ని కలిగి ఉంది. సాధారణంగా 145 నుండి 150 రోజుల వరకు సమయం తీసుకునే సాంబ మసూరితో పోలిస్తే, 'కమల' కేవలం సుమారు 130 రోజుల్లోనే అంటే 15నుండి 20 రోజులు ముందుగానే కోతకు వస్తుంది (పక్వానికి రావడం). ఈ తక్కువ కాల వ్యవధి కారణంగా సాగునీటి వినియోగం గణనీయంగా తగ్గి, విలువైన నీటిని ఆదా చేయవచ్చు. అంతేకాకుండా ఈ వంగడం కరువు పరిస్థితులను కూడా సమర్థవంతంగా తట్టుకునే శక్తిని కలిగి ఉంది. అధిక నత్రజని వినియోగ సామర్థ్యాన్ని కలిగి ఉండటం వల్ల వ్యవసాయంలో ఎరువుల వాడకం కూడా తగ్గించవచ్చు. దీని కాండం చాలా గట్టిగా ఉండటం వల్ల బలమైన గాలులకు, ఇతర వాతావరణ పరిస్థితులకు పంట నేల కూలకుండా తట్టుకుంటుంది. ఈ తక్కువ కాల వ్యవధి పర్యావరణానికి కూడా ఎంతో మేలు చేస్తుంది మీథేన్ వంటి హరితగృహ వాయువుల ఉద్గారాలను తగ్గిస్తుంది. నాణ్యత పరంగా సాంబమసూరి మంచి గింజ, దాని ప్రత్యేకమైన వంట నాణ్యతను ఏ మాత్రం కోల్పోకుండా నిలుపుకుంది. ఇక రెండవ వంగడం 'పూసా డీఎస్టీ రైస్ 1' కరువుతో పాటు నేలలోని అధిక లవణీయతను (ఉప్పుదనం) కూడా సమర్థవంతంగా తట్టుకోగల ప్రత్యేకమైన లక్షణాన్ని కలిగి ఉంది. ఈ ప్రత్యేకమైన లక్షణాన్ని డీఎస్టీ అనే నిర్దిష్ట జన్యువును సవరించడం ద్వారా సాధించారు. దీనిని ముఖ్యంగా కరువు ఎక్కువగా ఉండే ప్రాంతాలు, అధిక లవణీయత కలిగిన నేలలు లేదా తీర ప్రాంతాలకు అనుకూలంగా అభివృద్ధి చేశారు. ఒత్తిడితో కూడిన (అధిక లవణీయత, తీవ్రమైనకరవు) పరిస్థితుల్లో ఈ వంగడాన్ని సాగు చేసినప్పుడు, ఇది దాని మూల వంగడమైన ఎంటీయు 1010 కంటే గణనీయంగా ఎక్కువ దిగుబడినిచ్చింది (దాదాపు 9.66శాతం నుండి 30.4శాతం వరకు). ఈవంగడం కూడా ఎంటీయు 1010 లోని ప్రత్యేకమైన సన్నగింజల నాణ్యతను కలిగి ఉండటం విశేషం. అంతేకాకుండా, ఈ రెండు వంగడాలు కూడా తక్కువ మొత్తంలో ఎరువులను ఉపయోగించి పెరిగే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. వీటిఅధిక దిగుబడి సామర్థ్యం నేరుగా రైతుల ఆదాయాన్ని పెంచుతుంది. కరవు, అధిక లవణీయత వంటి తీవ్రమైన వాతావరణ సవాళ్లను సమర్థవంతంగా తట్టుకునే లక్షణాలు ఉండటం వల్ల పంటనష్టాన్ని గణనీయంగా తగ్గించి, రైతాంగానికి ఒక రకమైన భరోసాను కలిగిస్తాయి. వీటి సాగుకు తక్కువ నీటిని ఉపయోగించడం వల్ల విలువైన నీటివనరులను సంరక్షించవచ్చు. పర్యావరణ హితమైన సాగు పద్ధతులు భవిష్యత్ తరాల కోసం సహజ వనరులను పరిరక్షించడంలో సహాయపడతాయి. ఈ కొత్త వరి వంగడాలు భవిష్యత్ వంగడాల లక్ష్యాన్ని చేరుకోవడంలో ఒక కీలకమైన పాత్ర పోషిస్తాయి. జన్యు సవరణ వంటి అత్యాధునిక సాంకేతికతపై రైతుల్లో, సామాన్య ప్రజల్లోసరైన అవగాహన లేకపోవడం ఒక ముఖ్యమైన సమస్య. వీటి భద్రతపై శాస్త్రీయ ఆధారాల సమాచారాన్ని ప్రజలకు అందించడం ప్రభుత్వ కర్తవ్యం. ప్రయోగశాలలు పరిశోధనా క్షేత్రాల్లో కనిపించిన అద్భుతమైన ఫలితాలు రైతు పొలాల్లోనూ రావాలంటే సరైన సాగు పద్ధతులు పాటించాలి. దీనిపై రైతులకు తగిన శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉంది. నాణ్యమైన, ప్రమాణీకరించిన విత్తనాలను సరైన సమయంలో, సరసమైన ధరలకురైతులకు అందుబాటులో ఉంచడం మరో సవాలు. ఈ కొత్తసాంకేతిక పరిజ్ఞానం వంగడాలపై శాస్త్రీయ సమాచారాన్ని సులభమైన భాషలో రైతులకు, ప్రజా సంఘాలకు, వినియోగదారులకు చేరవేయడం ద్వారా అవగాహన పెంచాలి. రైతులకు ప్రదర్శన క్షేత్రాలను ఏర్పాటుచేసి, వారు స్వయంగా వీటి పనితీరును పరిశీలించే అవకాశం కల్పించాలి. సమర్థవంతమైన విత్తన ఉత్పత్తి పంపిణీ వ్యవస్థను నెలకొల్పాలి. ఈవంగడాలపై జరిగిన జరుగుతున్న భద్రతా పరీక్షల వివరాలను పారదర్శకంగా వెల్లడించాలి. అలాగే నియంత్రణ పరమైన అడ్డంకులను తగ్గించాలి. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయం భవిష్యత్తులో మరిన్ని పటిష్టమైన చర్యలు ఆశిద్దాం. ●

# భద్రతా మండలిలో పాక్‌కు చీవాట్లు

కనుమ ఎల్లారెడ్డి

పహెల్గాం దాడిలో పాక్‌కు చెందిన లష్కరే హస్తం ఉండటంతో, దాన్ని పక్కదారి పట్టించాలన్న పాక్ కుటిల శక్తులు పారలేదు. ఐక్యరాజ్య సమితిలోని భద్రతా మండలిలో పాక్, పహెల్గాం ఉగ్రదాడి భారత్ స్వయంకృతం అని చెప్పబోయి చతికిలపడింది. భద్రతామండలిలో పాక్ ప్రతినిధి అసిమ్ ఇఫ్తిఖర్ అహ్మద్‌కు తగిన గుణపాఠం భద్రతా మండలి చెప్పింది. పాక్‌కు ఏ ఒక్క దేశం మద్దతు పలుకలేదు. పాక్ మిత్ర దేశం అయిన చైనా కూడా పాక్‌కు మద్దతు చెప్పలేదు. పైగా భారత్ మాపై దాడిచెస్తే విశ్వంలో ఎవరూ మిగలరు అని పాక్ రక్షణ మంత్రి ఖవాజావ్యాఖ్యలు దుమారం లేపాయి. ఆది భారత్‌పై మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తోంది. భద్రతా మండలిలోని సభ్యులు పాక్‌ను ఉక్కిరి, బిక్కిరిచేసి మీవి తప్పులు పెట్టుకుని మళ్లీ భారత్ పై చాడీలు చెబుతారా! అంటూ ఏకి పారేసింది. ఉగ్రదాడులు మీవి, లష్కరే మీభూభాగం లోనిది, అణు ఆయుధాలు, క్షిపణుల ప్రయోగం మీరు చేస్తున్నారు అని భద్రతా మండలి పాక్ పై నిప్పులు చెరిగింది. పర్యాటకుల మీద దాడి చేయడం హేయం. వాస్తవాలు కళ్ల ముందు కనిపిస్తూఉంటే భారత్ చూస్తూ ఊరుకోదు. మీ రెండుదేశాలు చర్చలద్వారా ఉద్రిక్తతలు తగ్గించుకోవాలి అని భద్రతా మండలి పాక్‌కు హితవు పలికింది. చైనా మద్దతు ఏలాగూ భారత్‌కు ఉండటంతో భారత ప్రధాని మోదీ భద్రతా మండలిలోని శాశ్వత సభ్య దేశాలైన అమెరికా, బ్రిటన్, రష్యా, ఫ్రాన్స్ దేశాలతో పాక్ వైఖరిని, ఉగ్రదాడిని వివరించారు. భద్రతా మండలిలో పాక్ ఏకాకి అయిపోయింది. ఇది భారత్ సాధించిన విజయం. అయినా పర్యాటకులను చంపటం భారత్‌ను ప్రతీకారం తీర్చుకోమంటూనే చెబుతోంది. ప్రతీకారంతో సహా పాక్ ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టి, కోలుకోలేని స్థితికి తేవాలనే





యోచనలో భారత్ ఉంది. భారత్‌తో పోరాడితే మనకే నష్టం అని పాక్‌లోని ఓ మత గురువు చెప్పడం, అక్కడి మసీదులో ఉన్న వాళ్లు కూడా ఎవరూ పాక్‌కు అనుకూలంగా మాట్లాడ లేదు. తప్పు మాదే అనే మిషతో ఉన్నారు. పాక్ ప్రజలు కూడా పాక్‌నే తిట్టి పోస్తుంటే ప్రభుత్వం తలలు పట్టుకుంది. భారత్‌ను శరణు వేడటమే తరువాయి అప్పుడే భారత్ శాంతిస్తుంది. లేకపోతే పాక్ నామరూపాలు లేకుండా పోతుంది. యుద్ధానికి భారత్ చేస్తున్న అన్నీ ప్రయత్నాలను పాక్ నిశితంగా గమనిస్తోంది. కనుక ఉగ్రదాడికి మేము మీతో పయనిస్తామని, తప్పు అయిందని క్షమాపణ కోరితే భారత్ స్పందిస్తుంది. లేకపోతే పాక్ తీవ్ర పరిణామాలు చూడవలసి వస్తుంది. పాక్‌కు విశ్వంలో ఏ దేశం మద్దతు పలకదు. ఇప్పటికే పాక్ ఆర్మీ వాహనం పై ఉగ్రమూకలు దాడిచేసి ఏడుగురు సైనికులను పొట్టన బెట్టుకున్నారు. బలూచిస్థాన్ ఉగ్రవాదులు ఈ దాడిచేశారని పాక్ అనుమానం. ఇంకా నయం ఈ దాడి భారత్ చేసింది అని అనలేదు. ఉగ్రవాదాన్ని పెంచి, పోషించేది పాక్ ఏ అని ఈ సంఘటనతో రుజువైంది. భద్రతా మండలి అధ్యక్షుడుకూడా సెకెరిస్ కూడా పాక్‌ను తప్పు పట్టారు. ఇప్పుడు భారత్‌తో, పాక్ మిత్రత్వాన్ని కోరుకోవాలి. పాక్ సరిహద్దు, రాజస్థాన్‌లో భారత్ వాయు సేన భారీస్థాయిలో యుద్ధానికి సిద్ధమైంది. అక్కడ మాక్ డ్రిల్ నిర్వహణ ప్రారంభమైంది. అన్ని అస్త్రాలు సిద్ధం చేసుకుని పక్కా దాడి చేయాలని భారత్ సన్నద్ధమవుంది. పాక్ ఆత్మరక్షణలో పడింది. భారత్‌తో సామరస్యానికి ముస్లిం దేశాలను ఉపయోగిస్తోంది. ఆ దేశాలు కూడా పాక్ కుటిల పద్ధతులను ఎండ గట్టాయి. పహెల్గాం దాడిని అన్ని దేశాలు పాక్‌ను దోషిగా చూపిస్తున్న తరుణంలో పాక్‌కు ఒక్కటే దారి, భారత్‌తో చేయి కలిపి ఉగ్రదాడులకు క్షమాపణ చెప్పి, ఉగ్రవాదులను ఏరి వేస్తామని, భారత్‌కు అండగా ఉంటామని చెప్పడమే పాక్‌కు శ్రేయస్కరం. మరి పాక్ ఆ దిశలో అడుగులు వేస్తుందో లేదో, భారత్ అంగీకరిస్తుందో లేదో ప్రతీకార జ్వాలతో ఉంటుందో కాలమే సమాధానం చెప్పాలి. ●

# ప్రభుత్వ ఉద్యోగాలపైనే యువత చూపు

తరిగోపుల నారాయణస్వామి

ఈ రోజుల్లో మన సామాజిక జీవనంలో ఒక విచిత్రమైన విరుద్ధత కనిపిస్తోంది. సేవల విషయంలో ప్రజలు అధికంగా ప్రైవేటు రంగాన్ని ఆశ్రయిస్తున్నా, ఉద్యోగాల విషయంలో మాత్రం ప్రభుత్వరంగానికే మొగ్గు చూపుతున్నారు. ఈ భావన సామాజికంగా స్థిరపడిపోవడం ఒకవైపు ఆలోచనాత్మకమైనదిగా, మరోవైపు ప్రభుత్వ రంగంపై ప్రజల అపార నమ్మకానికి సంకేతంగా నిలుస్తోంది. ఉదాహరణకు విద్యారంగాన్ని తీసుకుంటే, చాలామంది తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలు, కార్పొరేట్ విద్యాసంస్థలను ఆశ్రయిస్తున్నారు. ఫీజు భారమున్నా, మెరుగైన భవిష్యత్తు కోసం వాటినే ఎంచుకుంటున్నారు. కానీ అదే తల్లిదండ్రులు తమ పిల్లలు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా స్థిర ఉద్యోగం పొందాలని కోరికపడుతున్నారు. ఇది ప్రత్యక్షంగా చూస్తే, సేవల విషయంలో ప్రైవేట్, ఉద్యోగాల విషయంలో మాత్రం ప్రభుత్వరంగానికే అధిక ప్రాధాన్యత ఇవ్వడం గమనించదగిన అంశం. వైద్యరంగంలోనూ ఇదే విరుద్ధత కనిపిస్తుంది. ప్రజలలో మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రులవైపు మొగ్గు స్పష్టంగా కనిపిస్తుంది. కానీ ప్రభుత్వ వైద్యశాఖల్లో ఉద్యోగం పొందాలని యువత పోటీ పడుతుంది. విశేషంగా చూస్తే, సేవలకు ప్రైవేట్, ఉద్యోగ భద్రతకు మాత్రం ప్రభుత్వ రంగం – ఇదే ధోరణి. రవాణా వ్యవస్థలోనూ ప్రజల నిత్య జీవితంలో ప్రైవేట్ క్యాబ్‌లు, ఆటోలు, బస్సులపాత్ర పెరుగుతున్నా, ప్రభుత్వ రవాణాసంస్థల్లో ఉద్యోగం కోసమే పోటీ పరీక్షలు పెరుగుతున్నాయి. ఇది ప్రభుత్వ రంగంపై ఉన్న గౌరవానికి ప్రతిరూపం కావొచ్చు. కానీ అదే సమయంలో, ప్రభుత్వం అందించే రవాణా సేవలను ప్రజలు విస్మరిస్తుండటంలో సమకాలీన అభ్యాసాల స్పష్టత దాగివుంది. టెలికాం రంగంలో జియో, ఎయిర్‌టెల్ వంటి సంస్థల సేవలు వినియోగిస్తూ ఉండే యువత బిఎస్ఎన్ఎల్ వంటి ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాలు రావాలని కలలు కంటున్నాడు. ఈ విధంగా, సమాజం సేవలకు, ఉపాధికి మధ్య స్పష్టమైన విభజనను చాటిచెప్పుతోంది. ఇంధన రంగంలోనూ ఈ విరుద్ధత కనిపిస్తుంది. గ్యాస్ పంపిణీ, డిజిటల్ సర్వీసులు వంటి అంశాల్లో ప్రైవేట్ సంస్థల ఆధిపత్యం పెరుగుతోంది. కానీ ఇండియన్ ఆయిల్, హెచ్‌పీసీఎల్ వంటి ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగం పొందాలని యువత ఆసక్తిని చూపుతోంది. ఇంటర్నెట్, టెక్నాలజీ రంగాల్లోనూ ప్రజలు గూగుల్, ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటి ప్రైవేట్ సేవలపై పూర్తిగా ఆధారపడుతున్నారు. కానీ ప్రభుత్వ ఐటీశాఖలు, నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ వంటి సంస్థల్లో ఉద్యోగం కావాలని ప్రయత్నిస్తున్నారు. అంటే సేవలు ప్రైవేటు రంగంలో, ఉద్యోగాల పట్ల మాత్రం ప్రభుత్వ రంగంపై ఆశ. గ్రామీణాభివృద్ధి రంగంలో,



ప్రభుత్వ పథకాల అమలుకు అవసరమైన సిబ్బందినిప్రజలు ఆశిస్తున్నారు. అయితే గ్రామాల్లోనూ ప్రైవేట్ నాన్‌గవర్నమెంటల్ సంస్థల (ఎన్జీవో) సేవలు పెరుగుతున్నాయి. కానీ ఉద్యోగం మాత్రం గ్రామీణ అభివృద్ధి శాఖల్లోనే కావాలని యువత భావిస్తోంది. బహుళరంగాల్లో ఈ ధోరణి విస్తరించి ఉంది. అనేక మంది విద్యార్థులు, ప్రభుత్వ రంగాలపై నమ్మకంతో కోచింగ్ సెంటర్లలో పోటీ పరీక్షల కోసం ఖర్చులు వెచ్చిస్తున్నారు. అయితే జీవనశైలిలో మాత్రం ప్రైవేట్ సేవలపై ఆధారపడుతున్నారు. ఇది వ్యక్తిగత ఆశలతో సహా సామాజిక ఆర్థిక పరిణామాలనూ ప్రతిబింబిస్తుంది. ఇక్కడ ఒక ప్రశ్న తలెత్తుతుంది. సేవల విషయంలో ప్రభుత్వ రంగాన్ని నమ్మకుండా, ఉద్యోగం విషయంలో మాత్రం ప్రభుత్వ రంగానికే అధిక ప్రాధాన్యం ఇవ్వడం సమంజసమా? ఇది ప్రభుత్వ రంగంపై భద్రత, గౌరవం, స్థిరత అనే నమ్మకంతో కూడిన నిర్ణయం కావొచ్చు. కానీ అదే సమయంలో ప్రభుత్వ రంగసేవలపై ప్రగాఢ విశ్వాసం లేకపోవడం కూడా తెలుస్తోంది. ప్రజల ఈ తత్వం వల్ల ప్రభుత్వ రంగంపై ఉద్యోగాల ఒత్తిడి పెరిగిపోతోంది. ఉద్యోగాలు అధిక సంఖ్యలో ఇవ్వాల్సిన అవసరం ఏర్పడుతోంది. అయితే ఇది ఆర్థికపరంగా సాధ్యమైనది కాదు. ప్రభుత్వం అందించే ఉద్యోగాల పరిమితి ఉండటం వల్ల, నిరుద్యోగిత సమస్య తీవ్రంగా కనిపిస్తోంది. అయితే, ప్రైవేట్ రంగాన్ని పూర్తిగా విస్మరించకూడదు. ప్రస్తుతం ఎంతో మందియువత ప్రైవేట్ రంగాలలోనే తమ సామర్థ్యాన్ని చూపిస్తున్నారు. స్టార్టప్‌లు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, డిజిటల్ సేవలు వంటి విభాగాల్లో అనేక ఉద్యోగాలు నెలకొంటున్నాయి. ఈ అవకాశాలను గౌరవంగా స్వీకరించడం సమాజ అభివృద్ధికి అవసరం. మరోవైపు, ప్రభుత్వ రంగం తన సేవల నాణ్యతను మెరుగుపరచాల్సిన అవసరంఉంది. సేవలలో నాణ్యత పెరిగితే, ప్రజలు ఉద్యోగాలపరంగా మాత్రమే కాకుండా, సేవల పరంగానూ ప్రభుత్వరంగంపై మరింత నమ్మకంతో ముందుకు వస్తారు. ప్రజలలో ఉండే ఈ విరుద్ధ ధోరణిని గుర్తించి, సమగ్రంగా సమాజాన్ని అభివృద్ధి దిశగా నడిపించాలంటే ప్రభుత్వరంగానికి మరింత సామర్థ్యాన్ని ఇచ్చేందుకు, ప్రజల నమ్మకాన్ని మరింత బలపరిచేందుకు అవసరమైన విధానాలపై దృష్టిపెట్టాలి. ఉద్యోగభద్రత, గౌరవం, వేతన సమతుల్యత వంటి అంశాల్లో ప్రభుత్వరంగం ఎలా నిలబడతుందో, అదే రీతిగా సేవల నాణ్యతలోనూ నిలవాల్సిన అవసరం ఉంది. అప్పుడే ఈ విరుద్ధ ధోరణితొలగి, సమతుల్య అభివృద్ధి సాధ్యమవుతుంది. సహజంగా ప్రతిఒక్కరూ ప్రభుత్వ రంగంలో సేవలు పొందాలనే లక్ష్యం తో ముందుకెళ్లాలి. ఉద్యోగం కోసం ప్రభుత్వ రంగాన్ని ఆశించడంలో తప్పేమీ లేదు. అయితే అదే సమానంగా, సేవల విషయంలోనూ ప్రభుత్వ రంగాన్ని అభివృద్ధి చేసి, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం అవసరం. అప్పుడు మాత్రమే ప్రభుత్వ రంగం అంటే ఉద్యోగ భద్రత మాత్రమే కాదు – నాణ్యమైన సేవల మూలం కూడా అనే అవగాహన ఏర్పడుతుంది. ●

# సరిహద్దుల్లో ఆగని కాల్పులు



## ఆపరేషన్ సింధూర్‌తో పాకిస్థాన్‌కు వణుకు

**శ్రీనగర్, మే 7:** భారత వైమానిక దాడుల తర్వాత నియంత్రణరేఖ, అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి పాకిస్థాన్ భారీగా కాల్పులు జరుపుతోంది. ముఖ్యంగా సరిహద్దు గ్రామాలు, ప్రజల ఇళ్లపై మోర్టార్లు, ఫిరంగులను ప్రయోగించింది. పాక్ కాల్పుల్లో సరిహద్దు గ్రామాలకు చెందిన 12 మంది ప్రాణాలు కోల్పోగా 42మంది గాయపడినట్లు పూంచ్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పర్వైజ్ అహ్మద్ వెల్లడించారు. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు చెప్పారు. పాక్ కాల్పులను భారత సైన్యం సమర్థంగా తిప్పికొడుతోంది. భారత్ ఎదురుదాడిలో పాకిస్థాన్ సైనిక పోస్టులు ధ్వంసమైనట్లు తెలుస్తోంది. భారత మెరుపు దాడులకు ఏం చేయాలో పాలుపోని పాకిస్థాన్ జమ్ముకశ్మీర్‌లో పెద్ద ఎత్తున కాల్పులు జరుపుతోంది. మోర్టార్లు, ఫిరంగులతో సరిహద్దు గ్రామాలపై దాడులకు దిగింది. పాకిస్థాన్ రేంజర్లు రాత్రి నుంచి నిరంతరాయంగా జరుపుతున్న కాల్పులను భారత సైన్యం సమర్థంగా తిప్పికొడుతోంది. అయితే పాక్ రేంజర్లు పూంచ్ జిల్లాలో భారత సరిహద్దు గ్రామాలను, ప్రజల ఇళ్లను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరుపుతున్నారు. ఫలితంగా అమాయకులైన పౌరులు ప్రాణాలు కోల్పోగా అనేక మంది గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

పూంచ్‌తోపాటు రాజౌరి, కుప్వారా జిల్లాలోని యురి, కర్నాహ్, తంగ్దర్ సెక్టార్‌లలోనూ పాక్ భారీ ఎత్తున కాల్పులు జరు పుతోంది. భారత్ భీకరకంగా ఎదురుకాల్పులకు దిగడంతో పాక్‌వైపు ఆర్మీ పోస్టులు ధ్వంసమై నట్లు తెలుస్తోంది. పొరుగుదేశంలో భారీగానే నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. భారత్‌పాక్ మధ్య ఉద్రిక్తపరిస్థితుల నేపథ్యంలో జమ్మూ ప్రాంతంలోని ఐదు సరిహద్దు జిల్లాల్లోని అన్ని విద్యా సంస్థలనుమూసివేశారు. జమ్ము, సాంబ, కథువ, రాజౌరి, పూంచ్ జిల్లాల్లో విద్యాసంస్థలు బుధవారం మూసివేస్తున్నట్లు డివిజినల్ కమిషనర్ రమేష్ కుమార్ చెప్పారు. పాకిస్థాన్ కాల్పుల్లో సరిహద్దు గ్రామాల్లో ఇళ్లు, దుకాణాలు, అనేక వాహనాలు దెబ్బతిన్నాయి. పాక్ కాల్పుల నుంచి తప్పించుకునేందుకు సరిహద్దు గ్రామాల ప్రజలు భూగర్భ బంకర్లలో ఆశ్రయం పొందుతున్నారు. మరికొంత మంది సురక్షిత ప్రాంతాలకు వలసపోతున్నారు. పాకిస్థాన్‌తో సరిహద్దులు పంచుకుంటున్న పంజాబ్‌లోనూ అప్రమత్తత ప్రకటించారు.

ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో సరిహద్దు జిల్లాలైన ఫిరోజ్‌పూర్, పఠాన్ కోట్, ఫజిల్కా, అమృత్ సర్, గురుదాస్‌పూర్‌లో నేడు అన్ని విద్యాసంస్థలను మూసివేశారు. పఠాన్‌కోట్ జిల్లాలో 72 గంటలపాటు విద్యాసంస్థలను మూసివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో శ్రీనగర్ సహా 18 విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేశారు. శ్రీనగర్ విమానాశ్రయాన్ని భారత వాయుసేన ఆధీనంలోకి సుకుంది. లేహ్, జమ్ము, అమృత్‌సర్, పఠాన్‌కోట్, చండీగఢ్, జోధ్‌పూర్, జైసల్మేర్, షిమ్లా, ధర్మశాల జామ్‌నగర్ విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేశారు. భారత విమానయాన సంస్థలు దాదాపు 200కుపైగా విమానాలను రద్దు చేశాయి. ఒక్క ఇండిగోనే 165పైగా విమానాలను రద్దు చేసింది. ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, స్పైస్‌జెట్, ఆకాశ ఎయిర్, కొన్ని విదేశీ విమానయాన సంస్థలు వేర్వేరు విమానాశ్రయాలకు తమ విమానాలను రద్దు చేశాయి.



# 'ఆపరేషన్ సింధూర్'

## ప్రధానిమోడీ పెట్టినపేరే!

**న్యూఢిల్లీ, మే 7:** పహల్గాం ఉగ్రదాడిపై ప్రతీకారంతో రగిలిపోయిన భారత్ తానేంటో చూపించింది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలపై ఆపరేషన్ సింధూర్ పేరిట విరుచుకుపడింది. అయితే భారత్ మెరుపు దాడులకు ఆపరేషన్ సింధూర్ అనే పేరును ఎవరు పెట్టారని దానిపై దేశవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొన్న వేళ అధికారిక వర్గాలు స్పందించాయి. ఆపరేషన్ సింధూర్ పేరును సూచించింది ప్రధాని మోడీ అని అధికారిక వర్గాలు చెప్పాయి. అంతకుముందు కూడా మోడీనే స్వయంగా పెట్టినట్లు కథనాలు వెలువడ్డాయి. మన మహిళలు భర్తలను కోల్పోయారు. ఈ ఘాతుకానికి పాల్పడిన వారిని భారత్ ఎక్కడున్నా వదిలిపెట్టదు అనేలా మన ప్రతిస్పందన కచ్చితంగా కనిపించాలి అని మోడీ అధికారులకు స్పష్టంగా చెప్పినట్లు సమాచారం. ఏప్రిల్ 22వ తేదీన పహల్గాంలోని ప్రముఖ బైసరన్ లోయలో ఉన్న పర్యటకులను ఉగ్రవాదులు లక్ష్యంగా చేసుకున్నారు. ముఖ్యంగా అక్కడ ఉన్న జంటల్లో పురుషులను వేరు చేశారు. ఆ తర్వాత వారిని మతం అడిగి మరీ కాల్చి చంపారు. అయితే ఉగ్రవాదులు చేసిన జంటల్లో అప్పటికి ఆరు రోజుల క్రితమే పెళ్లైన నవవధూవరులు వినయ్ నర్వాల్, హిమాన్షి కూడా ఉన్నారు. భారత నేవీ అధికారి అయిన వినయ్‌నర్వాల్‌ను ముష్కరులు కాల్చి చంపేశారు. తన కాళ్ల పారాణి ఆరకముందే హిమాన్షి జీవితంలో చీకటి అలుముకుంది. దీంతో వినయ్ మృతదేహం వద్ద కూర్చుని గుండెలవిసేలా ఆమె రోదించింది. అందుకు సంబంధించిన ఫొటో దేశాన్ని కుదిపేసింది. అయితే హిందూ మహిళలు తమ వివాహ స్థితిని సూచించడానికి నుదిటిన సింధూరం పెట్టుకుంటారు. పెళ్లి మండపంపై వరుడు, వధువుకు తొలిసారి సింధూరం పెడతాడు. కానీ హిమాన్షి అలా జరిగిన ఆరు రోజులకే భర్తను, తన ఐదో తనాన్ని కోల్పోయింది. అలా 26మంది మహిళల సిందూరాన్ని దూరం ఉగ్రవాదులపై ప్రతీకారం తీర్చుకునేందుకే భారత సైన్యం చేపట్టిన దాడికి ప్రధాని మోడీ ఆపరేషన్ సింధూర్ అని పెట్టినట్లు తెలుస్తోంది. అయితే మంగళవారం అర్ధరాత్రి 1:44 గంటలకు ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలపై భారత సైన్యం మెరుపు దాడులు చేపట్టింది. భారత ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీ బలగాలు సంయుక్తంగా దాడిని నిర్వహించాయి. మిస్సైళ్లతో లక్ష్యాలపై విరుచుకుపడ్డాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌తోపాటు పాకిస్థాన్‌లోని ఉగ్ర మౌలిక సదుపాయాలను ధ్వంసంచేశాయి. భారత్‌పై సీమాంతర ఉగ్రదాడులకు కుట్రపన్నినట్లు భావిస్తున్న తొమ్మిది స్థావరాలపై దాడులు చేపట్టాయి. పూర్తి కచ్చితత్వంతో దాడులు చేసినట్లు పేర్కొన్నాయి. ఉద్రిక్త పరిస్థితులకు తావులేకుండా పాక్ సైనికసదుపాయాలపై ఎక్కడాదాడులు చేపట్టలేదని వెల్లడించాయి.



## సిబిఐ డైరెక్టర్ పదవీకాలం పొడిగింపు

**న్యూఢిల్లీ, మే 7:** కేంద్ర ప్రభుత్వం సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్ పదవీకాలాన్ని పొడిగించింది. మరో ఏడాది పాటు ఆయన పదవిలో కొనసాగనున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన సిబిఐ కొత్త డైరెక్టర్ నియామకం కోసం సమావేశం జరిగిన తర్వాతనే కేంద్రనిర్ణయం వెలువడింది. సీజేఐ జస్టిస్ సంజీవ్ కన్నా, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హాజరయ్యారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం సిబిఐ డైరెక్టర్‌గా ప్రవీణ్ సూద్ పదవీకాలాన్ని పొడిగించగా.. ఈ మేరకు డీవోపీటీ ఆదేశాలు జారీ చేసింది. ప్రవీణ్ సూద్ 25 మే 2023న రెండేళ్ల పాటు సిబిఐ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఆయన ఈ పదవిలో మే 2026 వరకు కొనసాగుతారు. సోమవారం ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన ఎంపిక కమిటీ సమావేశంలో ఆయన పదవీకాలాన్ని పొడిగించాలని నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం పేర్కొంది. ప్రవీణ్ సూద్ 1986 బ్యాచ్‌కు చెందిన కర్నాటక కేడర్ ఐపీఎస్ అధికారి.

# 'తొమ్మిది ఉగ్ర స్థావరాలను ధ్వంసంచేసాం'

### విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, కర్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్

**న్యూఢిల్లీ, మే 7:** విదేశాంగశాఖ, రక్షణశాఖ సంయుక్త మీడియా సమావేశం నిర్వహించింది. ఉగ్ర ఘటనలపై మీడియా సమావేశంలో వీడియో ప్రదర్శించింది. ఈ మీడియా సమావేశంలో విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, కర్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ మీడియాతో మాట్లాడారు. పక్కా ప్లానింగ్‌తో ఉగ్రవాద స్థావరాలను మట్టుబెట్టాం అని వెల్లడించారు. సీమాంతర ఉగ్రవాదంపై పోరాటం భారత్ హక్కుగా పేర్కొన్నారు. కరుడుగట్టిన ఉగ్రవాదులు అజ్మల్ కసబ్, డేవిడ్ హెడ్లీకి ట్రైనింగ్ ఇచ్చిన శిబిరాలను ధ్వంసం చేశామన్నారు. పహల్గాం ఘటనలో 26 మందిని పొట్టన పెట్టుకున్నారు. ఉగ్ర మూకలకు పాకిస్థాన్ అండగా నిలుస్తోంది. పహల్గాం ఉగ్రదాడి వెనక టిఆర్ఎఫ్ ఉంది. టిఆర్ఎఫ్‌కు పాకిస్థాన్ అండదండలున్నాయి. లష్కరే తొయిబా, జైషే మహ్మద్‌పై ఇప్పటికే నిషేధం ఉంది. ఉగ్ర సంస్థలపై నిషేధం దృష్ట్యా టీఆర్ఎఫ్ పేరుతో కార్యకలాపాలు. టీఆర్ఎఫ్ వెనక ఉన్నది లష్కరే తొయిబా, జైషే మహ్మద్ ఉగ్ర సంస్థలే. జమ్ముకశ్మీర్‌ను అతలాకుతలం చేయడమే లక్ష్యంగా పహల్గాం దాడి. కొంతకాలంగా కశ్మీర్‌లో పర్యాటకం వృద్ధి చెందుతోంది. జమ్ముకశ్మీర్ అభివృద్ధిని అడ్డుకునేందుకే పహల్గాం దాడి. పహల్గాంలో అతి క్రూరంగా ఉగ్రదాడి జరిగింది. కుటుంబసభ్యుల కళ్ల ముందే కిరాతకంగా చంపారు. టిఆర్ఎఫ్ గురించి ఇప్పటికే ఐరాసకు ఫిర్యాదు చేశాం. ప్రత్యక్ష సాక్షుల వివరాల ఆధారంగా నిందితులను గుర్తించాం. ఉగ్రవాదాన్ని పెంచి పోషించే పాక్ చరిత్ర ప్రపంచానికి తెలిసిందే. ఉగ్రవాదంపై పోరులో భాగంగా ఇప్పటికే అనేక చర్యలు చేపట్టాం. అని విక్రమ్ మిస్రీ వెల్లడించారు. 21 స్థావరాలను గుర్తించాం. 9 కేంద్రాలను టార్గెట్ చేశాం. అనంతరం, ఆపరేషన్ సింధూర్ జరిపిన తీరును కర్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ వివరించారు. జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి మృతులకు న్యాయం


విక్రమ్ మిస్రీ


సోఫియా ఖురేషి


వ్యోమికా సింగ్

చేసేందుకే ఆపరేషన్ సిందూర్ చేపట్టాం. గత 30ఏళ్లుగా పాకిస్థాన్ టెర్రరిస్టులను సౌకర్యాలు కల్పిస్తోంది. ఆ దేశంతో పాటు పీఓకేలోనూ టెర్రరిస్ట్ క్యాంప్‌లు ఉన్నాయి. ఇంటెలిజెన్స్ సమాచారం సాయంతో మొత్తం 21 స్థావరాలనుగుర్తించాం. అందులో 9 ఉగ్రశిబిరాలను లక్ష్యంగా చేసుకున్నాం.

మేము కేవలం ఉగ్ర శిబిరాలపైనే దాడులు చేశాం. పాకిస్థాన్ పౌరులకు హాని చేయకుండా రీతిలో వీటిని నిర్వహించాం. ఆర్మీ శిబిరాలను లక్ష్యంగా చేసుకోలేదు. మే6, 7 అర్ధరాత్రి 1.05-1.30 గంటల మధ్య ఆపరేషన్ సింధూర్ జరిగింది. భారత్ టార్గెట్ చేసిన వాటిల్లో లాహోర్‌కు 40కిలో మీటర్ల దూరంలోని మురిద్కేలో లష్కరే తోయిబా కూడా ఉంది. ఇక్కడ 26/11 ముంబయి దాడులకు పాల్పలడిన ఉగ్రవాదులు అజ్మల్ కసబ్, డేవిడ్ హెడ్లీ ట్రైనింగ్ తీసుకున్నారని కర్నల్ సోఫియా ఖురేషి తెలిపారు. అధికారులు ఈ ఆపరేషన్ సింధూర్ దాడుల తీరును వివరిస్తుండగా, దాడులు వీడియో ప్రజెంటేషన్‌ను మీడియాకు ప్రదర్శించారు. సమావేశానికి ముందు గతంలో భారత్ జరిపిన దాడుల వీడియోలను ప్రదర్శించారు. ఇంకా ప్రత్యేకంగా చరిత్రలో తొలిసారి మహిళా మిలిటరీ అధికారులతో ఆపరేషన్ వివరాలని వెల్లడించడం విశేషం.

## త్రివిధ దళాలకు కేబినెట్ ప్రశంసలు

**న్యూఢిల్లీ, మే 7:** భారత త్రివిధ దళాలకు ప్రధాని మోడీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశం అభినందనలు తెలిపింది. పాకిస్థాన్ పీవోకేలోని ఉగ్రవాద స్థావరాలపై సాయుధ దళాలు నిర్వహించిన దాడి గురించి వివరించడానికి కేంద్ర ప్రభుత్వం అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఆ సమావేశం గురించి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. బుధవారం ఉదయం 11 గంటలకు దిల్లీలోని పార్లమెంట్ లైబ్రరీ భవనంలోని కమిటీ రూమ్‌లో ప్రభుత్వం అఖిల పక్ష నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేసిందని ఆయన చెప్పారు. భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన కొన్ని గంటల తర్వాత ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ భేటీ అయ్యింది. సైన్యం నిర్వహించిన ఆపరేషన్‌ను కేబినెట్ ప్రశంసించింది. ఇది మనందరికీ గర్వకారణమైన క్షణమని ప్రధాని మోడీ హర్షం వ్యక్తం చేశారు. భద్రతాబలగాలు చేసిన కచ్చితమైన దాడిగా ఆపరేషన్ సిందూర్‌ను అభివర్ణించారని సమాచారం. ఆ క్లిష్ట సమయంలో ప్రధాని మోదీ దేశాన్ని నడిపిన తీరును సభ్యులు కొనియాడారట. ఈ సమావేశంలో కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఐటీఐ అప్‌గ్రేడేషన్ కోసం 60వేల కోట్ల రూపాయల జాతీయ పథకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కేబినెట్ భేటీకి ముందు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్ సరిహద్దుల్లో పరిస్థితి గురించి ప్రధానికి వివరించారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలపై సైన్యం మెరుపుదాడులునిర్వహించింది. అత్యంత కచ్చితత్వంతో పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీం "లోని 9 ఉగ్ర శిబిరాలపై దాడులు జరిపింది. మరోవైపు, కేబినెట్ మీట్ తర్వాత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును ప్రధాని మోడీ కలిశారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారివీరు సమావేశం అయ్యారు. దీంతో ఈభేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. రాష్ట్రపతితో మోడీ సమావే టశమైన విషయాన్ని రాష్ట్రపతి కార్యాలయం సోషల్ మీడియాలో వెల్లడించింది. అందుకు సంబంధించిన చిత్రాలను కూడా షేర్ చేసింది.

# ఆపరేషన్ సింధూర్‌పై భారత్‌కు ప్రపంచ దేశాల మద్దతు

**న్యూఢిల్లీ, మే 7:** పాకిస్థాన్ భూభాగంలోని ఉగ్రస్థావ రాలపై జరిగిన మెరుపుదాడులపై ప్రపంచ దేశాలు స్పందించాయి. భారత్‌పాక్‌ల ఘర్షణ త్వరగా ముగుస్తుందని అమెరికా ఆకాంక్షించింది. భారత్ దాడి చేయడం విచారకరమంటూ చైనా వ్యాఖ్యానించింది. భారత్, పాకిస్థాన్ రెండూ తమ పొరుగుదేశాలని తెలిపింది. రెండు దేశాల మధ్య ఘర్షణను ప్రపంచం భరించలేదని ఐక్య రాజ్య సమితి ఆందోళన వ్యక్తం చేసింది. భారత వైమానిక దాడులకు సంబంధించిన నివేదికల గురించి తమకు తెలిసిందని అమెరికా ప్రకటించింది. భారత్‌పాకిస్థాన్ మధ్య నెలకొన్న పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నట్లు పేర్కొంది. దాడులు జరిగిన వెంటనే జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్ అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియోకు ఫోన్ చేశారు. అత్యంత కచ్చితత్వంతో దాడులు జరిపామని, పాక్ పౌరులు, ఆర్థిక, సైనిక స్థావరాల జోలికి వెళ్లలేదని దోవల్ పేర్కొన్నట్లు వాషింగ్టన్‌లోని భారత రాయబార కార్యాలయం తెలిపింది. భారత్‌పాక్ మధ్య ఘర్షణలు అతిత్వరగా ముగిసిపోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆకాంక్షించారు.

అటు భారత్, పాకిస్థాన్ జాతీయ భద్రతా సలహాదారులతో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో మాట్లాడారు. ఇరు దేశాలు కమ్యూనికేషన్ మార్గాలను తెరిచి ఉంచాలని, ఉద్రిక్తతలను నివారించాలని కోరారు. ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన చెందుతున్నామని చైనా తెలిపింది. భారత్, పాకిస్థాన్ రెండూ తమ పొరుగుదేశాలని, అన్ని రకాలుగా ఉగ్రవాదాన్ని వ్యతిరేకిస్తున్నామని పేర్కొంది. భారత్ చేసిన దాడులు విచారకరమని తెలిపింది. శాంతి, స్థిరత్వం కోసం భారత్‌పాక్ చొరవ చూపాలని, పరిస్థితిని సంక్లిష్టం చేయకుండా సంయమనం పాటించాలని కోరింది.

మరోవైపు, భారత మెరుపుదాడులతో పెరిగిన ఘర్షణలపై ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. భారత్, పాకిస్థాన్‌లు సైనిక సంయమనం పాటిం చాలని ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ కోరారు. రెండు అణ్వస్త్ర దేశాల మధ్య సైనిక ఘర్షణను ప్రపంచం భరించలేదన్నారు. ఆత్మరక్షణ నిమిత్తం దాడి చేసే హక్కు భారత్‌కు ఉందని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజార్ ఎక్స్‌లో పోస్టు చేశారు.

అమాయకులపై దాడి చేసి దాక్కోవడం కుదరదనే విషయాన్ని ఉగ్రవాదులు తెలుసుకో వాలని హెచ్చరించారు. ఆత్మరక్షణ కోసం భారత్ చ తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. భారత్‌పాక్ మధ్యఘర్షణలను ప్రపంచం భరించలేదని యూఎఇ ఉప ప్రధానమంత్రి షేక్ అబ్దుల్లా బిన్ జాయెద్ అన్నారు. ఇరు దేశాలు సంయమనం పాటించాలని, ఉద్రిక్తతలు తగ్గించుకోవాలని సూచించారు. శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోవాలని కోరారు.

## పహల్గాం అమరులకు ఆత్మశాంతి

### ఘటనలో కుటుంబసభ్యులను కోల్పోయిన బాధితులు



**న్యూఢిల్లీ, మే 7:** పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై దాడికి దిగిన భారత ప్రభుత్వం, ఆర్మీపై సర్వత్రా ప్రశంసల వర్షం కురుస్తోంది. అదే సమయంలో ప్రధాని మోడీ సరైన నిర్ణయం తీసుకున్నారంటూ పహల్గాం దాడి బాధిత కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తంచేశారు. ఉగ్రవాది దాడిలో మరణించిన శుభం ద్వివేది, సంతోష్ జగ్‌దలే కుటుంబసభ్యులు మోడీకి ధన్యవాదాలు తెలిపారు. తమకున్యాయం జరిగిందని చెప్పారు. నా భర్త మరణానికి ప్రతీకారం తీర్చుకున్నందుకు ప్రధాని మోడీకి కృతజ్ఞతలు. నా కుటుంబం మొత్తం ఆయనపై నమ్మకం పెట్టుకున్నాం. ఆయన పాక్‌కు సమాధానం ఇచ్చిన విధానం మా నమ్మకాన్ని సజీవంగా ఉంచింది. ఇదే నా భర్తకు నిజమైన నివాళి. నా భర్త ఈరోజు ఎక్కడ ఉన్నా, ప్రశాంతంగా ఉంటారు అని శుభం ద్వివేది సతీమణి తెలిపారు. కుటుంబం మొత్తం ఎంతో సంతోషంగా ఉందని శుభంద్వివేది తండ్రి సంజయ్ ద్వివేది అన్నారు. భారత సైన్యం తీసుకున్న చర్య దేశ ప్రభుత్వంపై విశ్వాసాన్ని కలిగించిందనిఅన్నారు. నేను నిరంతరం వార్తలు చూస్తూనే ఉన్నా. ఈ సందర్భంగా భారత ఆర్మీకి సెల్యూట్ చేస్తున్నా. ప్రధాని నరేంద్ర మోడీకి ధన్యవాదాలు. దేశ ప్రజల బాధను విని పాక్ ఉగ్ర స్థావరాలపై ఎటాక్ చేసినందుకు కృతజ్ఞతలు. ఉగ్రవాదులపై దాడి చేస్తున్నట్లు వార్తలను విన్నప్పటినుంచి మా కుటుంబం మొత్తం ఎంతో సంతోషంగా ఉంది అని చెప్పారు. బాధితులకు న్యాయం జరిగిందని శుభమ్ ద్వివేది బంధువు మనోజ్ ద్వివేది అన్నారు. ఏప్రిల్ 22న మా శుభమ్‌ప్రాణాలు కోల్పోయినప్పుడు దేశంలో ఒక విప్లవం రాబోతోందని చెప్పాం. ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి ప్రధాని మోడీ కఠినమైన చర్యలు తీసుకుంటారని మాకు కచ్చితంగా తెలుసు. సైన్యం ఈరోజు ఇచ్చిన నిజమైన నివాళికి నేను ప్రధాని మోడీకి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని మనోజ్ చెప్పారు. తండ్రి చనిపోయిన బాధలో కూడా ఇప్పుడు ఆనందపడుతున్నాం. ప్రధాని మోడీ తప్పకుండా ప్రతీకారం తీర్చుకుంటారని మాకు తెలుసు. ఈ ఆపరేషన్‌కు పెట్టిన పేరే అందుకు నిదర్శనం. ఉగ్రవాదుల వల్ల సోదరీమణులు తమ సింధూరం కోల్పోయినందున వారికి గుర్తుగా ఈ దాడులకు నామకరణం చేశారు. ఆనందంతో కూడిన కన్నీళ్లు ఆగవు" అని సంతోష్ జగ్‌దలే కుమార్తె అశ్విరి తెలిపారు.

ఆపరేషన్ సింధూర్ పేరు వినగానే నా కళ్లలో నీళ్లు తిరిగాయి. భారతీయ కుమార్తెల సింధూరం తుడిచిపెట్టిన ఉగ్రవాదులకు ఇదే సరైన సమాధానం. అందుకు ప్రభుత్వానికి, మోడీకి నా హృదయపూర్వక ధన్యవాదాలు అంటూ మీడియాతో మాట్లాడారు సంతోష్ జగ్‌దలే సతీమణి. మరోవైపు పహల్గాం దాడిలో మరణించిన వారి కుటుంబసభ్యులకు ఉపశ మనం కలిగిందని కేరళకు చెందిన ఎన్ రామచంద్రన్ కుమార్తె ఆరాధి తెలిపారు. ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వంతోపాటు భారత సైన్యానికి బిగ్ సెల్యూట్ చేశారు.

# గతంలో సైనిక ఆపరేషన్లు ఎలా జరిగాయంటే?

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** పహల్గాం ఉగ్రదాడి తరువాత పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై సైన్యం మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఆపరేషన్ సింధూర్ పేరిట మెరుపు దాడులుచేసి నేలమట్టం చేయడం ప్రపంచ వ్యాప్తంగా సంచలనం రేపింది. కేవలం 25 నిమిషాల వ్యవధిలో పలు ఉగ్రవాద స్థావరాలను సైన్యం ధ్వంసంచేసింది.కాగా భారత సైన్యం ఆపరేషన్ సింధూర్ తరహాలో గతంలోనూ అనేక ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించడం గమనార్హం.

ఇందులో ముఖ్య మైనది 2019లో జమ్మూ కాశ్మీర్‌లోని పుల్వా మాలో సిఆర్‌పిఎఫ్ బలగాలు ప్రయాణిస్తున్న బస్సుపై జరిగిన ఆత్మాహుతి దాడి తరువాత చేబట్టిన ఆపరేషన్ బులందర్ ఎంతో కీలకమై నది. 2019 ఫిబ్రవరిలో ఆపరేషన్ బులందర్ పేరిట సైన్యం పాకిస్తాన్ లోని బాలకోట్‌లో గల జైష్ ఏ మహమ్మద్ ఉగ్రవాద శిబిరాలపై వైమా నిక దాడులు నిర్వహించింది.

1971 తరువాత పాక్‌లో భారత్ వైమానిక దాడులు చేయడం ఇదే మొదటిసారి. ఈ దాడుల్లో భారీగా ఉగ్రవాదులు మరణించగా ఈ సమయంలోనే వైమానిక దళ పైలట్ అభినందన్ వర్ధమాన్ పాక్ సైనికులకు పట్టు బడ్డాడు. అయితే అమెరికాజోక్యంతో వారం రోజుల తరువాత ఆయనను పాక్ భారత్‌కు అప్పగించింది.

దీనికి ముందు 2016లో జమ్మూ కాశ్మీర్‌లోని బారాముల్లా జిల్లా యూరీలో గల మిలటరీ బేస్‌పై ఉగ్రవాదులు దాడియేసి 19 మంది సైనికులను చంపారు. దీనికి ప్రతిగా వారంరోజుల వ్యవధిలోనే భారత సైన్యం నియంత్రణ రేఖను దాటి పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో గల ఉగ్రవాద శిబిరాలను యూరి సర్జికల్ స్ట్రైక్స్ పేరిట ధ్వంసం చేసింది.

ఈ దాడుల్లో భారత సైన్యానికి ఎలాంటి నష్టం వాటిల్లలేదు. అంతకు ముందు 1999లో జరిగిన కార్గిల్ యుద్ధం సమయంలో చేబట్టిన ఆపరేషన్ విజయ్, సఫేద్ సాగర్‌లు అప్పట్లో ప్రపంచ దేశాలను ఆకర్షిం చాయి.ఆ సమయంలోనే పాక్ అధ్యక్షుడుగా వున్న సైన్యాధ్యక్షుడు ముషరఫ్ ఈ ఘటన తరువాత పదవీచ్యుతడయ్యాడు.

**కార్గిల్ కొండలను పాక్ ఆక్రమించగా ఆపరేషన్ మేఘ్‌దూత్‌తో తిప్పికొట్టిన ఇందిరా గాంధీ**

ఇందిరాగాంధీ హయాంలో చేబట్టిన ఆపరేషన్ మేఘ్‌దూత్ పాక్‌లో వణుకుపుట్టించింది. అప్పట్లో కార్గిల్ కొండలు నిరాయుధీకరణ ఒప్పందంలో భాగంగా పాక్, భారత సైనికులు ఎవరు వెళ్లేందుకు వీల్లేకుండా వుంది. అయితే పాక్ సైనికులు పర్యాటకుల ముసుగులో ఈ కొండలను ఆపరేషన్ అబాబీల్‌లో భాగంగా ఆక్రమించగా దీనికి ప్రతిగా నాటి ప్రధాని ఇందిరా గాంధీ ఆపరేషన్ మేఘ్‌దూత్ పేరిట భారీ సైనిక ఆపరేషన్ చేబట్టారు. భారత సైన్యం ధాటికి



పాక్ సైన్యంలో చాలా మంది చనిపోగా అప్పటి నుంచి కార్గిల్ కొండలు భారత సైన్యం ఆధీనంలోనే వున్నాయి. ఆపరేషన్ మేఘ్‌దూత్ చేబట్టిన కొన్నినెలలకే ఇందిరాగాంధీ ఉగ్రవాదుల కాల్పుల్లో చనిపోయారు. అంతకు ముందు 1971 యుద్ధంలో ఆపరేషన్ కాక్టస్ లిల్లీ ద్వారా భారత సైన్యం మేఘనా నదిని దాటి ప్రస్తుత బంగ్లాదేశ్ రాజధాని ఢాకాను చుట్టుముట్టి పాక్ సైన్యం లక్ష మందిని బంధించింది.

ఇదే సమయంలో ఆపరేషన్ ట్రెడెంట్, ఆపరేషన్ పైథాన్ పేరిట నౌకాదళ ఆపరేషన్లు తొ లిసారిగా యాంటి షిప్ మిస్సైళ్లను వాడి కరాచిలోని పాక్ నౌకలను, ఇంధన నిల్వలను ధ్వంసం చేసింది.

అంతకు ముందు 1965 యుద్ధం సమయంలో పాక్ ని యంత్రణ రేఖను దాటినపుడు భారత సైన్యం ఆపరేషన్ రిడిల్ ద్వారా లాహోర్, కసూర్ లక్ష్యంగా దాడులు చేసింది.

**కాశ్మీర్ కోసం భారత్..పాక్ తొలియుద్ధం**

ఇదిలావుండగా భారత్, పాక్ స్వాతంత్రం పొందిన కొన్ని నెలలకే ఇరు దేశాల మధ్య ఘర్షణ ఏర్పడింది. కాశ్మీర్‌ను ఆక్రమించేందుకు పాక్ మద్దతు వున్న ట్రైబల్ మిలీషియా దళాలు రాగా ఆ సమయంలో కాశ్మీర్ మహారాజు భారత్‌లో చేరడానికి సంసిద్ధత వ్యక్తం చేశాడు. దీంతో కాశ్మీర్‌ను రక్షించేందుకు భారత సైన్యం పాక్ సైన్యంపై దాడికి దిగింది, ఈ యుద్ధం దాదాపు ఏడాది పాటు సాగింది. చివరకు ఐరాస జోక్యంతో ఇరుదేశాలు కాల్పుల విరమణ పాటించాయి.

ఈసమయంలోనే కాశ్మీర్ మూడింట రెండు వంతుల భాగం భారత్ పరంగా ఒక భాగం పాక్ ఆక్రమణలో వుండిపోయింది. ఈ ప్రాంతానే పాక్ ఆక్రమిత కాశ్మీర్‌గా వుండి పోయింది. దీనినే పాక్‌లో ఆజాద్ కాశ్మీర్‌గా పిలుస్తారు. కాగా ఇందులో నుంచి కొంత భాగాన్ని పాక్ చైనా పరంచేసింది. ఇలా భారత సైన్యం దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు, ఉగ్రవాదాన్ని అంతమొందించేందుకు ఎప్పటి కప్పుడు తమ శక్తి సామర్థ్యాలను ప్రదర్శిస్తూనే వుంది. ఆపరేషన్ సింధూర్ ఈ కోవలోనిదే.

## పివోకేలో హాతులైన ఉగ్రవాదులకు పాక్ ఆర్మీ అంత్యక్రియలు

**న్యూఢిల్లీ:** పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌లోని 9 ఉగ్రవాద శిబిరాలు, శిక్షణ కేంద్రాలను భారత్ ధ్వంసం చేసింది. 'ఆపరేషన్ సిందూర్'తో చేపట్టిన ఈ సైనిక చర్యలో సుమారు వంద మంది ఉగ్రవాదులు మరణించినట్లు సమాచారం. భారత్ దాడి తర్వాత పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో హతమైన పలువురు ఉగ్రవాదులకు అంత్యక్రియలు నిర్వహించారు. లష్కరే తోయిబా (ఎల్ఈటీ) కమాండర్ హాఫీజ్ అబ్దుల్ రవూఫ్ ఈ ప్రార్థనలకు నేతృత్వం వహించాడు. నిషేధిత జమాత్ ఉద్‌దవా (జేయూడీ) సభ్యులతోపాటు పాకిస్థాన్ ఆర్మీ, పోలీస్, పౌర అధికారులు ఈ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మురిద్కేలో పాకిస్థాన్ జెండాలు కప్పిన శవపేటికలను పాక్ ఆర్మీ సిబ్బంది మోశారు. ఈ వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కాగా, జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది మరణించిన ఘటనపై భారత్ ప్రతీకారం తీర్చుకున్నది. బుధవారం తెల్లవారుజామున 1 గంట నుంచి సుమారు అరగంట పాటు పాకిస్థాన్, పీవోకేలోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై వైమానిక దాడులు చేసింది.

# వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర భవిష్యత్ తరాలకు అవసరం: మంత్రి పొన్నం ప్రభాకర్

## విశ్వకర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలలో పాల్గొన్న మంత్రి పొన్ననం ప్రభాకర్ తదితరులు

**హైదరాబాద్ (ముషీరాబాద్), మే 7, ప్రభాతవార్త:** పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర ఎంతో గొప్పదని, ఆయన చరిత్ర భవిష్యత్ తరాలకు ఎంతో అవసరమని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కొనియాడారు. బుధవారం విశ్వకర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారి ఉత్సవ సమితి ట్యాంక్‌బండ్ పైనున్న శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహంవద్ద 332వ ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరై మంత్రి మాట్లాడుతూ కాలజ్ఞాని అయిన వీర బ్రహ్మంగారి చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియచేస్తున్న విశ్వకర్మ ఫౌండేషన్ ప్రతినిధులను ఆయన అభినందించారు. ఉత్సవ సమితి కన్వీనర్ విశ్వకర్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అడ్లూరి రవీంద్రాచారి మాట్లాడుతూ స్వామి వారి ఆరాధన, జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. వీరబ్రహ్మేంద్రస్వామిపై రచించిన భక్తి పాటలతో ట్యాంక్‌బండ్ మారుమ్రోగింది. ఈ మహోత్సవంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు వి.హనుమంతరావు, తెలంగాణ తొలి స్పీకర్ మధుసూదనాచారి, బిసికమిషన్ ఛైర్మన్ నిరంజన్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌లు పాల్గొని స్వామివారి విగ్రహానికి పూలమాలలు వేయగా, విశ్వకర్మనాయకులు లాల్‌కోట వెంకటాచారి, మదన్‌మోహన్, కుందారం గణేష్‌చారి, త్రిమూర్తుల గౌరీ శంకర్, విశ్వకర్మ ఫౌండేషన్ సభ్యులు మహారాజ రవీంద్రాచారి, చింతోజు మాదవరావు, రాఘవేందర్, రాగిశోభన్, శ్రీనివాసులు, తోట రామస్వామి, బాలాచారి, శ్రీనివాసాచార్య తదితరులు పాల్గొన్నారు.

# పిఆర్ఎల్ఎస్, సమ్మక్కసారక్క ప్రాజెక్టులకు త్వరగా నీటిని కేటాయించండి

పాలమూరుకు 90 టిఎంసిలు, సమ్మక్కకు 44టిఎంసిలు నీరు ఇవ్వండి

ఆంధ్రప్రదేశ్ కృష్ణాజలాలను అక్రమంగా తరలించడం నివారించండి

పోలవరం బ్యాక్‌వాటర్ ముప్పు నివారించండి

సిడబ్ల్యుసి ఛైర్మన్ అతుల్‌జైన్‌ను కలిసి విన్నవించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్,మే7,ప్రభాతవార్త:** పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్, సమ్మక్క సారలక్క ప్రాజెక్టులకు నీటిని కేటాయించే విషయంలో త్వరగా నీటి కేటాయింపులు చేయాలని తెలంగాణ పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. బుధవారం న్యూఢిల్లీలో కేంద్రజలవనరుల సంఘం కార్యాలయంలో ఛైర్మన్ అతుల్‌జైన్‌ను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి,ఇఎన్‌సి చీఫ్ జి.అనీల్‌కుమార్ కలిసి నీటిపారుదల రంగంకు సంబందించిన అనేక అంశాలపై చర్చించారు. పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు 90 టిఎంసి ల నీరు కేటాయించాలని కోరారు. మొదటి దశలో 45 టిఎంసిలు వెంటనే ఇవ్వాలని ఆయన కోరుతూ దానికి అనుగుణంగా మౌళిక వసతుల నిర్మాణాలు కలిగి ఉన్నట్లు డాక్యుమెంట్లు వారికి సమర్పించారు.ములుగు జిల్లా తుపాకుల గూడెంలో సమ్మక్క సారలమ్మకు 6.94 టిఎంసిల నీటి సామర్థ్యంతో బ్యారేజ్ నిర్మించామని అనేక గ్రామాలకు తాగునీటి వసతి కల్పిస్తుందని ఆయన అతుల్ జైన్‌కు వివరించారు.44 టిఎంసిలు ఈ ప్రాజెక్టు నుంచి ఎత్తిపోసేందుకు వీలుగా నీటి కేటాయింపులు చేయాలని సూచించారు. కరువుకు గురికాకుండా వ్యవసాయ పంటలు పండించడానికి వీలవుతుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అక్రమంగా కృష్ణానది నీటిని తరలిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. టెలిమెట్రిక్ పద్దతిలో నీటిని కొలచి కేటాయింపులకు మించి అక్రమంగా నీటిని వాడుకోవడాన్ని నివారించాలని సూచించారు. కెఆర్‌ఎంబికి టెలిమెట్రిక్ పరికాల కొనుగోలు తన వాటా నిధులు ఇచ్చామని తెలిపారు. పోలవరం



బుధవారం న్యూఢిల్లీలో కేంద్రజలవనరుల సంఘం కార్యాలయంలో ఛైర్మన్ అతుల్‌జైన్‌ను కలిసిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి,అధికారులు

ప్రాజెక్టు బ్యాక్ వాటర్ కారణంగా తెలంగాణకు పొంచి ఉన్న ముప్పుపై కూడా ఆయన వివరించారు. కెఆర్‌ఎంబి ఛైర్మన్ పోలవరం ప్రాజెక్టు అథారిటి అదనపు బాధ్యతతో ఉన్న మీరు అంతరాష్ట్ర నది జలాల పంపిణీ పారద్శకంగా పంపిణీచేయాలని కోరారు. పోలవరం నిర్వాసితులు అత్యధికంగా బ్యాక్ వాటర్ కారణంగా అవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. కాళేశ్వరం అన్నారం సుందిళ్ళ ప్రాజక్టులు పనికిరావని ఎన్‌డిఎస్‌ఏ తేల్చి చెప్పాయని ప్రత్యామ్నయంగా ముందుకు వెళ్ళే మార్గం నిర్ధేశించలని ఉత్తమ్ కోరారు. కాళేశ్వరం లోపాలపై కూడా ఆయన సిడబ్ల్యుసి ఛైర్మన్‌తోచర్చించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పొరపాట్లు దిద్దుబాటు చేసి గోదావరి నీటిని వినియోగించుకొనే సలహాలు ఇవ్వాలని ఆయన కోరారు.



# అయోధ్య, కాశీలో తెలుగు భక్తుల కోసం భూమి కేటాయించాలి

## ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు విజ్ఞప్తి చేసిన రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్

**హైదరాబాద్ (ముషీరాబాద్), మే 7, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల నుండి అయోధ్య మరియు కాశీకి వచ్చే భక్తులకు వసతి, పార్కింగ్ వంటి నిర్మాణాలకు భూమి కేటాయించాలని రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ విజ్ఞప్తి చేశారు. బుధవారం ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను లక్నోలో మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అయోధ్య శ్రీరామమందిరంకు, కాశీవిశ్వనాథ ఆలయ దర్శనానికి తెలుగురాష్ట్రాల నుండి వచ్చే భక్తుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోందని, ఈ క్రమంలో భక్తులకు తక్కువ ధరలకు, సురక్షితమైన వసతి, భోజన,పార్కింగ్, శుచిగృహాల వంటివి అందుబాటులో ఉండే విధంగా ప్రత్యేక ఏర్పాట్ల అవసరం ఉంద న్నారు. తెలుగు ప్రజల అవసరాలను గుర్తించి, వారి వసతులకై 200 చదరపు గజాల నుండి ఒక ఎకరం వరకు భూమిని కేటాయించాలని కోరారు. భూమిని కేటాయించిన అనంతరం అవసరమైన నిర్మాణాలను ఎంపీ నిధుల ద్వారా లేదా ఇతర సంబంధిత నిధుల సహాయంతో చేపడతామని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి, ముఖ్యంగా తెలంగాణ నుంచి వచ్చే భక్తులు అధిక సంఖ్యలో ఉండటంతో, వారిని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రికి వినతి పత్రం అందచేయటం జరిగిందని, దీనిపై ముఖ్య మంత్రి సానుకూలంగా స్పందించటం ఆనందంగా ఉందని అన్నారు. ఈ ప్రతిపాదనతో భక్తుల యాత్రను మరింత సౌకర్యవంతంగా మార్చడమే కాకుండా, తెలుగు ప్రజలకు గర్వకారణంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# సింగరేణిలో అవినీతిపై ఉక్కు పాదం

## అక్రమార్కులను పట్టిస్తే రూ.10 వేల నజరానా

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** అవినీతి, అక్రమార్కులపై ధైర్యంగా సమాచారం ఇవ్వాలని సింగరేణి యాజమాన్యనం విజ్ఞప్తి చేసింది. అటువంటి కార్యకలాపాలకు పాల్పడుతున్న ఎంతటి వారైనా ఉపేక్షి ంచేది లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో మోసగాళ్ల సమాచారాన్ని సింగరేణి విజిలెన్స్, ఏసీబీకి అందించినట్లయితే వారికి పూర్తి రక్షణ, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపింది. ఆధారాలతో అక్రమార్కులను పట్టించిన వారికి రూ.10 వేల పారితోషకం ఇవ్వనున్నట్లు ప్రకటించింది. మెడికల్ బోర్డు ప్రక్రియలో అన్ ఫిట్ చేయిస్తామని,బదిలీలు జరిపిస్తామని, కొత్తగా ఉద్యోగాలకు ఎంపికైన వారిని వైద్య పరీక్షల్లో ఫిట్ చేయిస్తామని, డిప్యూ టేషన్లు, ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్ పరీక్షల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న సింగరేణి ఉద్యోగిని ఈ నెల 6వ తేదీన అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్టు చేసిన నేపథ్యంలో సింగరేణి ఈ ప్రకటన జారీ చేసింది. అమాయ కులైన కార్మికులను వంచిస్తున్న ఎవరినైనా సరే సంస్థ ఉపేక్షి ంచబోదని, కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించింది. అవినీతి చర్యలకు పాల్పడే వారిని, వారికి వెనుక ఉండి సహకారం అందించే వారిని సైతం వదిలిపెట్టే ప్రసక్తే లేదని తేల్చిచెప్పింది. అదే సమయంలో సింగరేణి కార్మికులు వక్రమార్గాల్లో పయనించి జీవితాన్ని పాడుచేసుకోవద్దని సూచించింది. ఏరియాల్లో, గనుల్లో, డిపార్ట్ మెంట్ ల్లో సింగరేణి ఉద్యోగులు లేదా అధికారులు, లేక బయట వ్యక్తులు ఎవరైనా సరే లంచాలు ఆశిస్తున్నట్లయితే వారి వివరాలను విజిలెన్స్ శాఖకు మరియు ఏసీబీకి అందించాలని పేర్కొంది. గతంలోనూ సింగరేణిలో అక్రమాలకు పాల్పడిన పలువురు ఉద్యోగులపై విచారణ జరిపి డిస్మిస్ చేసిన విషయాన్ని గుర్తుచేసింది. చట్టప్రకారం పలువురిపై చర్యలు కూడా తీసుకున్నట్లు వెల్లడించింది. ఇకముందు కూడా పారదర్శక సింగరేణి కోసం అక్రమార్కులపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేసింది. సింగరేణి సంస్థను అవినీతి రహిత కంపెనీగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరు సహకరించాలని యాజమాన్యం విజ్ఞప్తి చేసింది.

# అప్పులు తీర్చేమార్గం లేక నలుగురు రైతుల ఆత్మహత్య

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల తదితర కారణాలతో కష్టించి పండించిన పంటలు దిగుబడులు రాకపోగా, వాటి నిమిత్తం చేసిన అప్పులు తీర్చేమార్గం లేక తీవ్ర మనస్తాపంతో రాష్ట్రంలోని వేర్వేరు జిల్లాలకు చెందిన నలుగురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. తెలంగాణలోని మంచిర్యాల, సిద్దిపేట, నిర్మల్ జిల్లాల్లో ఈ సంఘటనలు చోటుచేసుకున్నాయి.

రాష్ట్రంలోని మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం పౌనూర్ గ్రామానికి చెందిన కౌలు రైతు బౌతు శంకర్ (45) ఐదెకరాలు కౌలు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. సాగు నిమిత్తం వివిధ చోట్ల రూ.6 లక్షల అప్పు తీసుకువచ్చారు. అయితే ఇటీవల గాలివానకు పంట మొత్తం నేలవాలింది. దిగుబడి రాదేమోనని, అప్పులు తీర్చలేనేమో నన్న బెంగతో ఇంట్లో గడ్డి మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. అలాగే సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలోని దుంపలపల్లికి చెందిన అండెం రవీందర్‌రెడ్డి (36) తనకున్న రెండెకరాల్లో వ్యవసాయం చేస్తున్నారు. అందినకాడల్లా అప్పులు తెచ్చి సాగునీటి కోసం పొలంలో మూడు బోరు బావులు తవ్వించినా చుక్కనీరు పడలేదు. బోర్లు వేసినందుకు చేసిన అప్పులు పెరిగిపోయాయి. ఈ అప్పులు ఎలా తీర్చాలో తెలియక మానసికంగా కుంగిపోయి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఇక నిర్మల్ జిల్లా తానూర్ మండలం ఝరి గ్రామానికి చెందిన బొడ్డొల్ల పోతన్న (53) రెండు ఎకరాల భూమిలో వ్యవసాయం చేస్తున్నారు.

సాగుకు రూ.3 లక్షల వరకు అప్పులు కాగా, వాటిని చెల్లించే స్థోమత లేక మనస్తాపానికి గురై మండల శివారు చేనులో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇక ఇదే జిల్లా భైంసా మండలం గుండెగాంకు చెందిన సూర్యవంశీ ప్రసాద్ (48) పంచాయతీ కార్యాలయంలో కారోబార్‌గా పనిచేస్తున్నారు. ప్రసాద్ తన నాలుగెకరాల్లో సోయా సాగు చేశాడు. వర్షాకాలంలో బ్యాక్‌వాటర్ పెరగడంతో సోయాపంట పూర్తిగా మునిగిపోయింది. ఈ యాసంగిలో సాగుచేసిన జొన్న పంటను కోతకోసి ఆరబెట్టగా గాలి దుమారంతో కూడిన వర్షానికి కంకులన్నీ తడిచిపోయాయి. దీంతో సాగుకు చేసిన రూ.6 లక్షల అప్పు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపం చెంది చేను వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు.

# పెద్ద మొత్తంలో నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ పట్టివేత

ఢిల్లీ టు హైదరాబాద్ దిగుమతి మద్యాన్ని పట్టుకున్న ఎస్‌టిఎఫ్

రూ. 4 లక్షల విలువచేసే 105 మద్యం బాటిళ్లు స్వాధీనం

**హైదరాబాద్,మే7,ప్రభాతవార్త:** పాత కార్లు ఎక్కడ కనిపించినా తక్కువ ధరలకు కొనుగోలు చేసి ఎక్కువ ధరలకు అమ్మకాలు జరిపే వ్యాపారాన్ని చేస్తూ..సైడ్ బిజినెస్‌గా కొనుగోలు చేసినటువంటి కార్‌లో ఆయా రాష్ట్రాల్లో తక్కువ ధరలకు లభించే మద్యం బాటిల్లను తీసుకువచ్చి హైదరాబాదులో ఎక్కువ ధరలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నటువంటి ముఠాను బుధవారం ఎస్‌టిఎఫ్ డి టిమ్ సీఐ నాగరాజు బృందం పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే నాగర్ కర్నూలుకు చెందినటువంటి రవీందర్ కత్రావత్ అనే వ్యక్తి తరచూ ఢిల్లీ ఇతర రాష్ట్రాలకు వెళ్తూ పాత కార్లను కొనుగోలు చేసి తీసుకువచ్చి హైదరాబాదులో ఎక్కువ ధరలకు అమ్మకాలు జరిపే వ్యాపారం నిర్వహిస్తాడు. ఢిల్లీ ప్రాంతాల్లో కొనుగోలు చేసిన కారులో తక్కువ ధరలు కలిగిన మద్యం బాటిల్లను కారు వెనుక డిక్కీలో వేసుకుని హైదరాబాద్‌కు తీసుకొని వస్తాడు. ఢిల్లీ నుంచి తీసుకొచ్చినటువంటి మద్యం బాటిలను తన మిత్రుడైన నాగిరెడ్డి నాగర్ కర్నూల్ చెందినటువంటి వ్యక్తి కర్మన్ఘాట్ హస్తినాపురంలో అని సంతోష్ మాత కాలనీలో నివాసముంటున్న హౌస్ నెంబర్ 8792/41 మద్యం బాటిల్లను అందజేస్తాడు. ఢిల్లీ నుంచి తీసుకొచ్చినటువంటి మద్యం బాటీలను అమ్మకాలు జరిపిన లాభాల్లో ఇద్దరూ పంచుకుంటారు.ఈ సమాచారం సేకరించిన ఎస్‌టిఎఫ్ డి టీం సిఐ నాగరాజుతో పాటు ఇతర సిబ్బంది కలిసి నాగిరెడ్డి ఇంటిలో దాడులు నిర్వహించారు.ఈ దాడిలో ఢిల్లీకి చెందినటువంటి 105 మద్యం బాటిల్లు లభ్యమయ్యాయని సీఐ తెలిపారు. పట్టుకున్న మద్యం బాటిళ్లలో బ్లాక్ లేబుల్ 24 రెడ్ లేబుల్ 36 శివాజీ రీగల్ 31 సిగ్నేచర్ 4 రాయల్ గ్రీన్ నాలుగు రాయల్ చాలెంజ్ ఆరు బాటిల్లు ఉన్నట్లు ఆయన తెలిపారు.

పట్టుకున్న మద్యం బాటిల్ల విలువ రూ.4 లక్షల మేర ఉంటుందని అంచనా వేశారు. మద్యం బాటిల్లను పట్టుకున్నటువంటి ఎస్‌టిఎఫ్ డీ టీంను ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ షాన్ వాజ్ ఖాసిం,ఎస్ టి ఎఫ్ డి టీం లీడర్ యాదవులు అభినందించారు.



బుధవారం ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న హరీశ్‌రావు

# పాలన చేత కాకపోతే పదవి నుంచి దిగిపో

## సిఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీష్‌రావు హితవు

**సిద్దిపేట రూరల్, మే 7, ప్రభాతవార్త:** పాలన చేత కాకపోతే పదవి నుంచి దిగిపో అని సిఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు సూచించారు. సిద్దిపేట జిల్లా ఇర్కోడ్‌లోని ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో వర్షానికి తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలించి మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు వడ్లను కొనుగోలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతుల పరిస్థితి మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టుగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేసే వారే దిక్కులేరన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి అప్పులు పుట్టడం లేదని వ్యాఖ్యాలు చేయడం సిఎంగా ఫెయిల్ అయ్యారని తెలిపారు.హైదరాబాద్‌లో కూర్చొని రోజు అందాల పోటీలపై సిఎం రేవంత్‌రెడ్డి సమీక్షలు నిర్వహిస్తున్నారు కానీ రైతుల తిప్పలు పట్టించుకోవడం లేదన్నారు. రేవంత్‌రెడ్డి చిల్లర మాటలు తగ్గించి రైతులకు మేలు చేయాలన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి 43 సార్లు విమానం ఎక్కి దిగడం తప్ప ఢిల్లీకి వెళ్లి ఏం సాధించారని ప్రశ్నించారు. మంత్రులు గాలిమోటర్ల ప్రయాణాలు తప్ప ఒరగబెట్టిందేమిలేదన్నారు. ప్రభుత్వం రైతుల నుంచి తరుగు పేరిట 5 కేజీల వడ్లు కట్ చేస్తున్నారని తెలిపారు. వర్షానికి తడిసి మొలకెత్తిన ధాన్యం కొనుగోలు చేయడం లేదని వెంటనే మొలకెత్తిన ధాన్యాన్ని సైతం కొనుగోలుచేసి రైతులకు మద్దతు ధర చెల్లించాలన్నారు. పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని, కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ప్రతిరైతు ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. ఆయన వెంట మాజీ సుడా ఛైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# కులగణనతోనే బిసిల జీవితాల్లో వెలుగులు: ఆర్.కృష్ణయ్య



బుధవారం జరిగిన సదస్సులో మాట్లాడుతున్న ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, మే 7,ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా జనగణనలో కులగణన నిర్వహిస్తే దేశంలోని బిసిల జీవితాల్లో వెలుగులు నిండుతాయని బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి ఆర్. కృష్ణయ్య అన్నారు. ఈమేరకు బుధవారం హైదరాబాద్ లక్డికపుల్‌లో బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ వకుళాభారణం కృష్ణమోహన్ అధ్యక్షతన ప్రధాని మోడీకి కృతజ్ఞత సదస్సు ఏర్పాటు చేశారు. దీనికి రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య , రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు ముఖ్య అధితులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ 40ఏళ్ల పోరాట ఫలితంగానే ఈ చరిత్రాత్మక నిర్ణయమన్నారు. కాంగ్రెస్ పార్టీనాయకులు తమ ఒత్తిడి వల్ల కేంద్రం నిర్ణయం తీసుకుందని మాట్లాడుతున్నారని మరి 60యేళ్ల వారి పాలనలో ఎందుకు కులగణన చేయలేదని ప్రశ్నించారు. త్వరలో కేంద్రంలో ప్రత్యేక బీసీమంత్రిత్వశాఖ ఏర్పడనుందని, రాష్ట్రంనుండి బిసి సంఘాల నాయకులతో మోడీని కలిసి ఆయనను ఆత్మీయంగా సన్మానిం చుకుంటామని కృష్ణయ్య స్పష్టం చేశారు. రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు మాట్లాడుతూ గతంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా త్వరితగతిన కులగణన చేపట్టాలన్నారు. ఓబీసీ లెక్కలతో పాటు ఓసీల లెక్కలు కూడా తీయాలని అప్పడే ఈడబ్ల్యూఎస్‌రిజర్వేషన్ల పునఃసమీక్ష చేసే అవకాశం ఉంటుందన్నారు.ఈకార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జసత్యం, నీలం వెంకటేష్, జిల్లపల్లి అంజి, రామకృష్ణ, సతీష్, బిజెపి ఓబిసి మోర్చా అధ్యక్షులు ఆనంద్‌గౌడ్, చేనేత కులాల ఐక్య వేదిక రఘురాంనేత, బలిజసంఘం వెన్నె ఈశ్వరప్ప,యాదవసంఘం రాములుయాదవ్, వీరభద్రీయసంఘం కె.వీరస్వామి పాల్గొన్నారు.

# నేటి నుంచి 14 వరకు ప్రత్యేక సోదాలు

## ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డెరెక్టర్ షానవాజ్ ఖాసిం

**హైదరాబాద్, మే 7,ప్రభాతవార్త:** యువత,ప్రజలకు ప్రాణాంతంగా మారిన గంజాయి, డ్రగ్స్‌ను పూర్తిస్థాయిలో అరికట్టడంలో ఎక్సైజ్ శాఖ కీలక భూమిక పోషించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డెరెక్టర్ షానవాజ్ ఖాసిం అన్నారు. బుధవారం ఎస్‌టిఎఫ్ టీమ్‌ల సమావేశ అనంతరం ఆయన మాట్లాడుతూ గురువారం (8వతేదీ)నుంచి 14 వరకు తెలంగాణలో దాడులు నిర్వహించాలని డెరెక్టర్ ఆదేశించారు. గంజాయి, డ్రగ్స్‌తోపాటు ఆల్ఫ్రాజోలం, డైజోపామ్ రవాణ, అమ్మకాలు, వినియోగం, దిగుమతుల పై నిఘా పెట్టిపట్టుకోవాలని డైరెక్టర్ సూచించారు.ఈ స్పెషల్ డ్రైవ్‌లో యంత్రాంగం పనితీరే ప్రమాణికంగా నిలుస్తుందని డైరెక్టర్ అభిప్రాయ పడ్డారు.గతసంవత్సరం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధ్వర్యంలో జనవరి, జూన్, సెప్టెంబర్ నెలల్లో ఎన్‌డీపీఎస్‌పై స్పెషల్ డ్రైవ్‌నిర్వహించామని,ఈ మూడు స్పెషల్ డ్రైవ్‌లో 383కేసులు నమోదు అయ్యాయని, 644నిందితులను అరెస్టుచేసి 2639 కేజీల గంజాయి, 99.23గ్రాముల ఎండిఎంఎ, 6.33 కేజీలఆల్ఫ్రజోలంను స్వాధీనం చేసుకున్నామని అన్నారు.

# చేయి పార్టీ చేతులెత్తేసింది: తెలంగాణ బిజెపి

**హైదరాబాద్, మే 7 ప్రభాతవార్త:** తెలంగాణలో ఉన్న చేయి పార్టీ చేతులెత్తేసింది అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఉద్దేశించి బిజెపి తెలంగాణ ట్వీట్ చేసింది. ప్రభుత్వ ఉద్యోగులు సమ్మెకు పిలుపునివ్వడం పట్ల ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలపై విపక్షాలు తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో బిజెపి తెలంగాణ ట్విట్టర్ వేదికగా పోస్ట్ పెట్టింది. ఇందులో అణాపైసా అప్పు పుడ్తలే నన్ను కోసినా ఎక్కువ ఆదాయం రాదు అంటూ చెయి పార్టీ చేతులెత్తేసింది అని కాంగ్రెస్ నాయకుల ఫోటోలను షేర్ చేసింది. అభయ హస్తమని నమ్మించి ప్రజల నెత్తిన భస్మాసుర హస్తాన్ని పెట్టిందని, మార్పు అంటూ ఊదరగొట్టి ఉద్యోగుల కడుపు మాడ్చిందని ఆరోపించింది. అంతేగాక తెలంగాణ ప్రగతికి పాటు పడతామని దోచుకోవడానికి, దండుకోవడానికి మార్గాలు వెతుక్కున్నదని సంచలన వ్యాఖ్యలు చేసింది. ఇచ్చిన హామీలు గుర్తుచేస్తే అధికార అహంతో మండిపడుతున్నదని, చేసిన వాగ్దానాల గురించి ప్రశ్నిస్తే పదవి ఉన్నదనే పొగరుతో అణిచివేస్తున్నదని ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఇక పదేళ్ల పాపిష్టి పాలన తెలంగాణను ఆగం చేస్తే కాంగ్రెస్ దుష్ట పాలన తెలంగాణను పీడిస్తున్నదని బిజెపి ట్విట్టర్‌లో పేర్కొంది.

# ఆర్టీసి బస్సులో ప్రయాణించిన మంత్రి పొన్నం

## మహిళలకు ఉచిత ప్రయాణంపై ఆరా



ఆర్టీసి బస్సులో ప్రయాణిస్తున్న రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్

**కొండపాక, మే 7, ప్రభాతవార్త:** రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ బుధవారం సిద్దిపేట జిల్లా రాజీవ్ రహదారిపై దుద్దెడ శివారులో ఉన్న టోల్‌గేట్ దగ్గర తన వాహనం దిగి కరీంనగర్ డిపోకు చెందిన అర్టీసి బస్సులో ప్రయాణికులతో కలిసి జిల్లా కలెక్టరేట్ వరకు ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా ఆయన బస్సులో ప్రయాణిస్తున్న మహిళలతో ముచ్చటించి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు ఆర్టీసిలో అందుతున్న ఉచిత ప్రయాణంపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు అర్టీసి బస్సులల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం జరుగు తుందన్నారు. ఆర్టీసికి ప్రతినెల ప్రభుత్వం రూ.330 కోట్లు చెల్లిస్తుందన్నారు. గత ప్రభుత్వం ఆర్టీసిని నిర్వీర్యం చేస్తే కాంగ్రెస్ సర్కారు నిలబెట్టుకుంటూ వస్తుందన్నారు. ఆర్టీసిలో కొత్త బస్సులు కొనుగోలు చేశామని దేశానికే తెలంగాణ ఆర్టీసి రోల్ మోడల్‌గా నిలుస్తుందన్నారు. అర్టీసి వాళ్లకు కూడా కొన్ని ఇబ్బందులున్నయన్నారు. బిటెక్ చదు వుతున్న విద్యార్థులతో మాట్లాడారు. కొంత మంది బస్సులో సీట్లు దొరకక నిలబడ్డ మహిళలు బస్సుల్లో సీట్లు దొరకడం లేదనగా స్పందించిన మంత్రి మహిళా సంఘాల అధ్వర్యంలో మరిన్ని కొత్త బస్సులు కొంటున్నామని, మరి కొన్ని కొత్త నౌకర్లు కూడా ఇస్తున్నామని ప్రయాణికులతో అన్నారు. పది సంవత్సరాలు ఆర్టీసి నష్టల బాటలో ఉందని అది రిపేర్ చేయాలంటే కొంత టైం పడుతుందని అన్నారు,

# శాతవాహన వర్సిటీ ప్రొ.సుజాతపై చర్యలు తీసుకోవాలి

## బిజెపి ఎమ్మెల్యేలు రాజాసింగ్, పాయల్ శంకర్, పాల్వాయి హరీష్, ధన్‌పాల్ సూర్యనారాయణ

**హైదరాబాద్, మే 7 ప్రభాతవార్త:** ఆపరేషన్ సింధూర్‌ను ఎగతాళి చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యురాలు, శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత చేసిన వ్యాఖ్యలను బిజెపి ఎమ్మెల్యేలు రాజాసింగ్, పాయల్ శంకర్, పాల్వాయి హరీష్, ధన్‌పాల్ సూర్యనారాయణలు తీవ్రంగా ఖండిస్తున్నాను. పహల్గాం ఉగ్రదాడిలో 26 మందిని పొట్టన పెట్టుకున్న టెర్రరిస్టులకు గట్టిగా బుద్ధి చెప్పేందుకు భారత సైన్యం అత్యంత సాహసోపేతంగా ఆపరేషన్ సింధూర్ పేరిట దాయాది దేశంలోని ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేస్తే, దానిని తప్పుబట్టేవిధంగా ప్రొఫెసర్ సుజాత వ్యవహరించడం దుర్మార్గం. ఇది ముమ్మాటికి దేశద్రోహమే అవుతుందన్నారు. రాష్ట్ర విద్యాకమిషన్ సభ్యురాలైన సుజాత చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం తమ చిత్తశుద్ధి చాటుకోవాలన్నారు. అంతేకాదు, తక్షణమే ఆమెను సస్పెండ్ చేసి, రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యత్వాన్ని రద్దు చేయాలన్నారు.

# ఇక ఎస్సీ బాలికా గురుకులాల్లో మహిళలే నియామకం



అలుగు వర్షిణి

## బోధన, బోధనేతర ఉద్యోగాల్లోనూ మహిళలే

### ఇప్పటికే ఉన్న పురుష సిబ్బంది, ఉద్యోగులకు నిబంధనల మేరకు పదోన్నతులు

### బాలికా గురుకులాల్లో ఎలాంటి ఘటనలు జరగకుండా పక్కాగా నిబంధనలు అమలు

### మహిళా సిబ్బందిని నియమిస్తే బాలికలు నమ్మకంగా, భరోసాగా ఉంటారంటున్న తల్లిదండ్రులు

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ డెవలప్‌మెంట్ శాఖ అధ్వర్యంలో కొనసాగుతున్న ఎస్సీ గురుకులాల్లో పక్కగా నిబంధనలను అమలు చేయాలని సొసైటీ అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు యాజమాన్య చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో కొనసాగుతున్న ఎస్సీ బాలికా గురుకులాల్లో ఇకపై మహిళా సిబ్బంది, ఉద్యోగులనే నియమించాలని సొసైటీ ఉన్నతాధికారులు నిర్ణయించారు. అయితే ఇందుకు సంబంధించి ఇప్పటికే ఉన్న నిబంధనలను ఇకపై పకడ్బందీగా అమలు చేయాలని సొసైటీ అధికారులు నిర్ణయించారు. బాలికల పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీల్లో ఇకపై టీచర్స్, లెక్చరర్ల నియామకాలను చేపడితే కేవలం మహిళలను మాత్రమే రిక్రూట్ చేసుకోవాలని నిర్ణయించినట్టు అధికారులు చెబుతున్నారు. నాన్ టీచింగ్ సిబ్బందిని సైతం మహిళలనే నియమించాలని నిర్ణయించారు. బాలికల విద్యా సంస్థల్లో పురుష బోధన, బోధనేతర సిబ్బంది ఉండటం వల్ల ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఇప్పటికే ఉన్న నిబంధనలను ఇకపై పటిష్టంగా అమలు చేయాలని సొసైటీ అధికారులు నిర్ణయించారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వానికి సైతం ఉన్నతాధికారులు సమాచారం అందించి.. అనుమతి తీసుకున్నట్టు తెలిసింది. బాలికల గురుకులాలోలన పురుష సిబ్బంది, ఉద్యోగులు నియామకం జరిగినచోట కొన్ని సంఘటనలు జరిగిన నేపథ్యంలో ఇకపై అటువంటి ఘటనలు జరగకుండా ఉండాలనే సదుద్దేశంతోనే ఇటువంటి నిర్ణయం తీసుకున్నట్టు సొసైటీ అధికారులు చెబుతున్నారు. బాలికల గురుకులాలోలన మహిళా సిబ్బంది, ఉద్యోగులను నియమించడం వల్ల అక్కడ చదువుకుంటున్న తమ పిల్లలకు భద్రత, భరోసా ఉంటుందనే నమ్మకాన్ని తల్లిదండ్రులు వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలోని ఎస్సీ గురుకులాలు 238 ఉన్నాయి. వాటిలో 145 బాలికల గురుకులాలు ఉండగా.. మిగిలిన 93 బాలుర గురుకులాలుగా కొనసాగుతున్నాయి.

జీవో ఆర్‌టి నంబర్ 1274 ఏమి చెబుతుంటే..

రాష్ట్ర ప్రభుత్వం బాలికల కోసం ప్రత్యేకంగా రెసిడెన్షియల్ పాఠశాలల సంఖ్యను పెంచింది. వాటిలో సాంఘిక సంక్షేమం, గిరిజన సంక్షేమం, బీసీ సంక్షేమం, మైనారిటీల సంక్షేమం, జనరల్ పేరుతో వివిధ రెసిడెన్షియల్ విద్యా సంస్థల సొసైటీల నియంత్రణలో వందలాది రెసిడెన్షియల్ పాఠశాలలు రాష్ట్రంలో పనిచేస్తున్నాయి. బాలికల కోసం ఏర్పాటు చేసిన సంస్థలను నడపడానికి అన్ని కేడర్‌లలో మహిళా సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని.. గతంలో 2016లో ప్రభుత్వం నియమించిన కమిటీ నివేదికను అందించింది. మే 12, 2016న విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధ్వర్యంలో ముఖ్య కార్యదర్శులు / సంక్షేమ శాఖల ప్రభుత్వ కార్యదర్శులు, రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీల కార్యదర్శులతో సమస్యపై చర్చించారు. సమగ్ర చర్చలు జరిపిన అధికారులు ప్రభుత్వానికి సిఫార్సులను చేశారు. ఈ నేపథ్యంలో సిఫారసులను నిశితంగా పరిశీలించిన తర్వాత, సిఫార్సులను దృష్టిలో ఉంచుకుని జీవో ఆర్‌టి నంబర్ 1274ను జూన్ 4, 2016న అప్పటి టిఆర్‌ఎస్(ఇప్పటి బిఆర్‌ఎస్) ప్రభుత్వం జారీ చేసింది. జీవోలో మహిళా విద్యా సంస్థల్లో నియామకాల గురించి మార్గదర్శకాలను జారీ చేసింది. తెలంగాణ రాష్ట్రం సబార్డినేట్ సర్వీస్ రూల్స్ ప్రకారం బాలికల కోసం ఉద్దేశించిన పాఠశాలలు/సంస్థల్లోని అన్ని కేడర్‌లలో మహిళా సిబ్బందిని మాత్రమే నియమించుకోవాలి. బాలుర కోసం ఉద్దేశించిన పాఠశాలలు/ సంస్థలు సాధారణ పాఠశాలలు/ సంస్థలుగా పరిగణించబడే వాటిల్లో.. తెలంగాణ రాష్ట్రం సబార్డినేట్ సర్వీస్ రూల్స్ ప్రకారం అటువంటి పాఠశాలలు/సంస్థల్లోని పోస్టులు పురుషులు, మహిళా అభ్యర్థులతో భర్తీ చేయబడతాయి. జనరల్ (బాలుర) పాఠశాలలు/ సంస్థలు బాలికల పాఠశాలలు/సంస్థల కోసం ప్రతి కేడర్‌లో వేర్వేరు రోస్టర్‌లు అమలు చేయబడతాయి.

**జీవోని పటిష్టంగా అమలు చేస్తాం: ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి అలగు వర్షిణి**

మహిళా సంస్థల్లో మహిళలే పనిచేయాలని జీవో 1274 చెబుతుంది. ఎస్సీ గురుకుల సొసైటీల్లోని బాలికల విద్యాసంస్థల్లో ముందుగా 50 సంవత్సరాలు పైబడిన వారిని నియమించుకోవచ్చని ముందుగా ఉండేది.. అయితే ఎప్పుడైతే జీవో 1274 వచ్చిందో అప్పటి నుంచి దానిని కూడా ఆపేశాం. అయితే ఇప్పటికే ప్రారంభమైన డిగ్రీ గురుకుల కాలేజీల్లో డైరక్ట్ రిక్రూట్‌మెంట్ చేసినప్పుడే మగవారిని నియమించాం. ఇప్పుడు వారిని తీసేయలేము. వారికి ఇతర ప్రాంతాల్లో అడ్జెస్ట్ చేయడానికి కూడా అవకాశం లేనందున.. ప్రస్తుతం వారు అక్కడే కొనసాగుతున్నారు. డిగ్రీ కాలేజీల్లో లెక్చరర్లుగా కొనసాగుతున్న వారికి యధావిధిగా సర్వీస్ నిబంధనల మేరకు ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతులు కల్పించాం. అయితే జూనియర్ కాలేజీల్లో లెక్చరర్లుగా పనిచేస్తున్న వారిలో డిగ్రీ కాలేజ్ లెక్చరర్లుగా మగవారికెవ్వరికీ పదోన్నతులు ఇవ్వలేదు త ఇవ్వబోము. ఇకపై ఔట్‌సోర్సింగ్ విధానంలో కూడా మగవారిని ఎక్కడా కూడా నియమించబోము. ఇప్పటికే ఉన్న కొందరు నాన్‌టీచింగ్‌కి చెందిన ఎలక్ట్రీషియన్, ప్లంబర్ వంటి వారిని కూడా సమయాపాలనతో నిరంతర అబ్జర్వేషన్‌లో ఉండేలా నిర్ణయం తీసుకున్నాం.

# ఉద్రిక్తతలను పెంచే ఉద్దేశ్యంలేదు..

## అయితే పాక్ మరోసారి యత్నిస్తే మేం తీవ్రంగా స్పందిస్తాం

## జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్




**న్యూఢిల్లీ, మే 7:** ఆపరేషన్ సింధూర్ పేరిట పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలపై భారత సైన్యం జరిపిన దాడుల వివరాలను జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్ ప్రపంచదేశాలకు వివరించారు. అమెరికా, బ్రిటన్, సౌదీ అరేబియా, జపాన్, రష్యా, ఫ్రాన్స్ దేశాల భద్రతా సలహాదారులకు కూడా ఈ వివరాలను అందించారు. చైనా విదేశాంగమంత్రి వాంగ్‌యీ తోమాట్లాడిన అజిత్‌ధోభాల్ పరిస్థితులను తీవ్రతరంచేసేలా పాకిస్థాన్ వ్యవహరిస్తే భారత్‌నుంచి ప్రతిస్పందన కూడా ఆపరేషన్ సింధూర్‌కంటే గట్టిగా ఉంటుందని స్పష్టంచేసారు. ఉద్రిక్తతలను పెంచే ఉద్దేశ్యం మాత్రం తమకు ఎంతమాత్రం లేదని వెల్లడించారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌పై తీసుకున్న చరనయలు ఆపరేషన్ నిర్వహించడానికి గల కారణాలను ఆయన ప్రపంచ దేశాలకు వివరించారు. అపరేషన్ సిందూర్‌లోజరిపిన దాడులు వివరాలు, జరిపిన విధానం వారికి వివరించారు. భారత మిత్రులతో భవిష్యత్తులో కూడా వివరాలను అందిస్తామని అన్నారు. ఇప్పటివరకూ ఆయన ఎనిమిది దేశాల ప్రతినిధులతో చర్చలు జరిపారు.

# ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

## రైతు ఐక్యవేదిక అధ్యక్షుడు నర్సారెడ్డి

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియను వేగవంతం చేయాలని రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఒక ప్రకటనలో తడిసిన ధాన్యాన్ని ఏలాంటి ఆంక్షలు లేకుండా తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రాల్లో సకాలంలో గన్నీ సంచులను, లారీలను, హమాలీలను సమకూర్చాలన్నారు. వీటిలో జరుగుతున్న జాప్యం కారణంగా రైతులు వరి ధాన్యం రాశుల కుప్పల వద్ద పడిగాపులు కాస్తున్నారని వాపోయారు. ధాన్యం తూకం వేసిన వెంటనే రైతులకు తక్ పట్టి రసీదును తప్పనిసరిగా ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. తప్ప, తాలు పేరిట రైతులను దోపిడీకి గురి చేస్తున్న రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

# త్రిసభ్య కమిటీతో టిజిఇజెఎసి భేటీ

## 57 డిమాండ్లను కమిటీకి తెలిపిన జెఎసి

## మంత్రులతో చర్చించి సమాధానమిస్తామన్న కమిటీ

**హైదరాబాద్, మే 7, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన నవీన్ మిట్టల్ కమిటీతో బుధవారం తెలంగాణ ఉద్యోగ జాయింట్ యాక్షన్ కమిటీ (టిజిఈజేఏసీ) సమావేశమైంది. సచివాలయంలో బుధవారం జరిగిన ఐఏఎస్ ఆఫీసర్స్ కమిటీ మొదటి సమావేశానికి జేఏసీ ఛైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస రావు నేతృత్వంలోని జేఏసీ ప్రతినిధి బృందం హాజరయ్యారు. ప్రభుత్వం నియమించిన కమిటీ ఛైర్ పర్సన్ నవీన్ మిట్టల్ అధ్యక్షతలో సభ్యులు లోకేష్ కుమార్, కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిజిఈజేఏసీ ప్రతినిధి బృందం దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 57 డిమాండ్లను అధికారుల కమిటీకి వివరించారు. కమిటీ ఛైర్పర్సన్ నవీన్ మిట్టల్ అన్ని 57 డిమాండ్లను నోట్ చేసుకున్నారని.. సంబంధిత మంత్రులతో వివరణాత్మక చర్చ తర్వాత డిమాండ్ల స్థితిని తెలియజేస్తామని జేఏసీ బృందానికి తెలియజేశారని జేఏసీ నేతలు తెలిపారు. ఈ సందర్భంగా తమ సమస్యల పరిష్కారం కోసం ఐఏఎస్ అధికారుల కమిటీని నియమించినందుకు ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డికి, తెలంగాణ ప్రభుత్వానికి జేఏసీ నేతలు ధన్యవాదాలు. తెలిపారు. ప్రభుత్వం వేసిన కమిటీతో చర్చల సందర్భంగా టిఎస్‌సిపిఎస్‌ఈయు రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ మాట్లాడుతు.. పాత పెన్షన్ పునరుద్ధరణకు ఎలాంటి ఆర్థిక భారం కాదని, ప్రభుత్వం నెల నెల చందా చెల్లించే బదులు సిపిఎస్ రద్దు చేస్తే ప్రభుత్వానికి నెలకు రూ. 300 కోట్లు పైచిలుకు మిగులుకు అవకాశం ఉందన్నారు. ఇప్పటి వరకు 14 నెలల నుండి జమ కానీ కంట్రిబ్యూషన్ రూ. 6,000 కోట్లు ఉందన్నారు. ఇప్పటికే ఎన్‌పిఎస్ ట్రస్ట్‌తో రూ. 16 వేల కోట్ల ఫండ్ తరలి వెళ్ళిందన్నారు. వీపీఎస్ రద్దు చేస్తే రాష్ట్రానికి ఆదాయం చేకూరుతుందని ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఉపయోగించుకోవచ్చన్నారు. ఈ విషయంలో చొరవ చూపి ప్రభుత్వానికి భారం కానీ ఆర్థికేతర అంశంగా భావించి మానిఫెస్టోలో తెలిపిన విధంగా రాష్ట్రంలో 2.5 లక్షల ఉద్యోగుల పాత పెన్షన్ పునరుద్ధరణ ఆకాంక్షను ప్రజా ప్రభుత్వం నెరవేర్చలాని కోరారు. ఐఏఎస్ అధికారుల కమిటీని కలిసిన వారిలో దామోదర్ రెడ్డి, చావ రవి,వంగ రవీందర్ రెడ్డి, సదానంద్ గౌడ్, దేవరకొండ సైదులు, ముజీబ్ హుస్సేన్, సత్యనారాయణ, బి.శ్యామ్, కస్తూరి వెంకట్, పి మధుసూదన్ రెడ్డి, మాచర్ల రామకృష్ణ ఉన్నారు.

# మిస్ వరల్డ్ ఈవెంట్ షెడ్యూల్‌లో రూరల్ టూరిజం

## గ్రామీణ అందాలకు దక్కనున్న ప్రపంచవ్యాప్త ప్రచారం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే7:** తెలంగాణ గ్రామీణ సాంస్కృతిక, చారిత్రక, పర్యాటక వైభవంను ప్రపంచానికి పరిచయం చేసేందుకు మిస్ వరల్డ్ ఈవెంట్‌ను అందివచ్చిన అద్భుత అవకాశంగా రాష్ట్ర ప్రభుత్వం ఉపయోగించుకునేందు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసింది.120 దేశాల ప్రతినిధులు హాజరయ్యే, 150 కి పైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం అయ్యే మిస్ వరల్డ్ పోటీలు ఈవెంట్ లో తెలంగాణ రాష్ట్రంలోని గ్రామీణ పర్యాటకంకు ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖంగా ప్రమోట్ చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది.మిస్ వరల్డ్ పోటీలలో భాగంగా వరంగల్, హన్మకొండ, ములుగు, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్ జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను షోకేజ్ కు చేసేందుకు రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలను మిస్ వరల్డ్ కంటెస్టెంట్ లు సందర్శించనున్నారు. మిస్ వరల్డ్ ఈవెంట్ లో భాగంగా ఈనెల 12న ఆధ్యాత్మిక టూరిజానికి చిహ్నంగా ఉన్న నాగార్జునసాగర్ లోని బుద్ధవనాన్ని, బుద్ధిష్ట థీమ్ పార్కును మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు సందర్శించనున్నారు.14 న చారిత్రక, ఆధ్యాత్మిక నగరం వరంగల్ లోని వెయ్యి స్థంభాల గుడి, వరంగల్ ఫోర్ట్ ను సందర్శిస్తారు. ఇదే రోజు వరంగల్ జిల్లాలో యునెస్కో వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప ఆలయంను సందర్శిస్తారు. అక్కడే ఏర్పాటు చేసిన పేరిణి నృత్యం ను తిలకిస్తారు. 15 న మిస్ వరల్డ్ కాంటెస్టెంట్ లు ఆధ్యాత్మిక టూరిజం లో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట ఆలయాన్ని సందర్శిస్తారు. హ్యాండ్లూమ్ ఎక్స్పీరియన్సల్ టూర్ లో భాగంగా పోచంపల్లిలో చేనేత వస్త్రాల తయారీని, ప్రదర్శనను ప్రత్యక్షంగా తిలకిస్తారు. 16న మహబూబ్ నగర్ జిల్లాలోని లోని పిల్లల మర్రి వృక్షాన్ని సందర్శిస్తారు. 21న శిల్పారామంలో తెలంగాణ కళాకారుల చే నిర్వహించే ఆర్ట్స్, క్రాఫ్ట్స్ వర్క్ షాప్ హాజరవుతారు. నాగార్జునసాగర్ వద్ద అమరి ఉన్న బుద్ధవనం, బౌద్ధ థీమ్ పార్క్, బౌద్ధ సంస్కృతి, ఆధ్యాత్మికతకు ప్రత్యేకించిన ఆకర్షణ. ఇది బుద్ధుని విగ్రహాలు, స్తూపాలు, ధ్యాన మండపాలతో కూడిన ప్రశాంత వాతావరణాన్ని సృష్టిస్తుంది. ఇక్కడి థీమ్ పార్క్ బుద్ధుని జీవితం, బోధలు, బౌద్ధ కళ సంస్కృతిని సజీవంగా ప్రదర్శిస్తుంది. హన్మకొండ జిల్లా కేంద్రంలో ఉన్న వేయి స్థంభాల గుడి, కాకతీయ రాజవంశం శిల్పకళా వైభవానికి నిదర్శనం. రుద్రదేవ మహారాజు 12వ శతాబ్దంలో నిర్మించిన ఈ గుడి శివుడు, విష్ణువు సూర్యదేవుడికి అంకితమైంది. ప్రత్యేకమైన త్రికూటాకార నిర్మాణంతో, నక్షత్ర ఆకారపు వేదికపై నిలిచి ఉంది. గర్భగుడి చుట్టూ 1000కు పైగా సున్నితంగా చెక్కబడిన స్థంభాలు ఉన్నాయి. వాస్తుశిల్ప వైభవానికి అద్భుతమైన నిదర్శనమే వరంగల్ కోట. 13వ శతాబ్దంలో నిర్మించబడిన ఈ కోట కాకతీయుల రాజధానిగా వ్యూహాత్మక స్థానంగా పనిచేసింది. స్వయంభూ దేవాలయంలోని శివలింగం భక్తులకు పవిత్ర తీర్థస్థలం. కోటలోని ధాన్యాగారాలు, సరుకు గిడ్డంగులు ఆ కాలపు సంపదను తెలియజేస్తున్నాయి. ములుగు జిల్లా పాలంపేట వద్ద ఉన్న రామప్ప గుడి, కాకతీయ సామ్రాజ్యం వాస్తు శిల్ప సంపదకు ప్రతీక. 2021లో యునెస్కో ప్రపంచ వారసత్వ స్థలంగా గుర్తించబడిన ఈ దేవాలయం చుట్టూ సహజ సుందరమైన చెరువు, హరిత వనాలు ఉన్నాయి. ప్రతి సంవత్సరం ఇక్కడికి వచ్చే పర్యాటకులు కాకతీయుల శాశ్వత కళా వైభవాన్ని తప్పక ప్రశంసిస్తారు. పోచంపల్లి (పుట్టపాక) ప్రాంతంలో నేతన్న మేధస్సుతో తయారయ్యే పోచంపల్లి ఇక్కత్ చీరలు ప్రపంచ ప్రసిద్ధి చెందాయి. 200 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన ఈ నేతకళలో నూలు లేదా పట్టు దారాలను డైలో ముందుగా రంగు వేసి, సంక్లిష్టమైన జ్యామితీయ నమూనాలతో నేస్తారు. "ఇకత్" టెక్నిక్లో రంగు వేసిన దారాలు సరిగ్గా మ్యాచ్ అయ్యేలా నేతగార్లు అద్భుతమైన నైపుణ్యం ప్రదర్శిస్తారు. ప్రతి చీర తయారీకి 10-20 రోజులు వరకు సమయం పడుతుంది. 2005లో జియోగ్రాఫికల్ ఇండికేషన్ ట్యాగ్ పొందిన ఈ చీరలు యునెస్కో యొక్క "సిటీ ఆఫ్ క్రాఫ్ట్" గా గుర్తింపు పొందాయి. మహబూబ్ నగర్ జిల్లాలో ఉన్న పిల్లల మర్రి వృక్షం (పిల్లలమర్రి) ఒక అద్వితీయ ప్రకృతి ఆశ్చర్యం. ఫికస్ బెంగాలెన్సిస్ జాతికి చెందిన ఈ ప్రాచీన వృక్షం సుమారు 700 ఏళ్లకు పైగా చరిత్ర కలిగి ఉంది. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉన్న యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహా స్వామి దేవాలయం దక్షిణ భారతదేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలలో ఒకటి. ఇది పంచముఖ నరసింహా స్వామి ఆలయంగా ప్రసిద్ధి చెందింది.



# టిటిడి, పర్యాటకశాఖల మధ్య పరస్పరం భూ బదలాయింపు

### తిరుపతి అర్బన్‌లో 35 ఎకరాల భూ కేటాయింపు

### ప్రైవేట్ సంస్థలకు భూకేటాయింపులు ఉండవు

### టిటిడి బోర్డు అత్యవసర సమావేశంలో కీలక నిర్ణయం

**తిరుమల,మే 7ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్రమైన ఏడుకొండలను కాపాడుకోవడంలో భాగంగా కొండక్రిందిభాగంలో ఎక్కడా ఎవరికీ స్థలాలు కేటాయింపులు చేయబోమని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు స్పష్టం చేశారు. ఈ విషయంగా ఇప్పటికే సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కీలక నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు. గత బోర్డులో తిరుపతి అలిపిరి ప్రాంతంలో రాష్ట్రపర్యాటక శాఖకు కేటాయించిన స్థలాలను రద్దుచేసి, వాటిని టిటిడి తిరిగి స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఇందుకు ప్రత్యామ్నాయంగా పరస్పరం భూ బదలాయింపుల్లో తిరుపతి అర్బన్ పరిధిలో 35ఎకరాలు భూములను పర్యాటకశాఖకు కేటాయించేందుకు టిటిడి బోర్డు ఆమోదించింది. ఇందుకు అవసరమైన ప్రక్రియ వేగవంతం చేయాలని ఛైర్మన్ అధికారులను ఆదేశించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఏడుకొండల క్రింద,పరిసరాల్లో ప్రైవేటు సంస్థలకు టిటిడి భూ కేటాయింపులు ఉండకూడదని తీర్మానం చేశారు. బుధవారం ఉదయం తిరుమల అన్నమయ్యభవనంలో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన అత్యవసర సమావేశం జరిగింది. టిటిడి ఇఒశ్యామలరావు, అదనపు ఇఒ చిరుమా మిళ్ళ వెంకయ్యచౌదరి, జెఇఒ వీరబ్రహ్మం, బోర్డు సభ్యులు జి.భానుప్రకాష్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, పనబాకలక్ష్మి,జాస్తి సాంబశివరావు, సదాశివరావు, శాంతారామ్, జానకీదేవి ప్రత్యక్షం గా పాల్గొనగా, వర్చువల్‌లో బోర్డు సభ్యులు జ్యోతులనెహ్రూ, ఎంఎస్‌రాజు, ఎస్.నరేశ్‌కు మార్, సుచిత్ర ఎల్ల, నర్సిరెడ్డి, మునికోటేశ్వ రరావు, రాష్ట్రదేవాదాయ శాఖ కార్యదర్శి వి.విన య్‌చంద్, కమిషనర్ రామచంద్ర మోహన్ పాల్గొ న్నారు. ప్రపంచప్రఖ్యాత ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం తిరుమల పవిత్రతను కాపాడేందుకు టిటిడి బోర్డు అత్యధిక ప్రాధాన్య తనిస్తుందన్నారు. తదను గుణంగా ఏడుకొండలకు ఆనుకుని ఉన్న భూము లను ప్రైవేటువ్యక్తులకు కేటాయించరాదని నిర్ణ యం తీసుకున్నట్లు ఛైర్మన్ బిఆర్‌నాయుడు తెలిపారు.ఇప్పటికే తిరుపతిరూరల్ మండలం పేరూరు గ్రామంలో సర్వేనంబర్ 604లో ఆంధ్రప్రదేశ్ పర్యాటక సంస్థకు(ఏపిటిఎ) చెందిన 24.68ఎకరాల భూమిని టిటిడికి బదలాయించాలని గతంలో బోర్డు నిర్ణయం తీసుకుంది. ఆ స్థలానికి బదు లుగా తిరుపతి అర్బన్‌లో సర్వేనంబర్ 588ఏ లో ఉన్న టిటిడికి చెందిన 24.68ఎకరాల స్థలాన్ని పర్యాటక సంస్థకు బదలాయింపులకు బోర్డు ఆమోదం తెలిపింది. అలాగే తిరుపతి రూరల్‌లోని సర్వే నంబర్ 604లో పర్యాటకసంస్థకు చెందిన మరో 10.32 ఎకరాల స్థలాన్ని టిటిడికి బదలా యించడం, దానికి బదులుగా తిరుపతి అర్బన్‌లో సర్వేనంబర్ 588ఏ లో టిటిడికి చెందిన 10.32 ఎకరాల స్థలాన్ని పర్యాటకసంస్థకు కేటాయించే ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్రప్రభు త్వాన్ని కోరింది. ఇంకా ప్రస్తుత పరిస్థితుల్లో తిరు మలలో భద్రతను మరింత పటిష్ఠంచేయాలని, భద్రత సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని బోర్డు అధికారులకు ఆదేశాలిచ్చింది. కేవలం రెండుఅంశాలపైనే చర్చించి నిర్ణయం తీసుకునేందుకు అత్యవసర సమావేశం జరగడం విశేషం.

# చెన్నై సూపర్‌కింగ్స్ గెలుపు

## రెండు వికెట్ల తేడాతో కోల్‌కతా జట్టు ఓటమి




**కోల్‌కత్తా, మే 7:** ఐపిఎల్ 18వ సీజన్‌లో 57వ మ్యాచ్ ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. చెన్నైసూపర్‌కింగ్స్ రెండు వికెట్ల తేడాతో రెండు బంతులు మిగిలి ఉండగానే విక్టరీ నమోదు చేసింది. కోల్‌కత్తా ఈడెన్ గార్డెన్స్‌లోజరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత కెకెఆర్ బ్యాటింగ్ తీసుకుని 20 ఓవర్లలో 179 పరుగులుచేసి సిఎస్కేకు 180 పరుగులు సాధించింది. ఓపెనర్లు ఆయుష్ మాత్రే, డేవాన్ కాన్వేలు పరుగులులేకుండానే డకౌట్ అయ్యారు. ఆ తర్వాత వచ్చిన ఉరిల్ పటేల్ నాలుగు సిక్సులు కొట్టి ఉత్కంఠను తీసుకొచ్చాడు. కేవలం 11 బంతుల్లోనే ఒక ఫోర్, నాలుగు సిక్స్‌లు బాది 31పరుగులు చేసాడు. ఆ తర్వాత వచ్చిన అశ్విన్ 8, జడేజా 19 పరుగులు చేసి తక్కువ స్కోరుతోనే ఔట్ అయ్యారు. తర్వాత డేవాల్డ్‌బ్రేవిస్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. కేవలం 25 బంతుల్లో 52పరు గులు చేసాడు.నాలుగు ఫోర్లు, నాలుగు సిక్స్‌లు తన ఖాతాలో వేసుకున్నాడు. దీనితో సీఎస్కే మ్యాచ్ గెలుస్తుందన్న ధైర్యం పెంచాడు. చివరిలో శివం దూబే 45పరుగులు చేసాడు. ఆతడు కూడా మూడు సిక్స్‌లు, రెండుఫోర్లుసాధించడంతో సిఎస్కే విక్టరీ ఖరారయింది. ఇక చివరి ఓవర్‌లో 8 పరుగులు చేయాల్సి ఉండగా ఎంఎస్‌ధోని 17 పరుగులు చేసాడు. మొదటిబాల్‌కే సిక్స్‌కొట్టి మ్యాచ్‌మొత్తం తనవైపు తిప్పేసుకున్నాడు. చివరిలో నూర్‌అహ్మద్‌ఫోర్ కొట్టి మ్యాచ్‌ను గెలిపించాడు. ఇక కెకెఆర్ బౌలర్లలో వైభవ్ అరోరా మూడు, వరుణ్‌చక్రవర్తి, హర్షిత్‌రాణా చెరో రెండు వికెట్లు, మొయిన్ ఆలీ ఒక వికెట్‌తీసారు. తొలుత బ్యాటింగ్‌చేసిన కెకెఆర్ జట్టులో అజింక్యరహానే ఒక్కడే టాప్ స్కోరర్‌గా నిలిచాడు. 48పరుగులుతీసాడు. ఓపెనర్లు గుర్బాజ్ 11, సునీల్ నరైన్ 26పరుగులతో త్వరగా ఔట్ అయినా మనీష్ పాండేతో కలిసి రహానె మంచి భాగస్వామ్యం తెచ్చాడు. మనీష్ పాండే 36 పరుగులుచేసి వ్యూహాత్మకంగా ఆడాడు. చివరిలో రస్సెల్ 38 పరుగులుచేసాడు. కొంత వేగంగా పరుగులుచేయడంతో కెకెఆర్‌స్కోరు 179వరకూ రాగలిగింది. చెన్నై బౌలర్లలో నూర్ అహ్మద్ అద్భుత బౌలింగ్‌చేసాడు.

నాలుగు ఓవర్లలో 31పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు తీసాడు. జడేజా, కంబోజ్ చెరో వికెట్ తీసుకున్నారు.

# భారతీయుడిగా గర్వపడుతున్నా: కెసిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మే7:** ఆపరేషన్ సిందూర్ చేపట్టిన భారత సైన్యంపై మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రశంసలు కురిపించారు. ఒక భారతీయుడిగా తాను గర్వపడుతున్నానని ఆయన పేర్కొన్నారు. ఉగ్రవాదం సమూలంగా అంతం కావాల్సిందేనని ఆయన అభిప్రాయపడ్డారు. "భారత సైన్యం ప్రదర్శించిన సైనిక పాటవానికి ఒక భారతీయుడిగా నేను గర్వపడుతున్నాను" అని సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఉగ్రవాదం, ఉన్మాదం ఏ రూపంలో ఉన్నా, ఏ దేశంలో ఉన్నా అది ప్రపంచ మానవాళికి తీవ్ర నష్టం కలిగిస్తుందని, దాని వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని ఆయన స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని కచ్చితంగా అంతమొందించాలని ఉద్ఘాటించారు. ప్రపంచ శాంతి, సామరస్యాలు నెలకొనాలంటే ఉగ్రవాద నిర్మూలనకు సానుకూల దృక్పథంతో ఆలోచించే ప్రపంచ శక్తులన్నీ ఏకతాటిపైకి రావాలని కేసీఆర్ పిలుపునిచ్చారు. అప్పుడే ఉగ్రవాదాన్ని సమర్థవంతంగా ఎదుర్కొని, శాంతిని స్థాపించగలమని తెలిపారు. భారత సైన్యం ఎంతటి వీరోచితంగా దాడులు నిర్వహిం చిందో, అంతే అప్రమత్తతతో దేశ రక్షణ విధుల్లో నిమగ్నమై ఉండాలని కేసీఆర్ ఆకాంక్షించారు.





పాతబస్తీలో ఆక్రమణలను కూల్చి వేస్తున్న దృశ్యం

# పాతబస్తీలో ఆక్రమణల కూల్చివేత

**హైదరాబాద్ (చార్మినార్), మే 7 ప్రభాతవార్త :** పాతబస్తీ చాంద్రాయణగుట్టలో హైడ్రా బుధవారం ప్రభుత్వ స్థలంలో ఆక్రమంగా నిర్మించిన నిర్మాణాలను కూల్చి వేసింది. బండ్ల గూడ మండలం కందికల్‌గేట్ పరిధిలో మూడు సంవత్సరాలు క్రితం కొందరు వ్యక్తులు కలిసి అర్బన్ ల్యాండ్ సీలింగ్‌లో ఉన్న 2500 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి షెడ్డులు నిర్మించారు. స్థానికులు హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదు చేయటంతో హైడ్రా అధికారులు క్షేత్ర స్థాయాలో పరిశీలించారు. సంబంధిత అధికారుల నివేదిక ఆధారంగా ప్రభుత్వ భూమి అని నిర్ధారించారు. స్థానిక పోలీసుల సహకారంతో బుధవారం హైడ్రా అధికారులు ఆక్రమణలను కూల్చివేశారు.

కూల్చి వేతలకు నిరసనగా కొంత మంది నినాదాలు చేశారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకోవటంతో హైడ్రా కూల్చివేతల ను కొనసాగించింది. హైడ్రా కూల్చి వేసినందుకు స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# ఆపరేషన్ సిందూర్‌లో హైటెక్నాలజీ అస్త్రాలు




**న్యూఢిల్లీ, మే 7:** పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలను భారత్ గట్టిదెబ్బ తీసింది. అర్ధరాత్రి తర్వాత మెరుపు దాడి చేసి తొమ్మిది స్థావరాలను మట్టు బెట్టింది. తానేంటో నిరూపించుకుంది. అయితే త్రివిధ దళాలు అత్యంత సమన్వయంతో నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ కోసం తమ అమ్ములపొదిలో ఉన్న అత్యాధునిక ఆయుధాలను బయటకు తీసింది. ఆపరేషన్ సిందూర్‌లో ఆత్మాహుతి డ్రోన్లు, స్కాల్ప్ క్షిపణులు, హ్యామర్ బాంబులను వాడినట్లు ప్రాథమిక సమాచారం ఆధారంగా తెలుస్తోంది. నిజానికి ఇలాంటి మిలిటరీ ఆపరేషన్లకు ఏ రకం ఆయుధాలు వాడా రన్నది దళాలు ఎప్పుడూ కూడా బహిర్గతం చేయ వు. కానీ, అవి లక్ష్యాలను ఛేదించిన తీరు ఆధా రంగా నిపుణులు ఓ అంచనాకు వస్తుంటారు. ఆపరేషన్ సిందూర్‌లో త్రివిధ దళాలు ఆత్మా హుతి డ్రోన్లను విస్తృతంగా వినియోగించినట్లు తెలుస్తోంది. అవి నిర్దేశించిన ప్రాంతాలను చేరు కుని విరుచుకుపడతాయి. లక్ష్యాలను కచ్చితంగా అనుకున్నట్లు గుర్తిస్తాయి. వాటిలో నిఘా సామర్థ్యాలు కూడా ఉంటాయి. అలాంటి డ్రోన్స్ భారత్ దగ్గర చాలానే ఉన్నాయి. స్కాల్ప్ స్కాల్ప్ క్షిపణులను స్ట్రామ్ షాడో అని కూడా పిలుస్తుంటారు. ఫ్రాన్స్ అభివృద్ధి చేసిన వాటికి దాదాపు 250 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం ఉంటుంది. అందుకే వాటిని శత్రుదేశాల్లోకి చొచ్చుకెళ్లి దాడి చేసేందుకు ఉపయోగిస్తుంటారు. యుద్ధ విమానాలపై నుంచి కూడా కొన్ని ప్రయోగిస్తుంటారు. హ్యామర్ బాంబులను ధృడంగా నిర్మించిన బహుళ అంతస్తుల భవనాలు, బంకర్లను ధ్వంసం చేసేందుకు వినియోగిస్తారు. స్మార్ట్ బాంబ్ కోవలోకి వచ్చే వాటిని లక్ష్యానికి 50-70 కిలోమీటర్ల దూరం నుంచే ప్రయోగించవచ్చు. ఎంత ఎత్తు నుంచి ప్రయోగించిన విషయంపై దాని సత్తా ఆధారపడి ఉంటుందట. అలా ఈ మూడు రకాల అత్యాధునిక ఆయుధాలను వాడినట్లు తెలుస్తోంది. అయితే పాక్‌లో ధ్వంసం చేయాల్సిన ఉగ్రస్థావరాలపై దాడులను ఎయిర్‌ఫోర్స్, ఆర్మీ, నేవీ సమన్వయం చేసుకొన్నాయి. అతిపెద్ద ఉగ్రస్థావరాలైన బవహల్పూర్, మురిద్కేలను ధ్వంసం చేసే బాధ్యత వాయుసేన స్వీకరించిందని సమాచారం. మిగిలిన వాటి సంగతి ఆర్మీ చూసుకుందట. నౌకాదళం తన నిఘా వ్యవస్థలైన పీ8ఐ విమానాలు, ఎంక్యూ9 డ్రోన్లతో సహకారం అందించిందని తెలుస్తోంది.

# సమ్మర్‌లో ఎంజాయ్‌మెంట్ మూవీ 'సింగిల్'

కింగ్ ఆఫ్ ఎంటర్టైన్మెంట్ శ్రీ విష్ణు ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో హోల్సమ్ ఎంటర్‌టైనర్ సింగిల్‌తో అలరించబోతున్నారు. ఈ చిత్రంలో కేతిక శర్మ, ఇవానా కథానాయికలుగా నటించారు, వెన్నెల కిషోర్ కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి కార్తీక్ రాజు దర్శకత్వం వహించారు. గీతా ఆర్ట్స్ మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో కళ్యా ఫిల్మ్స్ తో కలిసి చిత్రాన్ని విద్యా కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరి నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ ట్రైలర్ పాటలు సినిమాపై హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. సింగిల్ మే 9న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా హీరో శ్రీవిష్ణు విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.


హీరో శ్రీవిష్ణు

అందరికీ నమస్కారం. మీ అందరినీ కలవడం చాలా ఆనందంగా ఉంది. మే 9న సింగిల్ సినిమా రిలీజ్ కాబోతుంది. మొదటి నుంచి చివరి వరకు ప్రేక్షకుల్ని నవ్వించాలనే ఉద్దేశంతో తీసిన సినిమా ఇది. కొత్త కథ, స్క్రీన్ ప్లే ఉంటుంది. బ్యూటిఫుల్ లవ్ స్టోరీ. ఇంటర్వెల్ క్లైమాక్స్ కొత్తగా ఉంటాయి. అన్ని సన్నివేశాలు కూడా మనల్ని మనం రిలేట్ చేసుకునేలా ఉంటాయి. యంగ్స్టర్స్ అందరికీ చాలా బాగా కనెక్ట్ అవుతుంది. అలాగే ఫ్యామిలీస్ కూడా హ్యాపీగా సినిమా చూడొచ్చు. మేము అనుకున్నది స్క్రీన్ మీదకి చాలా అద్భుతంగా వచ్చింది. ఆడియన్స్ సినిమా చూసి మనస్ఫూర్తిగా ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నాను. గీతా ఆర్ట్స్‌లో వర్క్ చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. నేను ఎప్పటినుంచో గీతా ఆర్ట్స్‌లో చేయాలి. లక్కీగా ఈ సినిమా కుదిరింది 100 కాన్ఫిడెన్స్ ఉన్న జోనర్ ఇది. ఈ జోనర్‌లో గీత ఆర్ట్స్ తో చేయడం వెరీ వెరీ హ్యాపీ. డైరెక్టర్ కార్తీక్ రాజుతో నాకు టూ ఇయర్స్ ట్రావెల్ ఉంది. చాలా మంచి టీంతో కలిసి సినిమా చేశాం. సినిమా చూసి అందరూ హ్యాపీగా నవ్వుకుంటారని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

**డైరెక్టర్ కార్తీక్ రాజు ఈ సినిమా కథ చెప్పినప్పుడు.. ఫైనల్ అవుట్ చూసుకున్నాక మీకు ఎలా అనిపించింది?** కథ చెప్పినప్పుడు చాలా మంచి ఎంటర్టైనర్ అవుతుందని నమ్మకం కలిగింది. ఫైనల్‌గా సినిమా చూసుకున్న తర్వాత చాలా పెద్ద ఎంటర్టైనర్ అవుతుందని అనిపించింది.

**టైటిల్ సింగిల్ అన్నారు.. ఇద్దరు హీరోయిన్స్ ఉన్నారు?** చాలా కొత్త క్లైమాక్స్ ఇది. అందరికీ నచ్చుతుంది. నా క్యారెక్టర్, వెన్నెల కిషోర్ క్యారెక్టర్. ఇద్దరు హీరోయిన్స్ క్యారెక్టర్స్‌ని ఆడియన్స్ చాలా ఎంజాయ్ చేస్తారు. ఈ నాలుగు క్యారెక్టర్లు కూడా ఆడియన్స్‌కి చాలా నచ్చుతాయి. క్లైమాక్స్ చాలా యూనిక్‌గా ఉంటుంది. అందరిని ఎంటర్టైన్ చేస్తుంది.

**వెన్నెల కిషోర్ క్యారెక్టర్ గురించి?** మా ఇద్దరిలో ఎవరి క్యారెక్టర్ లేకపోయినా ఈ సినిమా లేదు. సినిమా చూసిన తర్వాత అది మీకే అనిపిస్తుంది. కిషోర్ వచ్చిన తర్వాతే ఈ ప్రాజెక్టుని 100 చేస్తున్నామని భావించాం.

**మీరు ఒక క్యారెక్టర్‌కి ఒక క్యారెక్టర్‌కి ట్రాన్స్ఫర్మేషన్ ప్రాసెస్‌ని ఎలా చూస్తారు?** నేను ప్రతి క్యారెక్టర్ నీ ఎంజాయ్ చేస్తాను. డైరెక్టర్‌తోనే ఎక్కువ ట్రావెల్ చేస్తాను. ఆ ట్రావెల్ లోనే 50 వచ్చేస్తుంది. తర్వాత లొకేషన్‌లో ఇంకొంత క్యారెక్టర్ మీద కమాండ్ పెరుగుతుంది. మీరు డైలాగ్స్‌లో సపరేట్‌గా ఒక డిక్షన్ సృష్టించుకున్నారు..

**దానికోసం ఎలాంటి ప్రాక్టీస్ చేస్తుంటారు?** ముఖ్యంగా యంగ్స్టర్స్ ఆ డైలాగ్ డిక్షన్‌ని చాలా ఎంజాయ్ చేస్తున్నారు. వాళ్ళ కోసం నేను సపరేట్‌గా కేర్ తీసుకుని చేస్తున్నాను.


# ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'శుభం'

ప్రముఖ నటి సమంత నిర్మాతగా ట్రా లా లా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ మీద నిర్మిస్తున్న చిత్రం శుభం. ఈ సినిమాకు ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహించారు. ఈ మూవీకి వివేక్ సాగర్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, క్లింటన్ సెరెజో సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రం మే 9న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. ఈ క్రమంలో మంగళవారం నాడు సమంత మీడియాతో ముచ్చటించారు. ఆమె చెప్పిన విశేషాలివే..నటిగా ఓ శుక్రవారం ఎలా ఉంటుందో నాకు అనుభవం ఉంది. కానీ నిర్మాతగా ఇది నాకు మొదటి శుక్రవారం. ఎంతో నర్వెస్‌గా ఉన్నాను. నిర్మాతకు ఎన్ని కష్టాలు ఉంటాయో నాకు ఇప్పుడు అర్థం అవుతోంది. గత వారం రోజులుగా నిద్రలేని రాత్రులే గడుపుతున్నాను. పోస్ట్ ప్రొడక్షన్ టీం, మిక్సింగ్ టీం, ఎడిటింగ్ ఇలా అందరూ నిద్ర లేకుండా పని చేస్తున్నారు. నాకు నా టీం మీద మరింత గౌరవం పెరిగింది. శుభం చిత్రం చాలా బాగా వచ్చింది. మంచి కథ. సినిమాపై నాకు చాలా నమ్మకం ఉంది. నటిగా నేను ఎంతో చూశాను. ఎంతో అభిమానం లభించింది. కానీ ఇంకా ఏదో చేయాలనే తపన, కోరిక మాత్రం ఉంటూ వచ్చింది. నేను తీసుకున్న ఆ బ్రేక్ టైంలో చాలా ఆలోచించాను. హీరోయిన్‌గా నేను ఏ సినిమాలు చేయలేకపోయాను. అసలు ఇక సినిమాల్లో నటిస్తానో కూడా తెలియని సమయంలో నిర్మాతగా మారాలనే ఆలోచన వచ్చింది. నటించకపోతేనేం సినిమాలు నిర్మించొచ్చు కదా అని అనుకున్నాను. కెరీర్ మొదలు పెట్టి దాదాపు 15 ఏళ్లు అయింది. నాకు ఇంత అనుభవం ఉంది కదా అని ప్రొడక్షన్ కంపెనీ స్టార్ట్ చేశాను. ఎలాంటి హడావిడి లేకుండా సినిమాను ప్రారంభించాం. 8 నెలల్లోనే చిత్రాన్ని పూర్తి చేశాం. ఇప్పుడు ఆడియెన్స్ ముందుకు తీసుకు వస్తున్నాం. శుభం అనే టైటిల్ పెట్టడానికి కారణం ఉంది. ఈ చిత్రంలో ఎక్కువగా సీరియల్ గురించి ఉంటుంది.. ఆ సీరియల్‌లో శుభం కార్డ్ ఎప్పుడు పడుతుందా? అని అంతా ఎదురుచూస్తుంటారు. అందుకే ఆ టైటిల్ పెట్టాం. ఇక నా ప్రొడక్షన్ కంపెనీకి ట్రా లా లా అని పెట్టడానికి కూడా కారణం ఉంది. చిన్నప్పుడు బ్రౌన్ గర్ల్ ఇన్ ది రెయిన్ అనే పద్యం ఉండేది. అందుకే ట్రా లా లా అని పెట్టాం. గౌతమ్ మీనన్ నాకు మొదటి ఛాన్స్ ఇచ్చారు. ఆయన తల్చుకుంటే ఆ టైంలో ఏ టాప్ హీరోయిన్ అయినా నటించే వారు. కానీ ఆయన నాలాంటి కొత్త వారికి అవకాశం ఇచ్చారు. నేను కూడా నిర్మాతగా కొత్త వారిని ఎంకరేజ్ చేయాలనే లక్ష్యంతోనే ఉన్నాను. ఎన్నో కలలు కంటూ సినిమా పరిశ్రమలోకి వస్తారు. మా చిత్రం కోసం శ్రియా, శ్రావణి, షాలినీలు ఎంతో కష్టపడ్డారు. నా సినిమాలో నటించిన వారందరినీ చూస్తే నా పాత రోజులన్నీ గుర్తుకు వచ్చాయి. నటిగా ఉన్నప్పుడు నిర్మాత కష్టాలేవీ నాకు అర్థం కాలేదు. ఒక్క రోజు ఒక్క సీన్ అనుకున్నట్టుగా జరగకపోతే ఎంత నష్టం వస్తుంది.. డబ్బు ఎంత వృథా అవుతుందో నాకు ఇప్పుడు తెలిసి వచ్చింది. ఎంతో మంది టైం వేస్ట్ అవుతుందని అర్థమైంది. శుభం చిత్రంలోని కేమియో పాత్రని నేను చేయాల్సింది కాదు. కానీ నిర్మాతగా మొదటి సారిగా నేను ఎవరి దగ్గరకు వెళ్లి ఫేవర్ అడగాలని అనుకోలేదు. అందుకే ఆ పాత్రను నేనే పోషించాను. నేను ఈ మూవీని ఇంకో మూడు, నాలుగు రోజులు మాత్రమే ప్రమోట్ చేయగలను. కానీ ఆ తరువాత ఈ మూవీ భారమంతా ప్రేక్షకుల మీదే ఉంటుంది. శుభం చిత్రానికి ఎంత ఖర్చు పెట్టాలో అంత ఖర్చు పెట్టాం. సినిమా చూస్తే అందరికీ ఆ విషయం అర్థం అవుతుంది. తక్కువ పెట్టలేదు.. అలా అని ఎక్కువ ఖర్చు పెట్టలేదు. ప్రతీ సినిమాకు, కథకు ఎంత కావాలో అంత ఖర్చు పెట్టాల్సి వస్తుంది.



## 'కన్నప్ప' విష్ణు మంచు గ్లోబల్ ప్రమోషన్స్..

డైనమిక్ స్టార్ విష్ణు మంచు తన డ్రీమ్ ప్రాజెక్ట్ కన్నప్పను ఓ మైలు రాయి చిత్రంగా మలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మార్కెట్‌ను స్టడీ చేస్తూ గ్లోబల్‌గా ప్రమోట్ చేసేందుకు రెడీ అవుతున్నారు. విష్ణు మంచు నటించిన ఈ హిస్టారికల్ మూవీ ప్రమోషన్స్‌ను అమెరికా నుంచి ప్రారంభించబోతున్నారు. కన్నప్పయుఎస్ టూర్ మే 8న న్యూజెర్సీలో ప్రారంభం కానుంది. అక్కడ విష్ణు నార్త్ బ్రున్స్‌విక్‌లోని రీగల్ కామర్స్ సెంటర్‌లో అభిమానులతో ముచ్చటించనున్నారు.మే 9న డల్లాస్‌కు బయలుదేరి వెళ్లి సాయంత్రం 7 గంటలకు గెలాక్సీ థియేటర్స్ గ్రాండ్ స్కేప్, ది కాలనీ, టెక్సాస్‌లో ప్రేక్షకులతో సందడి చేయనున్నారు. ఈ పర్యటన మే 10న శాన్‌ఫ్రాన్సిస్కో బే ఏరియాలో ముగుస్తుంది. అక్కడ ఆయన ఉదయం 10:30 గంటలకు సినీ లాంజ్ ఫ్రీమాంట్ 7 సినిమాస్‌ను సందర్శిస్తారు. ఈ చిత్రం ఓవర్సీస్ విడుదలను వాసారా చూసుకుంటోంది. అనంతరం ఇండియాకు తిరిగి రానున్న విష్ణు.. దేశంలోని పలు నగరాల్ని చుట్టి రానున్నారు. ఆధ్యాత్మిక తీర్థయాత్రలు, అన్ని వర్గాల ప్రేక్షకులతో కనెక్ట్ అవ్వడానికి, అన్ని ప్రాంతాల మీడియాతో విష్ణు మంచు ఇంటరాక్ట్ కానున్నారు. కన్నప్ప నుంచి వచ్చిన భక్తి గీతం "శివా శివా శంకరా" విడుదలైనప్పటి నుంచి పాజిటివ్ వైబ్స్ క్రియేట్ అయిన సంగతి తెలిసిందే. ఈ చిత్రంలోని లవ్ ట్రాక్ కూడా అందరినీ ఆకట్టుకుంది. ఇక ఇప్పుడు అందరి దృష్టి కన్నప్ప ట్రైలర్‌పై ఉందన్న సంగతి తెలిసిందే.



# అందరినీ ఆకట్టుకునే '6జర్నీ'

రవి ప్రకాష్ రెడ్డి, సమీర్ దత్త, టేస్టీ తేజ, పల్లవి, రమ్యా రెడ్డి తదితరులు ప్రధాన పాత్రల్లో పాల్యం శేషమ్మ, బసిరెడ్డి సమర్పణలో అరుణ కుమారి ఫిలింస్ బ్యానర్ పై రూపొందిన చిత్రం 6జర్నీ. బసీర్ ఆలూరి దర్శకత్వంలో పాల్యం రవి ప్రకాష్ రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సెన్సార్ సహా అన్నీ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని మే 9న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు బసీర్ మాట్లాడుతూ,సినిమా ఇండస్ట్రీలో ఎన్నో కష్టాలు పడ్డాను. ఇది వరకు తెలుగులో సమరం, కన్నడలో మరో చిత్రాన్ని చేశాను. ఇప్పుడు నా మూడో సినిమా 6 జర్నీ అంటూ ఆడియెన్స్ ముందుకు వస్తున్నాను. ఇది ఆరుగురి జీవిత ప్రయాణం. గోవా ట్రిప్‌ను ఎంజాయ్ చేసి సూసైడ్ చేసుకోవాలని అనుకునే ఓ బ్యాచ్ కథే 6జర్నీ. అలాంటి వారి ప్రయాణంలో ఎదురైన పరిస్థితులు ఏంటి? అన్నది ఈ సినిమా కథ. సమీర్, పల్లవి జంట అద్భుతంగా నటించింది. కొత్త అబ్బాయి విలన్‌గా అభిరాం చక్కగా నటించారు. కొత్త మ్యూజిక్ డైరెక్టర్, కొత్త ఫైట్ మాస్టర్ ఇలా అందరూ అద్భుతంగా పని చేశారు. నిర్మాతది మా ఊరే. ఆయనకు సినిమా అంటే చాలా ఇష్టం. ఈ కథ ఆయనకు నచ్చడంతో ప్రాజెక్ట్ ముందుకు వచ్చింది. వర్షాకాలంలో ఈ మూవీ షూటింగ్ చేశాం. షూటింగ్ సమయంలో ఎన్నో కష్టాలు వచ్చాయి. ప్రకృతి మాకు ఎంతో సహకరించింది. ఎన్ని అడ్డంకులు వచ్చినా షూటింగ్ సక్సెస్‌ఫుల్‌గా కంప్లీట్ చేశాం. మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎన్ సింహా మంచి పాటల్ని ఇచ్చారు. మంచి సంగీతం, మంచి పాటలున్నాయి. ఆల్రెడీ మా పాట యూట్యూబ్‌లో ట్రెండ్‌అవుతున్నాయి. మంచి కాన్సెప్ట్‌తో తీసిన ఈ చిత్రం అందరినీ ఆకట్టు కుంటుంది. క్లైమాక్స్ చాలా గొప్పగా ఉంటుంది. శ్రీరాముడు పుట్టిన నేల మీద ఉగ్రవాదులు దాడి చేయడం ఏంటి? ఇక్కడ యువత ఎలా పోరాడాలి అంటూ దేశ భక్తిని రేకెత్తించేలా క్లైమాక్స్‌ను అద్భుతంగా తెరకెక్కించాం. ప్రస్తుతం ఉన్న పరిస్థితులకు తగ్గట్టుగా క్లైమాక్స్ ఉంటుంది. సినిమా పూర్తిగా టెర్రరిజం మీదే నడుస్తుంది. అనుకున్న బడ్జెట్ కంటే కాస్త ఎక్కువే అయింది. బోర్డర్‌లో సినిమా షూటింగ్, వర్షాకాలం అవ్వడంతో కాస్త బడ్జెట్ పెరిగింది. మళ్లీ అక్టోబర్‌లో ఓ సినిమాను చేయబోతోన్నాను. ముంబై బ్యాక్ డ్రాప్‌లో ఆ చిత్రం ఉం టుంది. ఇంకా చర్చలు జరుగుతున్నాయి.


దర్శకుడు బసీర్

## 'కింగ్‌డమ్' సాంగ్ రీల్ చేయాలంటూ రిక్వెస్ట్, విడియో వైరల్

తన కొత్త సినిమా 'కింగ్డమ్' రిలీజ్‌కు రెడీఅవుతున్న నేపథ్యంలో మూవీ ప్రమోషన్‌ను డిఫరెంట్‌గా చేస్తున్నారు హీరో విజయ్ దేవరకొండ. ఆయన తాజాగా ముంబై ఇండియన్స్ ప్లేయర్ తిలక్ వర్మతో కలిసి పికిల్ బాల్ మ్యాచ్ ఆడారు. ఈ మ్యాచ్ బెస్ట్ ఆఫ్ త్రీలో తనను ఓడిస్తే ముంబయి ఇండియన్స్ జెర్సీ వేసుకుంటానని తిలక్ వర్మకు విజయ్ దేవరకొండ ఛాలెంజ్ విసిరారు. ఈ పికిల్ బాల్ మ్యాచ్‌లో 21తో విజయ్ టీమ్ గెలుపొందింది. ఈ మ్యాచ్ వీడియోను ముంబై ఇండియన్స్ టీమ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఈ వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. ఈ వీడియోకు పెద్ద ఎత్తున నెటిజన్స్, సెలబ్రిటీలు స్పందిస్తున్నారు. విజయ్ కూడా ఈ వీడియోకు స్పందిస్తూ తన కొత్త సినిమా కింగ్డమ్‌లోని హృదయం లోపల సాంగ్‌కు రీల్ చేయాలని తిలక్ వర్మ, రాజంగడ్‌ను కోరారు. హైదరాబాద్‌లో జరిగే ప్లేఆఫ్స్‌కు వస్తానని, ముంబయి టీమ్‌ను సపోర్ట్ చేస్తానని తెలిపారు. వాంఖేడే స్టేడియంలో గుజరాత్ టైటాన్స్‌తో ముంబై ఇండియన్స్ పోరుకు రెడీ అవుతోంది. కింగ్డమ్ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్ టైన్ మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్స్‌పై నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. టాలెంటెడ్ డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి స్పై యాక్షన్ థ్రిల్లర్ మూవీగా రూపొందిస్తున్నారు. కింగ్డమ్ సినిమా ఈ నెల 30న ఈ సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సినిమా మీద ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పడుతున్నాయి.




రెజీనా నయా లుక్

# '23' ట్రైలర్ లాంచ్

మల్లేశం, 8 ఎ.ఎం. మెట్రో చిత్రాలతో ప్రశంసలు పొందిన దర్శకుడు రాజ్ ఆర్ నిజమైన సంఘటనల నుంచి ప్రేరణ పొందిన మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్ 23తో వస్తున్నారు. స్టూడియో 99 నిర్మించిన ఈ చిత్రంలో తేజ, తన్మయి ప్రధాన పాత్రలు పోషించారు. వెంకట్ సిద్దారెడ్డి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ ఇప్పటికే సంచలనం సృష్టించింది. ఈ సినిమాని స్పిరిట్ మీడియా డిస్ట్రిబ్యూషన్ చేస్తుంది. సినిమా మే 16న గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. తాజాగా మేకర్స్ ట్రైలర్ లాంచ్ చేశారు. హీరో ప్రియదర్శి, ఆస్కార్ అవార్డ్ విన్నింగ్ లిరిసిస్ట్ చంద్రబోస్ చీఫ్ గెస్ట్‌లుగా హాజరైన ఈ వేడుకు గ్రాండ్‌గా జరిగింది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఆస్కార్ అవార్డ్ విన్నింగ్ లిరిసిస్ట్ చంద్రబోస్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఈ వేడుకలో అందరూ కూడా మనసు అంతరాళంలో నుంచి మాట్లాడినట్టుగా అనిపించింది. డైరెక్టర్ రాజ్ వజ్ర సంకల్పంతో సినిమా తీస్తారు. నిలువెత్తు నిజాయితీ ఉన్న డైరెక్టర్ ఆయన. ఆయనలోని నిజాయితీ 23 సినిమాలో పనిచేసిన నటీనటులు టెక్నీషియన్స్ అందరిలోకి ప్రవహించి అందరూ కూడా చాలా నిజాయితీగా ఈ సినిమాకి పనిచేశారు. ఈ సినిమా కోసం పాటలు రాయడానికి సినిమాని చూడటం జరిగింది. సినిమా చూసిన తర్వాత దీనికి పాటలు రాయడం కంటే ఇంత మంచి సినిమాని ఆడియన్స్‌లోకి ఎలా తీసుకెళ్లాలి, ఎలా రిలీజ్ చేయాలనే ఆలోచన ఎక్కువైంది. సృజనాత్మకతకి పెద్దపీట వేసే దర్శకుడు రాజ్. ఈ సినిమాలో మంచి సాహిత్యం రాసే అవకాశం దొరికింది. ఈ సినిమాలో నటించిన నటీనటులంతా చాలా సహజంగా పాత్రలలో ఒదిగిపోయారు. అసలు నటిస్తున్నారనే భావనే కలగలేదు. అంతా సహజ సిద్ధంగా ఉంది. ఈ సినిమా చాలా పెద్ద విజయం సాధించబోతుంది. నటనపరంగా మరో స్థాయిలో ఉండబోతుందని నమ్మకం నాకు ఉంది. మల్లేశం సినిమా ప్రియదర్శికి ఎలా నటుడిగా జన్మనిచ్చిందో ఈ సినిమా కూడా ఇందులో నటించిన నటీనటులందరికీ కొత్త జన్మ ఇవ్వాలని కోరుకుంటున్నాను. ఈ సినిమాలో మూడు పాటలు రాసే అవకాశం ఇచ్చిన డైరెక్టర్ రాజ్‌కి మరొకసారి ధన్యవాదాలు అన్నారు. హీరో ప్రియదర్శి మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఐదేళ్ల క్రితం ఇదే వేదిక మీద మల్లేశం ప్రి రిలీజ్ ఈవెంట్ చేశాం. ఈ వేడుకకు నన్ను ఇన్వైట్ చేసిన రాజ్‌కి థాంక్యూ. నా కెరీర్‌కి కొత్త ఊపిరినిచ్చిన వ్యక్తి రాజ్. ఆ కృతజ్ఞతతో ఈ వేడుకకి రావడం జరిగింది. నాకు మల్లేశం లాంటి మంచి సినిమానిచ్చిన రాజ్‌కి ఈ వేదిక మీద హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నాను. 23 సినిమా కథ నాకు తెలుసు. ఈ కథని చేయమని రాజ్ నా దగ్గరికి వచ్చారు. కొన్ని వేరే ప్రాజెక్ట్స్ వల్ల నేను చేయడం కుదరలేదు. చాలా గొప్ప సినిమా ఇది. ఇలాంటి గొప్ప ఆలోచన, కథతో ప్రేక్షకులు ముందుకు వస్తున్న రాజ్‌ని చూస్తుంటే చాలా గర్వంగా ఉంది. చరిత్రలో ఇలాంటి ప్రశ్నలు అడగడం చాలా అవసరం. రాజుగారు లాంటి డైరెక్టర్ ప్రొడ్యూసర్ ఉండడం తెలుగు సినిమా అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు. డైరెక్టర్ రాజ్ రాచకొండ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. చాలా స్ట్రాంగ్ టెక్నికల్ టీంతో చేసిన సినిమా 23. మార్క్ మ్యూజిక్ చేశారు. చంద్రబోస్, ఇండస్, రెహమాన్ లాంటి రచయితలు సినిమాకి పాటలు రాశారు. కార్తీక్, చిన్మయి, రమ్య బెహరా, కైలాష్ ఖేర్ లాంటి ప్రముఖ సింగర్స్ పాటలు పాడారు. చిన్న సినిమాల్లో ఇది చాలా పెద్ద సినిమా. థియేటర్ కోసం చాలా శ్రద్ధ తీసుకుని టెక్నికల్‌గా చాలా ఫోకస్‌తో చేసిన సినిమా ఇది. ఇది థియేటర్‌కి పర్ఫెక్ట్ సినిమా. దయచేసి ఈ సినిమాని థియేటర్స్‌లో చూడండి. అక్కడ చూస్తే ఓటీటీలో కూడా ఎంకరేజ్మెంట్ ఉంటుంది. ఇలాంటి సినిమాలు థియేటర్స్‌లో ఆడితే థియేటర్స్ కల్చర్ బావుంటుంది. ఇక్కడ పని చేసిన అందరూ కూడా ఫ్యూచర్లో పెద్ద సినిమాలకి వర్క్ చేస్తారు. ఇలాంటి సినిమాలుని ప్రభుత్వాలు కూడా ఎంకరేజ్ చేయాలని రిక్వెస్ట్ చేశాను. కమర్షియల్ క్యాలి క్యులేషన్స్‌తో చేసిన సినిమా కాదిది. ఇలాంటి సినిమాలను మీడియా కూడా కాస్త ప్రోత్సహించాలని కోరుకుంటున్నాను. ఈ సినిమాకి అందరి సహకారం ఉండాలని కోరుతున్నాను అన్నారు. తన్మై మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. నా తొలి సినిమాకే చంద్రబోస్ లిరిక్స్ రాయడం గొప్ప ఆనందాన్నిచ్చింది. ఇందులో ప్రతిపాట మాజర్నీని తెలియ జేస్తుంది. అంత బ్యూటిఫుల్‌గా లిరిక్స్ రాసిన చంద్రబాబుకి ధన్యవాదాలు.



# ఇండస్ట్రీలో తమన్నా రెండు దశాబ్దాలు పూర్తి..

మిల్కీ బ్యూటీ తమన్నా ఇండస్ట్రీలో అడుగు పెట్టి రెండు దశాబ్దాలు దాటింది. అయినా కూడా జోరు తగ్గడం లేదు. ఇప్పటి వరకు మిల్కీ బ్యూటీ తమన్నా వరుస సినిమాలతో బిజీ బిజీగానే ఉంది. కొన్నాళ్ల క్రితం మిల్కీ బ్యూటీ తమన్నా పనై పోయింది అంటూ కొందరు కామెంట్ చేశారు. ఆ సమయంలోనే తమన్నా సినిమాలకు గుడ్ బై చెబుతుందేమో అని అంతా అనుకున్నారు. కానీ ఆమె పట్టుదలతో సినిమాల్లో కొనసాగింది. ఆ సమయంలో కాస్త ఆఫర్లు తగ్గినా కూడా వెబ్ సిరీస్‌లు, ఐటెం సాంగ్స్‌తో కెరీర్‌ను నిలబెట్టుకుంది. ఇప్పుడు మరోసారి తమన్నా కెరీర్ పీక్స్‌లో ఉంది. హిందీ, తెలుగు భాషల్లోనే కాకుండా ఇతర భాషల్లో కూడా వరుస సినిమాలు చేస్తోంది. ఇటీవల ఈమె ఓదెల 2 సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాలో లేడీ అఘోరి పాత్రలో నటించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. శివశక్తి పాత్రతో ఓదెల సినిమాలో అద్భుతమైన నటన కనబర్చిన తమన్నా మరోసారి తన నట విశ్వరూపం చూపించింది. తెలుగులో చాలా రోజుల తర్వాత తమన్నా చేసిన ఓదెల 2 నిరాశ పరచింది. అయినా కూడా ఆమె మరిన్ని సినిమాల్లో నటించేందుకు ఆ సినిమా బూస్ట్‌గా నిలిచింది అనడంలో సందేహం లేదు. ఇండస్ట్రీలో అడుగు పెట్టి చాలా కాలం అయినా ఇప్పటికీ ఆమెకు ఉన్న క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు అనడంలో సందేహం లేదు. సోషల్ మీడియాలోనూ ఆమె ఫాలోయింగ్ అదే స్థాయిలో ఉంది. ఇన్‌స్టాగ్రామ్‌లో తమన్నాకి దాదాపుగా మూడు కోట్ల మంది ఫాలోవర్స్ ఉంటారు. వారిని ఎంటర్‌టైన్ చేసేందుకు గాను అందాల ఆరబోత ఫోటోలతో రెగ్యులర్‌గా రెచ్చి పోతూనే ఉంటుంది. తాజాగా మరోసారి మిల్కీ బ్యూటీ రెడ్ డ్రెస్‌లో తన అందమైన ఫోటోలను షేర్ చేసింది. సాధారణంగా హీరోయిన్స్ రెడ్ డ్రెస్‌లో చాలా అందంగా కనిపిస్తూ ఉంటారు. తమన్నా ఈ ఫోటోల్లో మరింత అందంగా కనిపిస్తుంది అంటూ అభిమానులు నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. మిల్కీ బ్యూటీ తమన్నా షేర్ చేసిన ఈ ఫోటోలు ఆమెపై అభిమానంను మరింత పెంచే విధంగా ఉన్నాయని, ఈమె ఇండస్ట్రీలో అడుగు పెట్టి 20ఏళ్లు అయిందంటే నమ్మశక్యంగా లేదని కొందరు అంటున్నారు. ఈ ఏడాది ఇప్పటికే ఓదెల 2, రైడ్ 2 సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన తమన్నా మరో రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలున్నాయి. కేవలం హీరోయిన్‌గానే నటిస్తాను అనే పట్టింపు లేకుండా వచ్చిన ప్రతి ఒక్క ఆఫర్‌ను ఈ అమ్మడు స్వాధీనం చేసుకుంటూ దూసుకుపోతుంది.



# మొక్కల సంరక్షణకు..

ఎంతో మంది మొక్కలు పెంచుకుంటారు. వాటిని ప్రాణం కంటే ఎక్కువగా చూసుకుంటారు. అలాంటిది ఒక్కోసారి రోజుల తరబడి ఇంట్లో లేనప్పుడో లేదంటే సమయం దొరక్క పోవడం వల్లనో వాటి సంరక్షణ విషయంలో శ్రద్ధ చూపక పోవచ్చు. దీనివల్ల అవి వాడిపోతుంటాయి. అయితే అలాంటి వాటికి తిరిగి జీవం పోయాలంటే కొన్ని ఇంటి చిట్కాలు మేలు చేస్తాయంటున్నారు నిపుణులు. బియ్యం కడిగిన నీళ్లతో అందాన్ని సంరక్షించుకోవచ్చన్న సంగతి తెలిసిందే! అయితే ఇవే నీటితో మొక్కల్ని తిరిగి పునరుత్తేజితం చేయచ్చంటున్నారు నిపుణులు. ఈ బియ్యం కడిగిన నీటిని ఒక స్ప్రే బాటిల్లో నింపు కొని.. రోజుకోసారి మొక్కలపై, వాటి మొదళ్లపై స్ప్రే చేయాలి. వీటిలో ఉండే స్టార్చ్ మొక్కలకు దివ్యౌషధంలా పనిచేసి వాటికి తిరిగి జీవం పోస్తుంది. వాడిపోయిన మొక్కల్ని పునరుత్తేజితం చేయడంలో అరటి పండు తొక్కలూ సహాయపడతాయి. తొక్కల్ని చిన్న చిన్న ముక్కలు చేసి ఒక గ్లాస్ జార్లో వేయాలి. అందులో లీటరు నీటిని నింపి రాత్రంతా అలాగే వదిలేయాలి. ఉదయాన్నే నీటిని వడకట్టి స్ప్రే బాటిల్లో నింపుకోవాలి. ఈ నీటిని రోజుకోసారి లేదా రెండుసార్లు చొప్పున మొక్కలు, వాటి మొదళ్లపై స్ప్రే చేస్తే సత్ఫలితాలుంటాయి. వీటిలోని పొటాషియం మొక్కల్ని తిరిగి పునరుత్తేజితం చేయడంలో సహకరిస్తుంది.

టేబుల్ స్పూన్ చక్కెర కలిపిన నీళ్ల ఒక స్ప్రే బాటిల్లో నింపి.. మొక్కల ఆకులపై కొద్దిగా స్ప్రే చేయాలి. అయితే ఈ మిశ్రమాన్ని మొక్కల మొదళ్లపై స్ప్రే చేయకపోవడమే మంచిది!



ఎందుకంటే ఇందులోని తియ్యదనం వల్ల కీటకాలు మొక్క ఆరోగ్యాన్ని మరింత దెబ్బతీస్తాయ! కాబట్టి కొద్ది మోతాదులో స్ప్రే చేస్తే వాటికి తక్షణ శక్తి అందుతుంది.. అవి పునరుత్తేజితమవుతాయి. మొక్కలకు తగినంత సూర్యరశ్మి అందకపోయినా వాటి ఆకులు పాలిపోయినట్లుగా తయారవుతాయి. కాబట్టి వాటిని సూర్యరశ్మి తగిలే చోట ఉంచితే ఫలితం ఉంటుంది. మొక్కల్లో వాడిపోయిన ఆకుల్ని తొలగించడం మంచిది. ఫలితంగా వాటి ప్రభావం ఇతర ఆకులపై, మొక్కపై పడకుండా ఉంటుంది. ఇలా వాడిపోయిన ఆకులు/పువ్వుల్ని తొలగించడం వల్ల కూడా మొక్కల్ని పునరుత్తేజితం చేయచ్చంటు న్నారు నిపుణులు. కుండీ చిన్నగా ఉండి, కొన్ని మొక్కల వేర్లు ఎక్కువగా విస్తరించడం వల్ల వాటికి తగినంత పోషణ అందకపోవచ్చు. ఇలాంట ప్పుడూ మొక్కలు వాడిపోతుంటాయి. కాబట్టి పాత కుండీని తొలగించి.. కాస్త పెద్దగా ఉంటే కొత్త కుండీలో మొక్కను తిరిగి నాటితే ఫలితం ఉంటుంది. వీటిలో ఉండే క్లోరైడ్, ఫ్లోరైడ్ మొక్కల ఆరోగ్యా నికి ప్రతి ఫలంగా మార తాయి. కాబట్టి ప్రత్యేకించి నిల్వ చేసిన వర్షపు నీరు, క్లోరైడ్/ఫ్లోరైడ్ రహిత

యాపిల్ నీళ్లతో శరీరం డీ- హై డ్రేట్ అవదు. శక్తి పెరుగు తుంది. నీరసం, నిస్సత్తువ ఉండదు.

చెలి చిట్కా

# కోడలిలో కూతుర్ని చూడండి!

మా రోజుల్లో కోడళ్లు అత్తలకు భయపడేవారు. ఇప్పుడు కోడళ్లకు అత్తలు భయపడవలసివస్తోంది. నేను అప్పుడు మా అత్తకు భయపడ్డాను. ఆమె వేధింపులు భరించలేక సతమతం అయ్యాను. అయితే మా అమ్మ, నాన్న ఇతర పెద్దల మాట విని సర్దుకుని సంసారం చేశాను. ఉన్న కొద్ది పొలం పనులు చేసుకుంటూ, పశువులను మేపుకుంటూ పాలు అమ్ముకుని బ్రతుకు సాగించాము. ఉన్నదానితో కష్టపడి ఉన్న ఒక కొడుకుని చదివించి ప్రయోజకుడిని చేశాము. మా అబ్బాయి పేరున్న కాలేజీలో ఎం.బి.ఎ చదివి ఒక పెద్ద కంపెనీలో మేనేజరుగా పనిచేస్తున్నాడు. బాగా చదువుకున్న ఒక పేదింటి అమ్మాయిని కోడలుగా తెచ్చుకున్నాము. ఆమె ఒక కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పని చేస్తున్నది.మా అబ్బాయికి నెలకు లక్షా ఇరవైవేలు, కోడలుకు లక్షరూపాయలు జీతం వస్తోంది. ఇద్దరు బెంగుళూరులోనే ఉద్యోగం చేస్తున్నారు. అందరు కలసి ఉందామని భావించి ఊరిలో ఉన్న పొలం అమ్మేసి బెంగుళూరులోనే ఉద్యోగం చేస్తున్నారు. అందరు కలసి ఉందామని భావించి ఊరిలో ఉన్న పొలం అమ్మేసి బెంగుళూరులో స్థలం కొని ఇల్లు కట్టుకున్నాము. మా అబ్బాయికి పెళ్లయి మూడేళ్లు అయింది. ఏడాది క్రితం వారికి ఒక బాబు పుట్టాడు. దానితో మా కోడలు కంపెనీవారి అనుమతి తీసుకుని వర్క్‌ఫ్రం హోం చేస్తోంది. ఇంటిలో ఒక పని కూడా చేయదు. ఏ విషయము పట్టించుకోదు. ఉదయం ఆలస్యంగా నిద్రలేచి స్నానం, టిఫిన్ ముగించుకుని తన గదిలోకి వెళ్లి కంప్యూటర్ ముందు కూర్చుంటుంది. కనీసం బిడ్డకు పాలు కూడా ఇవ్వదు. వాడికి నాన్నమ్మను అయిన నేనే తల్లిపాత్ర పోషిస్తున్నాను. తల్లిపాలు ఇవ్వనందున డబ్బాపాలు పడుతున్నాను. బిడ్డకు పాలు ఇస్తే అందం చెడిపోతుందని ఆపేసింది. అడపాదడపా ఇంటిపనిలో సాయం చేయడం మానేసింది. ఏదైనా సలహా ఇస్తే తిరగబడి సమాధానం చెపుతుంది. ఆమె దృష్టిలో నేను ఒక పనిమనిషిని మాత్రమే. మా అబ్బాయికి కూడా తగిన గౌరవం ఇవ్వదు. వారం క్రితం వారిద్దరి మధ్య మాటామాటా పెరిగింది. మా అబ్బాయి కోపంతో చెంప మీద ఒక దెబ్బ కొట్టాడు. దీనితో ఆమె తిరగబడి తీవ్రంగా హెచ్చరించింది. మొదటిసారి కాబట్టి క్షమిస్తున్నానని, మరొకసారి చేయి చేసుకుంటే కేసుపెట్టి



విడాకులు తీసుకుంటానని భయపెట్టింది. ఈ నేపథ్యంలో ఆమెను దారిలో పెట్టే మార్గం చెప్పండి.

**- ఒక సోదరి, బెంగళూరు**



**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**

వ్యథ

అమ్మా! ఇప్పుడు సమాజంలో ఇలాంటి సమస్యలు తరచూ వినిపిస్తున్నాయి. మీలాగే కోడళ్లు తమ మాట వినడం లేదని చాలామంది అత్తలు ఆరోపణలు చేస్తున్నారు. కొందరు కోడళ్లు అహంకారపూరితంగా ప్రవర్తిస్తుండవచ్చు. అయితే కోడళ్లు అందరూ అలా ఉన్నారనడం నిజం కాదు. ఇప్పటి అత్త ఒకప్పటి కోడలే కదా! ఆ రోజు అత్త ఎలా ఉండాలి. ఎలా ఉండకూడదు అని భావించారో ఇప్పుడు, అలా ప్రవర్తించడానికి ప్రయత్నం చేస్తే సగం సమస్యలు తగ్గిపోతాయి. కోడలు అంటే పనిమనిషి కాదు. ఇంటికి వెలుగు, వంశాన్ని ఉద్ధరించే వ్యక్తి అన్నది గుర్తించాలి. ఇప్పటి కోడళ్లలో ఎక్కువ మంది తీరికలేని ఉద్యోగాలు చేస్తున్నారు. స్నేహసంబంధాలు, కుటుంబ సంబంధాలకు దూరం అవుతున్నారు. కొంతమంది అయితే దాంపత్య సుఖాలు అనుభవించలేని స్థితిలో ఉన్నారు. దీనితో తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురై విసుగు, కోపం, అసహనం ప్రదర్శిస్తున్నారు. కాబట్టి ఆధునిక అత్తలు కోడళ్లపట్ల 'సహానుభూతి'తో ఆలోచించాలి. కోడలిలో కూతురిని చూడాలి. మీ కూతురు అయితే మీరు ఎలా ఆదరిస్తారో అలాగే కోడలిని ఆదరించడం అలవాటు చేసుకోండి. ఒకసారి అందరు కలసి కుటుంబ కౌన్సిలింగ్ తీసుకోండి. సహనం సర్దుబాటు అలవర్చుకోండి.

# పారాయణ ఫలం!

అమరావతి నుండి బనారసీ దంపతులు పొట్ట చేత పట్టుకుని పిల్లలతో లండన్ మహానగరం చేరారు. అక్కడ భారతీయ వాతావరణాన్ని తలపించే భోజన వసతి గృహాన్ని తెరుద్దామని. రోజులు అనుకూలించాయి. భారతీయుల నెందరినో ఆకర్షించింది ఆ వసతిగృహం. అన్నిటి కంటే యజమానురాలయిన ఆజీబాయి అందరినీ ఆపేక్షగా చూచుకునేది. మాతృప్రేమను మరల లండన్‌లో భారతీయులు అనుభవించారు ఆమె సమక్షంలో. ఆమె భర్త మరణించాడు. సవతి కొడుకు ఆమె వద్దకు వచ్చి, ఆ ఇంటిని ఖాళీ చేసి పిల్లలతో సహా వెళ్లిపొమ్మన్నాడు. ఆమె అవాక్కయింది. భయపడింది. గతంలో మహారాష్ట్రకు చెందిన రామచంద్ర తుకారాం కాకడే, ఆయన భార్యతో సహా ఆ వసతి గృహంలో కొంత కాలం ఉన్నారు. ఆ సమయంలో ఆమె ప్రప్రథమంగా సాయిబాబా చిత్రాన్ని చూసింది.



కాకడే చేసే పూజలో ఆమె కూడా పాల్గొనేది. ప్రసాదాలను ఆమె స్వయంగా చేసి ఇచ్చేది. ఆయన చదివే పారాయణ గ్రంథం, సాయి పటం ఇచ్చి పూజా విధానం తెలిపాడు. ఇక ఆమె సాయి భక్తురాలైంది. రోజూ సాయి సచ్చరిత్రను పారాయణం చేసేది. ఇక ఆమెకు తోడు నీడ సాయిబాబాయే అని గ్రహించింది. సాయి మహాసమాధి చెంది 42 సంవత్సరాలు అయింది. లండన్ మహానగరంలో తనకు తన పిల్లలకు నిలువ నీడ లేదని గ్రహించి, ఉన్న అతి కొద్ది ఆస్తిని అమ్మివేసి భారతదేశం వచ్చేద్దామను కున్నది. ఆ రోజు జూలై 7, 1961 సంవత్సరం. ఎవరో ఒక పెద్ద మనిషి వచ్చి 'వసతి గృహ వ్యాపారం చేయాలని ఉన్నదా?' అని ప్రశ్నించాడు. ఆమె ఆశ్చర్యపోయింది. అది తనకు గొంతెమ్మ కోర్కె అని తెలుసుకున్నది. ఆయన తనకు తెలిసిన ఒక వసతి గృహం అమ్మకానికున్నదని, అమ్ముువారు తనకు తెలుసునని, ఇష్టమైతే సులభ వాయిదాల మీద చెల్లించటానికి తాను ఏర్పాటు చేస్తానని చెప్పాడు. ఆమె సరే అన్నది. అతను అన్ని ఏర్పాట్లు చేశాడు. ఆ తరువాత ఎప్పుడూ అతను కనపడలేదు. తిరిగి లండన్ మహానగరంలో నిలదొక్కుకు నేటట్లు చేశాడా మహానుభావుడు. ఆ మహనీయుడు ఎవరో కాదని, సాయిబాబాయే అని ఆమె గట్టి నమ్మకం. ఎవరు కాదన గలరు. ఆమె జీవితాంతం సాయి సచ్చరిత్ర పారాయణం చేసి తరించింది. ప్రతిఫలం ఆశించ కుండా చేసే పారాయణ, పూజలు తప్పక అక్కరకు వస్తాయి. మనం కూడా నిత్యం సాయి సచ్చరిత్ర పారాయణ చేద్దాం!

**- ఎం.పి.సాయినాథ్**

# దాహం తీర్చే చెరకురసం

ఎండా కాలంలో వీధి చివర, బేకరీల్లో, ఫుడ్‌కోర్టుల్లో కనిపించడమే కాక, ఇంటి ముందుకూ వచ్చేస్తాయి చెరకురసం బండ్లు.

అందరూ ఇష్టంగా తాగే చెరకురసంతో తాత్కాలిక శక్తి మాత్రమే లభిస్తుందనుకుంటే పొరబడినట్లే అదనంగా దీని ద్వారా మరెన్నో లాభాలూ ఉన్నాయంటారు. పోషకాహార నిపుణులు. ఈ పానీయంలోని సహజ చెక్కెరలు అలసిన శరీరాన్ని చురుగ్గా మార్చే ఇంధనంలా పనిచేస్తాయి. దీని ద్వారా లభించే విటమిన్‌సితో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇక, ఎ విటమిన్ కణాల వృద్ధికీ కంటిచూపును మెరుగుపర్చేందుకూ తోడ్పడితే, బి కాంప్లెక్స్ విటమిన్లు శరీరం చురుగ్గా పని చేసేలా చూస్తాయి. అదే విధంగా కాల్షియం, మెగ్నీషియం ఇనుము, పొటాషియం వంటి ఖనిజాలు ఎముకలు దంతాల ఆరోగ్యానికీ, కండర వృద్ధికీ దోహదపడతాయి. చెరకు రసంలోని సోడియం శరీరంలో ఫ్లూయిడ్లు సమతూకంలో ఉండేలా చూస్తుంది. ఇందులోని పీచు జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగు పరుస్తుంది. దీని ద్వారా శరీరానికి అందే ఇనుముతో ఎర్ర రక్తకణాల వృద్ధి జరిగి, అలసట, నిస్సత్తువ దూరం అవుతుంది. చల్లగా, తియ్యగా ఉండే చెరకురసం మెదడుకీ సాంత్వన అందించి, ఆందోళననూ తగ్గిస్తుంది. తయారీ దారులు ఇవన్నీ గుర్తించే, ఇప్పుడు అందులోనే బోలెడన్ని రకాలను తీసుకొచ్చేస్తూ.. ఈ పానీయం రుచిని పెంచేస్తున్నారు.



చెరకురసం అనగానే.. బండిమీద అప్పటికప్పుడు తయారు చేసి ఇస్తారు. దాని రుచిలో ఏమాత్రం తేడా ఉండదు. కానీ ప్పుడేమో ఎందులోనైనా రకరకాల ఫ్లేవర్లు. చెరకురసం కూడా నిమ్మ ద్రాక్ష, పుదీనా, అల్లం, పైనాపిల్, స్ట్రాబెర్రీ, మామిడి, యాపిల్.. ఇలా కోరుకున్న రుచుల్లో, ఆయా రంగుల్లో దొరుకుతోంది. ఇవన్నీ కూడా జ్యూస్‌ల మాదిరి, ఎప్పుడు కావాలంటే అప్పుడు తాగేలా వచ్చేస్తూ నోరూరిస్తున్నాయి. బయట నుంచి కాకుండా ఇంట్లోనే చెరకురసం స్వయంగా చేసుకునే తాగాలనుకునేవారి కోసం ఆ ముక్కలు కూడా విడిగా దొరుకుతున్నాయి. అంతేనా సులువుగా నీళ్లలో కలుపుకుని తాగేలా పొడి కూడా అందుబాటులో ఉంది. దీంతో పాటు స్క్వాష్ తరహాలో జ్యూస్ కూడా వచ్చిందిప్పుడు. గ్లాసు చల్లని నీటిలో జ్యూస్‌ను నాలుగైదు టేబుల్ స్పూన్లు కలిపితే అప్పటికప్పుడు కమ్మని చెరకు రసం రెడీఅయినట్లే దీంతో పాప్సికిల్స్, ఐస్‌క్రీమ్, సార్బెట్.. వంటివి చేస్తున్నారు. కాబట్టి.. ఇందులోనూ నచ్చిన రకాలను ట్రై చేయొచ్చు.



కేంద్రమంత్రి జితేంద్రసింగ్, ఇస్రో ఛైర్మన్ నారాయణన్‌లతో అంతరిక్ష శాస్త్రవేత్తలు

## భవిష్యత్ అంతరిక్ష ప్రయోగాలపై ఇస్రో సమావేశాలు

**శ్రీహరికోట (తడ), మే 7 ప్రభాతవార్త** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ త్వరలో చేపట్టనున్న కీలక రాకెట్ల ప్రయోగాలపై ఇస్రో ఛైర్మన్ నారాయణన్, శాస్త్రవేత్తలు కేంద్ర అంతరిక్ష శాఖమంత్రి జితేంద్రసింగ్‌తో సమావేశమయ్యారు. భవిష్యత్‌లో జరిగే మానవ సహిత అంతరిక్ష ప్రయోగం గగన్‌యాన్ మీద మళ్లీ దృష్టి కేంద్రీకరించారు. భారత వ్యోమగాముల సహకారం, ప్రపంచ అంతరిక్ష పరిశోధనలో భారత్‌కు పెరుగుతున్న పాత్ర, ప్రధాని నరేంద్రమోడీ దార్శనికత గురించి ఈ సమావేశంలో త్వరలో శ్రీహరికోట నుంచి చేపట్టనున్న వివిధ రాకెట్ల ప్రయోగాల గురించి కూడా మాట్లాడారు. ఇస్రో ఉపగ్రహాల వలన దేశ రక్షణకు ఏ మాత్రం ఉపయోగపడతాయన్న దాని మీద చర్చించారు. అంతరిక్ష పరిశోధనలో భారతదేశాన్ని భాగస్వామిగా నిలబెట్టడం కోసం బుధవారం నుంచి మూడురోజులు పాటు అంతర్జాతీయ ఆస్ట్రోనాటికల్ ఫెడరేషన్‌తో పాటు గ్లోబల్ స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు ఇస్రో పెద్దలు పేర్కొన్నారు. గత డిసెంబర్‌లో పిఎస్‌ఎల్‌వి రాకెట్ ద్వారా రెండు స్పేడెక్స్ ఉపగ్రహాలను ప్రయోగించి విజయవంతమైన తర్వాత మళ్లీ స్పేడెక్స్-2ని ఇస్రో ప్రారంభిస్తుందని చెప్పారు. గగన్‌యాన్ ప్రాజెక్టు గురించి వివరిస్తూ 2027 మొదట్లో ఈ ప్రయోగం ఉంటుందని, 400 కిలోమీటర్ల దూరంలోని ఎర్త్ ఆర్బిట్‌లోకి వ్యోమగాములను తీసుకెళ్లి సురక్షితంగా వెనక్కి తీసుకొచ్చే బృహత్తర కార్యక్రమంగా చెప్పారు. ఈ కార్యక్రమం పదేపదే వాయిదా పడుతోంది. అయితే ఇప్పటికి 90 శాతం పనులు పూర్తయ్యాయని, ఎప్పటికప్పుడు సాంకేతికతను అభివృద్ధి చేసుకుంటూ గగన్‌యాన్‌కు సిద్ధపడుతున్నట్లు ఇస్రో వర్గాలు వెల్లడించాయి.

## చర్లపల్లి-బరంపురం మధ్య వేసవి ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే,మే 7,ప్రభాతవార్త** తెలుగు రాష్ట్రాల నుంచి ఒరిస్సాలోని బరంపురం మధ్య వేసవి ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. చర్లపల్లి నుంచి బరంపురం వెళ్లే నెంబర్ 07027ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 9నుంచి జూన్ 27వరకు ప్రతి శుక్రవారం రాత్రి 8.15గంటలకు చర్లపల్లి నుంచి బయలుదేరి, శనివారం మధ్యాహ్నం 2.15గంటలకు బరంపురం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బరంపురం నుంచి చర్లపల్లి వెళ్లే నెంబర్ 07028ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 10నుంచి జూన్ 28వరకు ప్రతి శనివారం సాయంత్రం 4.45గంటలకు బరంపురం నుంచి బయలుదేరి ఆదివారం ఉదయం 11-35గంటలకు చర్లపల్లి చేరుకుంటుంది. మార్గమధ్యలో ఈ రైళ్లు తెలుగు రాష్ట్రాల్లో నల్గొండ, మిర్యాలగూడ, నత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, శ్రీకాకుళం, నౌపాడ, పలస, సోంపేట, ఇచ్ఛాపురం స్టేషన్‌లలో నిలుస్తాయి.

# 'యుద్ధం వస్తే ఇలా చేయాలి'

- విజయవంతంగా ఆపరేషన్ అభ్యాస్
- సివిల్ డిఫెన్స్ సామాజిక బాధ్యతలను నిర్వహించింది
- డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా



రైల్వేలో నిర్వహించిన మాక్ డ్రిల్

**గుంతకల్లు రైల్వే,మే 7,ప్రభాతవార్త**

పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత్-పాక్‌ల మధ్య ఏర్పడిన ఉద్రిక్తతల నేపథ్యంలో కేంద్రప్రభుత్వం ఆదేశాల మేరకు తెలుగు రాష్ట్రాలలోని దక్షిణ మధ్య రైల్వే, తూర్పు తీర రైల్వే జోన్‌లలో యుద్ధం వస్తే సామాన్య ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలపై సివిల్ డిఫెన్స్ సామాజిక బాధ్యతలతో ఆపరేషన్ అభ్యాస్ పేరుతో ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేసే క్రమం మాక్ డ్రిల్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించింది. సమాజంలో ప్రకృతి వైపరీత్యాలు, పౌర విపత్తులు సంభవించిన సమయంలో పౌరుల ప్రాణాలను రక్షించడం సామాజిక బాధ్యత అని గుంతకల్లు డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, అదనపు డిఆర్ఎం సుధాకర్, సీనియర్ డిఇటిఆర్‌డి సుదర్శన్‌రెడ్డిలు తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లోని దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్, గుంతకల్లు, నాందేడ్, తూర్పు తీర రైల్వే జోన్ పరిధిలోని విశాఖపట్నం రైల్వే స్టేషన్ ప్రాంగణాలలో సివిల్ డిఫెన్స్‌కు చెందిన వందలాది మంది వాలింటర్లు ఆయా రైల్వే స్టేషన్ ప్రాంగణాల ఎదుట నిర్ణీత సమయంలో మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైమానిక దాడులు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆపరేషన్ అభ్యాస్ పేరుతో 12సివిల్ డిఫెన్స్ అధికారులు యుద్ధం వస్తే వ్యవహరించవలసిన విధి విధానాలపై దిశానిర్దేశం చేశారు. యుద్ధసైరన్ మ్రోగగానే ప్రజలు బహిరంగ ప్రదేశాల నుంచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని, ప్రభుత్వ సమాచారం నిమిత్తం టివీ, రేడియో యాప్‌లను ఎప్పటికప్పుడు వినియోగించుకోవాలని ఇళ్లలో ఉన్నవారు ఎలక్ట్రానిక్ పరికరాలు, లైట్లు, గ్యాస్ స్టవ్‌లను ఆఫ్ చేసి ఉంచాలని యుద్ధం తరహా అత్యవసర పరిస్థితులను సృష్టించి పోలీసులు, పారా మిలటరీ బలగాల పనితీరును మాక్ డ్రిల్‌లో పరిశీలించి తగు జాగ్రత్తలు, అవగాహన కల్పించారు. యుద్ధం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సివిల్ డిఫెన్స్ వాలింటర్లు ప్రదర్శించిన ప్రదర్శనలు, కార్యక్రమాలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

కార్యక్రమంలో సివిల్ డిఫెన్స్ జోనల్ కంట్రోలర్ ఉదయనాథ్ కోట్ల, స్థానిక ఎమర్జెన్సీ అధికారి సుదర్శన్‌రెడ్డి, సీనియర్ సివిల్ డిఫెన్స్ ఇన్‌స్పెక్టర్‌లు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయా రైల్వే స్టేషన్‌ల మేనేజర్‌లు అధిక సంఖ్యలో వివిధ విభాగాల సిబ్బంది, విద్యార్థులు, స్కౌట్స్ గైడ్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎపి ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ పాలసీ మార్గదర్శకాలు జారీ

**విజయవాడ,మే7,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ పాలసీ 4.0,2024-29 మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. 4.2 లక్షల కోట్ల ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి ఉద్దేశంగా ఏపీలో ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ పాలసీ రూపకల్పన చేశారు. ఈ రంగంలో 10 బిలియన్ యూఎస్ డాలర్ల విలువైన పెట్టుబడులు ఆకర్షించాలని నిర్ణయించారు.దీని వలన పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలువిశాఖ, తిరుపతి , నెల్లూరు, కడప, అనంతపురంలలో ఎలక్ట్రానిక్ మాన్యు ఫ్యాక్చరింగ్ క్లస్టర్స్ ఉత్పత్తికి అనువుగా ఉన్నట్టు అధికారులు స్పష్టం చేశారు.నైపుణ్యమున్న మానవ వనరులు, అనుకూలమైన ప్రభుత్వ విధానాలు ఈ రంగంలో పెట్టుబడులకు అనుకూలమని వెల్లడించారు. ఏపీలోని లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌తో పాటు విశాఖ చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో ఎలక్ట్రానిక్స్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు అనువుగా ఉన్నట్టు తెలిపారు. ఈ రంగంలో వచ్చే పెట్టుబడులు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను ఆకర్షించనున్నట్టు ప్రభుత్వం తెలిపింది. కేటగిరీల వారీగా ఈ రంగంలో పెట్టుబడుల ఆధారంగా ప్రోత్సాహకాలు ప్రకటిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. అన్ని కేటగిరీల ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లకు వంద శాతం స్టాంపు డ్యూటీ మినహాయింపు ఇచ్చారు. కల్పించిన ఉద్యోగాల ఆధారంగా ఒక్కో ఉద్యోగికి నెలకు 4 వేల నుంచి 6 వేల వరకూ ఐదేళ్ల పాటు ప్రోత్సాహకం ఇవ్వనున్నారు. అన్ని కేటగిరీల్లోని ఎలక్ట్రానిక్ పరిశ్రమలకు ఐదేళ్ల పాటు యూనిట్ విద్యుత్‌ను రూ.1కే సరఫరా చేయాలని నిర్ణయించారు. కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రిత్వ శాఖ మంజూరు చేసిన ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్‌ను కడప జిల్లా కొప్పర్తిలో ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వైఎస్ఆర్ ఈఎంసీగా దీన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం 380.5 కోట్ల రూపాయలను బుధవారం మంజూరు చేసింది. ఈ క్లస్టర్ ఏర్పాటు కోసం కేంద్ర ఐటీ శాఖ ఇప్పటికే అనుమతులు మంజూరు చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ క్లస్టర్ ను ఏర్పాటు చేయనున్నాయి. అలాగే కొప్పర్తిలోని ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్‌కు పెట్టుబడులు ఆహ్వానించేలా ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. గ్రీన్ కేటగిరీలోని ఎలక్ట్రానిక్ పరిశ్రమలకు తనిఖీలు ఉండవని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆరెంజ్, రెడ్ కేటగిరీకి ఇది వర్తించదని పరిశ్రమల శాఖ వెల్లడించింది. భూమి లీజును 33 ఏళ్ల నుంచి 99 ఏళ్లకు పొడిగించుకునే అవకాశం కల్పించటంతో పాటు అవసరమైతే భూమిని కొనుగోలు చేసేందుకూ వీలుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. మరోవైపు వంద శాతం స్టాంపు డ్యూటీ రీయింబర్స్‌మెంట్ కల్పించాలని నిర్ణయించినట్టు ప్రభుత్వం తెలిపింది. 20 శాతం మేర పెట్టుబడి రాయితీ కూడా ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లో ఉంటుందని స్పష్టం చేసింది. 250 కోట్లకు మించి పెట్టుబడులు పెట్టే మొబైల్ ఉత్పత్తి పరిశ్రమలకు మెగా స్టేటస్ ఇస్తామన్నారు.

## ఉగ్రవాదులకు తగిన గుణపాఠం ఆపరేషన్ సిందూర

### మంత్రి నారా లోకేశ్

**విజయవాడ,మే7,ప్రభాతవార్తప్రతినిధి:** ఆపరేషన్ సిందూర పేరిట నిర్వహించిన పాకిస్తాన్ ఉగ్రవాద మూకలపై జరిగిన దాడులపై ఏపీ మంత్రి నారా లోకేశ్ స్పందించారు.పాకిస్థాన్ అండ చూసుకుని చెలరేగిపోతున్న ఉగ్రమూకలను మట్టుబెట్టడమే లక్ష్యంగా మట్టుబెట్టింది. భారత సైన్యం తొలి అడుగేసింది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా అర్ధరాత్రి వేళ దాయాది దేశంలోని 9 ఉగ్రస్థావరాలపై క్షిపణులతో విరుచుకుపడింది. ఉగ్రవాదుల స్థావరాలను నేలమట్టం చేయడాన్ని హర్షిస్తూ ఎక్స్ వేదికగా 54 సెకన్ల వీడియోను ఆయన పోస్ట్ చేశారు.100 పాకిస్థాన్‌లకు సమాధానం చెప్పే మిసైల్.. ఏప్రధాఆన మంత్రి నారా లోకేష్ అన్నారు., అమరావతి పునఃప్రారంభోత్సవం సందర్భంగా తన ప్రసంగంలోని కొన్ని మాటలు, నరేంద్ర మోదీ ప్రసంగం, భారత సైన్యం ఉగ్రవాదులపై చేసిన దాడులకు సంబంధించిన దృశ్యాలతో కూడిన 54 సెకన్ల నిడివి గల ఓ వీడియోను ఎక్స్ లో షేర్ చేశారు.

## విజయవాడ విద్యుత్ సౌధ వద్ద సిపిఎం ధర్నా

**విజయవాడ,మే7,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యుత్ సర్దుబాటు ఛార్జీల భారాలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని, ఆదాని, సెకీ, యాక్సిస్ ఒప్పందాలు రద్దు చేయాలని విజయవాడ గుణదల విద్యుత్ సౌధ వద్ద సీపీఎం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్. బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ పాల్గొన్నారు. అదానీ సెకీ ఒప్పందాలు రద్దు చేయాలని అదానీ ఫోటో ఫ్లెక్సీ దగ్ధం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, సిపిఎం నేతలు, కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. కార్యకర్తలను, నేతలను అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించడంతో కార్యకర్తలు ప్రతిఘటించారు. పెంచిన విద్యుత్ భారాలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని నినాదాలు చేశారు. విద్యుత్ సౌధ గేటు వద్ద బయటాయించి అవినీతి ఒప్పందాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో కే శ్రీదేవి ,బోయి సత్యబాబు, బి. రమణ, పి. కృష్ణ, నగర నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



విజయవాడ విద్యుత్తు సౌధ వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

# టెన్షన్‌గా ప్లే ఆఫ్ రేస్

## మారుతున్న సమీకరణాలు

## ఆ నాలుగు జట్లకే అవకాశాలు

## పాయింట్ల పట్టికలో అనూహ్య పరిణామాలు



**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్ 18 లీగ్ మ్యాచ్‌లు ముగింపు దశకు చేరుకున్నాయి. ఈ మెగా క్రికెట్ టోర్నీలో ఇప్పటికే 57 మ్యాచ్ లు పూర్తయ్యాయి. లీగ్ దశలో ఇంకా 14 మ్యాచ్‌లు మాత్రమే మిగిలి ఉన్నాయి. మరోవైపు ప్లే ఆఫ్ రేస్ జట్లులో టెన్షన్ పుట్టిస్తున్నాయి. ప్లే ఆఫ్ రేస్‌కు చేరుకునేందుకు టీములు పట్టుదలతో సతాత చూపిస్తుండటంతో ఐపీఎల్ లీగ్ దశ మ్యాచ్‌లు ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో 56 మ్యాచ్‌ల తర్వాత, గుజరాత్ టైటాన్స్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రెండవ స్థానంలో ఉండగా, పంజాబ్‌కింగ్స్, ముంబై ఇండియన్స్ వరుసగా3,4 స్థానాల్లో ఉన్నాయి. మిగిలిన మూడు జట్లు, లక్నో సూపర్ జెయింట్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ కూడా ప్లే ఆఫ్ రేసులో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో క్రికెట్ దిగ్గజాలు ప్లే ఆఫ్ రేస్‌లో ఏ ఏ జట్లు చేరుకునేఅవకాశాలు ఉన్నాయనేదానిపై తర్జన భర్జనలు పడుతున్నారు. ఈ ఏడు జట్లలో ఈసారి ప్లేఆఫ్స్‌లో ఆడే 4 జట్లను అంచనా వేస్తున్నారు. ఈ అంచనాల ప్రకారం ఈసారి గుజరాత్ టైటాన్స్ ప్లే ఆఫ్‌కు చేరుకోవడం ఖాయం. మంచి ప్రదర్శన ఇస్తున్న శుభ్‌మాన్ గిల్ జట్టు మిగతా అన్ని జట్లను అధిగమించి ప్లే ఆఫ్స్‌కు చేరుకుంటుందని లెక్కలుకడుతున్నారు. అదేవిధంగా, అక్షర్ పటేల్ నేతృత్వంలోని ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు కూడాతదుపరిస్థాయికి చేరుకుంటుందని అభిప్రాయపడుతు న్నారు. ఇదే సమయంలో ఈసారి ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు బాగారాణించింది. అందువల్ల లీగ్ దశ ముగిసే సమయానికి ప్లే ఆఫ్స్‌కు కూడా చేరుకుంటుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇక శ్రేయాస్ అయ్యర్ నాయకత్వంలోని పంజాబ్ కింగ్స్ జట్టు మంచి ప్రదర్శన చేస్తోంది. అందువల్ల, ఈసారి పంజాబ్‌ను ప్లే ఆఫ్ రౌండ్‌లో కూడా చూడవచ్చని స్పష్టం చేస్తున్నారు. అదేవిధంగా ముంబై ఇండియన్స్ కూడా నాల్గవ జట్టుగా ప్లే ఆఫ్ రౌండ్‌లో కనిపిస్తుంది. హార్దిక్ పాండ్యా నేతృత్వంలోని ముంబై ఇండియన్స్ జట్టు వరుసగా 6 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. అందువల్ల, మిగిలిన మ్యాచ్‌లలో మంచి ప్రదర్శనతో ముంబై ప్లే ఆఫ్స్‌కు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. అయితే పాయింట్ల ఇంత వరకూ టాప్‌లో ఉన్న రాయల్ ఛాలెంజర్స్ పరిస్థితి పట్టికలో రెండో స్థానంలోకి దిగజారింది. మిగిలిన జట్లు పట్టుదలను ప్రదర్శించి పాయింట్ల పట్టికలో పై పైకి చేరుకుంటుండటంతో రాయల్ ఛాలెజర్స్ ప్లే ఆఫ్ రేస్‌లో ఎంత వరకూ నిలబడగలుగుతుందనేదానిపై తర్జన భర్జనలు జరుగుతున్నాయి.

# మహిళల ట్రై సిరీస్ ఫైనల్‌కు భారత్

## దక్షిణాఫ్రికాపై 23 పరుగుల తేడాతో గెలుపు?



**న్యూఢిల్లీ:** వన్డే ట్రై సిరీస్లో భారత మహిళల జట్టు ఫైనల్ కు దూసుకెళ్లింది. ఈ సిరీస్‌లో మూడో విజయాన్ని అందుకొని ఫైనల్ బెర్త్ కన్ఫర్మ్ చేసుకుంది. శ్రీలంక వేదికగా బుధవారం దక్షిణాఫ్రికా మహిళలతో హోరాహోరీగా సాగిన మ్యాచ్ లో 23 పరుగుల తేడాతో విజయాన్ని అందుకుంది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన భారత్ జెమీమా రోడ్రిగ్స్ (101 బంతుల్లో 123 పరుగులు, 15 ఫోర్లు, సిక్సర్) మెరుపు సెంచరీకి తోడు బౌలర్లు సమిష్టిగా రాణించడంతో అలవోకంగా గెలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 337 పరుగుల భారీ స్కోర్ చేసింది. లక్ష్య ఛేదనలో సౌతాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 314 పరుగులకు పరిమితమైంది. 338 పరుగుల లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన సౌతాఫ్రికాకు ఆదిలోనే ఎదురు దెబ్బ తగిలింది. లారా గూడాల్ ను 4 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద అమన్ జ్యోత్ కౌర్ ఔట్ చేసింది. ఈ దశలో బ్రిట్స్, స్మిత్ రెండో వికెట్ కు 63 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. ఇండియా విజయం ఖాయమన్న దశలో సఫారీ కెప్టెన్ చార్లీ ట్రయాన్ మెరుపులు మెరిపించి కౌర్ సేనను భయపెట్టింది. 43 బంతుల్లోనే 67 పరుగులు చేసి మ్యాచ్ చివరి వరకు పోరాడింది. అయితే కొట్టాల్సిన లక్ష్యం ఎక్కువగా ఉండడంతో విజయానికి 23 పరుగుల దూరంలో ఆగిపోయింది. అంతకు ముందు మొదట బ్యాటింగ్ చేసిన భారత మహిళలు 337 పరుగుల భారీ స్కోర్ చేశారు. ప్రారంభంలోనే రెండు వికెట్లు కోల్పోయినా స్మృతి మందాన, హర్మన్ ప్రీత్ కౌర్ దూకుడుగా బ్యాటింగ్ చేశారు. స్మృతి హాఫ్ సెంచరీ ఔటైన తర్వాత రోడ్రిగ్స్, దీప్తి శర్మ (93) సౌతాఫ్రికా బౌలర్లను దంచి కొట్టారు. దీప్తి 7 పరుగులతో సెంచరీని కోల్పోయింది. ఐదో వికెట్ కు 122 పరుగులు జోడించి జట్టు స్కోర్ ను 337 పరుగులకు చేర్చించారు.

# ఖేలో ఇండియాలో.. మెరిసిన తెలంగాణ

## ఈతలో 3 బంగారు పతకాలు



న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2025 స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ ఈతగాళ్ళు అద్భుతమైన ముద్ర వేశారు. వివిధ విభాగాలలో మూడు బంగారు పతకాలను సాధించారు. పోటీల రెండో రోజున తెలంగాణకు స్విమ్మింగ్‌లో మూడు స్వర్ణాలు సహా సైక్లింగ్‌లో కాంస్యం దక్కింది. బీహార్‌లోని గయా వేదికగా జరుగుతున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో తెలంగాణ ప్లేయర్లు తమ సత్తా చాటి పసిడి పతకాలతో అదరగొట్టారు. పురుషుల 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లె ఈవెంట్‌లో రాష్ట్ర యువ స్విమ్మర్ వర్షిత్ ధూళిపూడి 4:38:39 సెకన్ల టైమింగ్‌తో స్వర్ణం కైవసం చేసుకున్నాడు. పురుషుల 100మీటర్ల బ్యాక్ స్ట్రోక్ ఈవెంట్‌లో మైలారి సుహాస్ ప్రీతమ్ 58.73 సెకన్ల టైమింగ్‌తో పసిడి దక్కించుకున్నాడు. ఇక మహిళల 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో సాగి శ్రీనిత్య 1:06:36 సెకన్ల టైమింగ్‌తో స్వర్ణం ఖాతాలో వేసుకుంది. 1కిలోమీటర్ ట్రాక్ సైక్లింగ్ ఈవెంట్‌లో సాయిచరణ్ యాదవ్ (1:09:56సెకన్ల టైమింగ్) మూడో స్థానంతో కాంస్యం కైవసం చేసుకున్నాడు. మొత్తంగా నాలుగు పతకాలతో తెలంగాణ ప్రస్తుతం నాలుగో స్థానంలో కొనసాగుతున్నది. ఇక రాజస్థాన్‌కు చెందిన మయాంక్ చౌదరి తన రెండవ బంగారు పతకాన్ని సాధించాడు. బాలుర 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో టైటిల్‌ను గెలుచుకున్నాడు. అంతకు ముందు రోజు అగ్రస్థానంలో నిలిచిన రాజస్థాన్ మిక్స్‌డ్ జట్టులో అతను కూడా ఉన్నాడు. మయాంక్ 239.2 పాయింట్లు సాధించి చండీగఢ్‌కు చెందిన ధైర్య ప్రసార్ (235.3) కంటే సులభంగా గెలిచాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన యుగ్ ప్రతాప్ సింగ్ రాథోడ్ 214.8 స్కోరుతో కాంస్యం గెలుచుకున్నాడు. కాగా బాలికల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్ల ఈవెంట్‌లో మహారాష్ట్రకు చెందిన ప్రాచి గైక్వాడ్ కర్ణాటకకు చెందిన తిలోత్తమ సేన్‌ను ఓడించింది. తన రెండవ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో పాల్గొన్న ప్రాచి, మునుపటి ఎడిషన్‌లో తాను కాంస్యం గెలిచిన స్థానాన్ని మెరుగుపరుచుకుంది. తిలోత్తమ 455.6 పాయింట్లతో పోలిస్తే మహారాష్ట్ర అమ్మాయి 458.4 పాయింట్లు సాధించింది.

## బిడబ్ల్యుఎఫ్ ర్యాంకింగ్స్‌లో..

# సింధుకు 16వ స్థానం

### 10వ స్థానంలో నిలిచిన ట్రీసా-గాయత్రి

### పడిపోయిన లక్ష్యసేన్, సాత్విక్-చిరాగ్ జోడీ



**న్యూఢిల్లీ:** బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ (బిడబ్ల్యుఎఫ్) ర్యాంకింగ్స్‌లో భారత్ జోడీ సాత్విక్-చిరాగ్ 18వ స్థానానికి పడిపోయింది. అదే సమయంలో పివి సింధు 16వ స్థానానికి ఎగబాకింది. మహిళల డబుల్స్‌లో ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ స్విస్ ఓపెన్ తర్వాత ఆటకు దూరంగా ఉన్నప్పటికీ 10వ స్థానంలో నిలిచారు. గాయాల కారణంగా ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్ తర్వాత ఆటకు దూరంగా ఉన్న సాత్విక్-సాయిరాజ్ రాంకిరెడ్డి మరియు చిరాగ్ శెట్టి తాజాగా విడుదల చేసిన బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ ర్యాంకింగ్స్‌లో పెద్ద దెబ్బ తిన్నారు. పురుషుల డబుల్స్ ర్యాంకింగ్స్‌లో మాజీ ప్రపంచ నంబర్ 1 సాత్విక్ చిరాగ్ 11వ స్థానం నుండి 18వ స్థానానికి పడిపోయాడు. ఇటీవల జరిగిన సుదిర్మాన్ కప్‌లో భారతదేశం తరపున నాకౌట్ దశకు చేరుకోలేకపోయిన ఏకైక పురుషుల జంట హరిహరన్ అంసకరుణన్ మరియు రూబన్ కుమార్ రెతినసబాపతి 41వ స్థానానికి చేరుకున్నారు. ఇక మహిళల సింగిల్స్‌లో, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత, మాజీ ప్రపంచ ఛాంపియన్ పివి సింధు 18వ స్థానం నుండి 16వ స్థానానికి ఎగబాకింది. 29 ఏళ్ల సింధు సుదిర్మాన్ కప్‌లో తన రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. మరోపక్క ఫామ్‌ను కనుగొనడంలో ఇబ్బంది పడుతోంది. ఇక ఇతర భారత్ క్రీడాకారులు మాల్వికా బన్సోద్ (23వ స్థానం), రక్షి త శ్రీ (41వ స్థానం), అనుపమ ఉపాధ్యాయ (42వ స్థానం) మరియు ఆకర్షి కశ్యప్ (47వ స్థానం) టాప్ 50లో ఉన్నారు. కాగా మహిళల డబుల్స్‌లో, ట్రీసా జాలీ మరియు గాయత్రి గోపీచంద్ స్విస్ ఓపెన్ తర్వాత ఆటకు దూరంగా ఉన్నప్పటికీ 10వ స్థానంలో నిలిచారు. పురుషుల సింగిల్స్‌లో, కామన్వెల్త్ గేమ్స్ స్వర్ణ పతక విజేత లక్ష్య సేన్ 18వ స్థానం నుండి 19వ స్థానానికి పడిపోయాడు, ఆసియా క్రీడల కాంస్య పతక విజేత హెచ్‌ఎస్ ప్రణయ్ 30వ స్థానం నుండి 35వ స్థానానికి పడిపోయాడు. ప్రియషు రాజవత్ 36వ స్థానం నుండి 33వ స్థానానికి ఎగబాకాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత అగ్రశ్రేణి జోడీ ధ్రువ్ కపిల, తనీషా క్రాస్టో 18వ స్థానం నుంచి 19వ స్థానానికి పడిపోయారు.

# చెస్ ఛాంపియన్‌షిప్ బరిలో గ్రాండ్ మాస్టర్ నిహాల్



**న్యూఢిల్లీ:** యుఎఇలోని అల్ ఐన్‌లో జరిగే ఆసియా కాంటినెంటల్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ నిహాల్ సరిన్ ఫేవరెట్‌గా బరిలోకి దిగనున్నాడు. తొమ్మిది రౌండ్ల ఈవెంట్‌లో టాప్ సీడ్ అయిన ఫామ్‌లో ఉన్న సరిన్, ఈ ఏడాది అక్టోబర్‌లో న్యూఢిల్లీలో జరగనున్న తదుపరి ప్రపంచ చెస్ కప్‌లో బెర్తుతో పాటు, అగ్ర బహుమతి కోసం పోటీపడతాడు. తదుపరి ప్రపంచ చెస్ కప్ కోసం టాప్ 10 స్థానాలు రిజర్వ్ చేయబడిన ఈ ఆసియా ఛాంపియన్‌షిప్‌లో 18 మంది భారత గ్రాండ్‌మాస్టర్లు పాల్గొంటారు. ఇటీవలే తాష్కెంట్ ఓపెన్ గెలిచిన సరిన్, ఇప్పుడు భారతదేశం నుండి తదుపరి 2700 ఇఎల్ఒ రేటింగ్ ప్లేయర్‌గా అవతరించడానికి సమీపానికి చేరుకున్నాడు. అతడు ప్రతిష్టాత్మక మార్కుకు కేవలం ఏడు పాయింట్లు దూరంలో ఉన్నాడు. ఇరాన్‌కు చెందిన అమీన్ తబతాబాయి, ఉజ్బెకిస్తాన్‌కు చెందిన నోడిర్‌బెక్ యాకుబ్బోవ్ వంటి అనేక మంది ఆసియా దిగ్గజాలు ఉండటంతో ఈ ప్రయాణం ఆటుపోట్లుగా ఉడే అవకాశాలు ఉన్నాయి. ఇక భారత్‌కు చెందిన మరో నాల్గవ సీడ్ మురళీ కార్తికేయన్, లియోన్ ల్యూక్ మెండోంకా, ప్రస్తుత ప్రపంచ జూనియర్ ఛాంపియన్ వి. ప్రణవ్ పోడియం ఫినిషింగ్ కోసం ఇతర ప్రధాన పోటీదారులుగా ఉండే అవకాశం ఉంది.

# వాణిజ్యం

# 18 ఎయిర్‌పోర్టులు మూసివేత



**ముంబై, మే 7:** పహల్‌గామ్ ఉగ్ర దాడికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత పాక్ ఉగ్ర స్థావరాలపై భారత ఆర్మీ విరుచుకుపడింది. పాకిస్థాన్‌లోని తొమ్మిది స్థావరాలపై మెరుపు దాడులు చేసింది భారత సైన్యం. అయితే అంతర్జాతీయ సరిహద్దుకు దగ్గర్లోని ఉగ్రవాదుల స్థావరాలను మాత్రమే భారత్ టార్గెట్ చేసింది. అంతర్జాతీయ సరిహద్దుకు 100కి.మీ దూరంలోని బహవల్‌పూర్‌లో ఉన్న జైష్ ఏ మొహమ్మద్ ప్రధాన కార్యాలయం మురిడ్కే, సాంబా ఎదురుగా సరిహద్దుకు 30 కి.మీ దూరంలో ఉన్న లష్కరే క్యాంప్‌పై దాడి చేసింది. అయితే ఆపరేషన్ సిందూర్‌లో 80 మందికి పైగా ఉగ్రవాదులు హతమైనట్లు తెలుస్తోంది. అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఆపరేషన్ సింధూర్ కింద భారతదేశం పాకిస్తాన్‌లోని జైష్ఎ మొహమ్మద్, లష్కరేఎతోయిబా ప్రధాన కార్యాలయాలను లక్ష్యంగా చేసు కుంది. ఆపరేషన్ సింధూర్‌తో అప్రమత్తమైన పాక్ సరి హద్దుల్లో కాల్పులకు పాల్పడింది. దీంతో అప్రమత్తమైన భారత ప్రభుత్వం జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్ ఎయిర్‌పోర్టును తాత్కాలికంగా మూసివేసింది. కేవలం శ్రీనగర్ మాత్రమే కాదు..సరిహద్దులకు సమీపంలో ఉన్న జమ్మూ, అమృత్సర్, లేహ్, చండీగఢ్, ధర్మశాల ఎయిర్‌పోర్టులను కూడా తాత్కాలికంగా మూసివేశారు. ఈ విమానాశ్రయాల ద్వారా వెళ్లే విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. పాకిస్తాన్‌పై భారతదేశం వైమానిక దాడి చేసిన నేపథ్యంలో ఎయిర్ ఇండియా తన ప్రయాణీకులకు ఒక హెచ్చరిక జారీ చేసింది. పాకిస్తాన్ పిఓకె లోని ఉగ్రవాద శిబిరాలపై భారత సైన్యం దాడుల తర్వాత ఎయిర్ ఇండియా, ఇండిగో ఎయిర్‌లైన్స్, స్పైస్ జెట్ ప్రయాణీకులకు ముఖ్య ప్రకటన చేశాయి.. సోషల్ మీడియాలో పోస్ట్ ద్వారా ఎయిర్‌లైన్స్ ప్రయాణీకులు విమానాశ్రయానికి చేరుకోవటానికి ముందుగానే ఈ ప్రకటన గమనించాలని అభ్యర్థించింది. ఈ మేరకు బికనీర్, శ్రీనగర్, జమ్మూ, అమృత్సర్,లేహ్, చండీగఢ్, ధర్మశాల సహా అనేక నగరాలకు విమానాలు రద్దుచేసినట్టుగా సోషల్ మీడియా పోస్ట్ ద్వారా ప్రకటించారు.

# వివాదంలో యూనియన్ బ్యాంకు

**ముంబై, మే 7:** ప్రభుత్వ రంగ యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా వివాదంలో చిక్కుకుంది. మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు కెవి సుబ్రమణియన్ రాసిన పుస్తకాన్ని 2,00,000 కాపీలను కొనుగోలు చేసేందుకు సుమారు రూ.7.25 కోట్లు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఒక కథనం పేర్కొంది. వారం రోజుల క్రితమే భారత ప్రభుత్వం అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సుబ్రమణియన్‌ను అర్థాంతరంగా తొలగించిన విషయం విదితమే. అందుకు ప్రభుత్వం కారణాలను కూడా వివరించలేదు. సుబ్రమణియన్ పదవీకాలం ముగిసేందుకు ఇంకా ఆరు నెలలు ఉండగానే ఈ నిర్ణయం తీసుకుంది. ఇలాంటి సమయంలో యూనియన్ బ్యాంకు సుబ్రమణియన్ రాసిన పుస్తకం కొనుగోలు వ్యవహారం వివాదంగా మారింది. గతేడాది ఆగస్టులో కెవి సుబ్రమణియన్ 'ఇండియా@100' పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ పుస్తకాన్ని కస్టమర్లు, స్థానిక పాఠశాలలు, కాలేజీలు, లైబ్రరీలకు పంపిణీ చేసేందుకు కొనుగోలుచేసింది.దీనికోసం 1,89,450 పేపర్‌బ్యాక్ కాపీలను రూ.350 ధరతో, 10,422 హార్డ్‌కవర్ కాపీలను రూ.597తో ఆర్డర్ చేసింది. దీని కోసం రూ.7.25 కోట్లు ఖర్చు చేసింది. అయితే ఏ ఎంగ్లీష్ పుస్తకమైనా 10వేల కాపీలు అమ్ముడు పోవడం అరుదు.

Union Bank of India

కానీ యూనియన్ బ్యాంకు ఏకంగా 2 లక్షల కాపీలను కొనడం, ఈ పుస్తకం విడుదలకు ముందే ప్రచురించిన రూపా పబ్లికేషన్స్‌కు 50శాతం మొత్తం బ్యాంకు చెల్లించడం వివాదంగా మారింది. యూనియన్ బ్యాంకుకు చెందిన 18 జోనల్ ఆఫీసుల నుంచి 10వేల చొప్పున కాపీలు ఆర్డర్ చేయడం అనేక సందేహాలను రేకెత్తిస్తోంది.


# ఇంట్రాడేలో సెన్సెక్స్, నిఫ్టీలు పైపైకి

**ముంబై, మే 7:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఓ వైపు పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై ఆపరేషన్ సిందూర్ పేరిట నిర్వహించిన దాడులు మన మార్కెట్లపై పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. భారత్ కేవలం ఉగ్ర స్థావరాలనే లక్ష్యంగా చేసుకోవడంతో పాటు ఇప్పుడున్న ఆర్థిక పరిస్థితుల్లో పాక్ ఈ సమస్యను మరింత జఠిలం చేయకపోవచ్చన్న అంచనాలు ఇందుకు తోడయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు, డాలర్ బలహీనడడం అమెరికా, చైనాలో వృద్ధి నెమ్మదించడం, క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడం వంటివి మన మార్కెట్లకు పాజిటివ్ అంశాలుగా మారాయి. ఈ కారణంగానే భారత్ పాక్ ఉద్రిక్తతలు పెద్దగా ప్రభావం చూపలేదు. ఆరంభంలో ఓ నష్టాలు చవిచూసినప్పటికీ.. తర్వాత స్వల్ప శ్రేణిలో కదలాడిన చివరికి లాభాల్లో ముగిశాయి. పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత్ దాడులకు పాల్పడిందన్న వార్తల నేపథ్యంలో సెన్సెక్స్ ఉదయం 79,948.80 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై కాసేపటికే లాభాల్లోకి వచ్చింది. ఇంట్రాడేలో 80,844.63 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. 105.71 పాయింట్ల నష్టంతో 80,746.78 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 34 పాయింట్ల లాభంతో 24,414.40 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 41 పైసలు క్షీణించి 84.81గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా మోటార్స్, బజాజ్ ఫైనాన్స్, ఎటర్నల్, అదానీపోర్ట్స్, టాటా స్టీల్ షేర్లు లాభపడ్డాయి. ఏషియన్ పెయింట్స్, సన్‌ఫార్మా, ఐటీసీ, రిలయన్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 62 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా, బంగారం ఔన్సు ధర 3,383 డాలర్ల వద్ద కొనసాగుతోంది.



**పాక్ స్టాక్ మార్కెట్ కుదేల్:** మరోవైపు మన భద్రతా బలగాలు చేపట్టిన దాడుల కారణంగా పాక్ స్టాక్ మార్కెట్ కుదేలైంది. పాకిస్థాన్ స్టాక్ మార్కెట్ ఇండెక్స్ కరాచీ 100 ఆరంభంలో దాదాపు 6 శాతం నష్టంతో 6,272 పాయింట్లు పతనమైంది. తర్వాత కోలుకుంది. మన మార్కెట్లు ముగిసే సమయానికి 3470 పాయింట్ల నష్టంతో (3.09 శాతం) 110,063 పాయింట్ల వద్ద ట్రేడవుతోంది. పహల్గాం ఉగ్రదాడి ఘటన అనంతరం భారత్ నుంచి ఎప్పుడైనా ప్రతిఘటన ఎదురుకావొచ్చన్న అంచనాలతో ఇప్పటికే ఆ సూచి దాదాపు 3.7 శాతం మేర నష్టపోయింది. తాజా దాడితో మరో మాస్టర్ స్ట్రోక్ తగిలింది.

# ప్రభుత్వ రుణం దిగిరావాలి..




**న్యూఢిల్లీ, మే 7:** పెరిగిన ప్రభుత్వ రుణం మోస్తరు స్థాయికి దిగిరావాల్సి ఉందని కేంద్ర ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అజయ్‌దత్ అన్నారు. తద్వారా వడ్డీ చెల్లింపులు తగ్గుతాయని, అప్పుడే రేటింగ్ అప్‌గ్రేడ్ అవుతుందన్నారు. ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. అనిశ్చితులు పెరిగిపోతున్న నేపథ్యంలో భారత్ ఏదో ఒక నిర్ధిష్టమైన మార్గానికి పరిమితం కాకూడదన్నారు. 'మారుతున్న పరిణామాలకు మనం చురుగ్గా స్పందించాలి. నేడు భారత ఆర్థికవ్యవస్థ 4 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి సమీపించింది. మిగిలిన ప్రపంచవ్యాప్తంగా ఏం జరుగుతుందన్నది తెలుసుకునేంత సామర్థ్యం మనకు ఉంది. ఈ దిశగా మనదైన మార్గాన్ని గుర్తించాలి' అని వివరించారు. ప్రభుత్వ రుణం ప్రస్తుత స్థాయిల నుంచి కచ్చితంగా దిగిరావాలంటూ, అందుకు ద్రవ్య స్థిరీకరణను మార్గంగా పేర్కొన్నారు. దేశ జీడిపిలో పన్నుల వాటా దశాబ్దం క్రితం 16.5 శాతంగా ఉంటే, అది ప్రస్తుతం 18 శాతానికి చేరినట్లు అజయ్‌సేత్ తెలిపారు. ప్రస్తుత ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని చూస్తే, మరో 5-6యేళ్లలో 20 శాతానికి పన్నుల వాటా చేరుకోగలదన్నారు. వ్యయాల గురించి మాట్లాడుతూ, మూలధన వ్యయాలకు అనుకూలంగా తగిన సర్దుబాట్లు జరుగుతున్నట్లు చెప్పారు.

# ఐఫోన్లన్నీ ఇక భారత్‌లోనే తయారీ

**న్యూఢిల్లీ, మే 7:** ప్రస్తుత పరిస్థితుల్లో భారత్‌లో ఉత్పత్తి చేయడం ప్రతి కంపెనీకి ఆర్థికంగా ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని కేంద్ర టెలికం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా చెప్పారు. తాము అమెరికాలో విక్రయించబోయే అధిక శాతం ఐఫోన్లు భారత్‌లో తయారైనవే ఉంటాయంటూ టెక్ దిగ్గజం ఆపిల్ ప్రకటించడం ఇందుకు నిదర్శనమని ఆయన తెలిపారు. రాబోయే రోజుల్లో తమ మొబైల్ ఫోన్లు అన్నింటినీ భారత్‌లోనే తయారు చేయాలని, సోర్సింగ్ చేయాలని ఆపిల్ నిర్ణయించుకుంది. కాబట్టి భారత్‌లో ఇన్వెస్ట్ చేశారంటే విశ్వసనీయతను, సహజత్వాన్ని అఫోర్డబిలిటీని ఎంచుకున్నట్లే' అని భారత్ టెలికం కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మంత్రి చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం దన్నుతో దేశీయంగా టెలికం పరికరాల మార్కెట్ అనేక రెట్లు వృద్ధి చెందిందని ఆయన తెలిపారు. రూ.4వేల కోట్ల పెట్టుబడులనేవి రూ.80వేల కోట్ల విక్రయాలకు, రూ.16వేల కోట్లు విలువ చేసే ఎగుమతులతో పాటు 25వేల ఉద్యోగాల కల్పనకు దోహదపడినట్లు సింధియా చెప్పారు. జూన్ త్రైమాసికంలో అమెరికాలో విక్రయించే మెజారిటీ ఐఫోన్లు భారత్‌లో తయారైనవే ఉంటాయని టెక్ దిగ్గజం ఆపిల్ సిఇఒ టిమ్ కుక్ ఇదివరకే ప్రకటించారు. ఐప్యాడ్, మ్యాక్, ఆపిల్ వాచ్, ఎయిర్‌పాడ్స్ మొదలైనవి వియత్నాంలో తయారైనవి ఉంటాయని పేర్కొన్నారు. ఇతరత్రా దేశాల్లో విక్రయించే ఉత్పత్తులు మాత్రమే అత్యధికంగా చైనాలో తయారవుతాయని పేర్కొన్నారు. చైనా నుంచి దిగుమతయ్యే ఉత్పత్తులపై అమెరికా భారీగా టారిఫ్‌లు ప్రకటించిన నేపథ్యంలో కుక్ వ్యాఖ్యలు



ఇటీవల ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కొంత మినహాయింపులున్నా, వివిధ టారిఫ్‌లను కలిపితే చైనానుంచి ఎగుమతి చేసే తమఉత్పత్తులపై ఏకంగా 145 శాతం సుంకాలు వర్తిస్తాయని కుక్ తెలిపారు.

# ఆ పోస్టులు అస్సలు నమ్మవద్దు..

**న్యూఢిల్లీ, మే 7:** ఇటీవల సోషల్ మీడియాలో ఓ పోస్టు వైరల్ అవుతోంది. ఏటీఎంలో బ్యాంకు డెబిట్ కార్డును పెట్టే ముందు రద్దు చేయి బటన్‌ను రెండు సార్లు నొక్కితే మోసాల బారిన పడకుండా ఉండొచ్చని దాని సారాంశం. ఏటీఎంలో లావాదేవీలు నిర్వహించే ముందు మెషీన్‌లోని రద్దు చేయి అనే బటన్ రెండు సార్లు నొక్కితే మంచిదని ఇటీవల సోషల్ మీడియలో ఓ పోస్టు వైరల్ అవుతోంది. అది రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా విడుదల చేసినట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో చాలా మంది వినియోగదారులు దాన్ని నిజమనుకుంటున్నారు. ఏటీఎం వద్దకు వెళ్లినప్పుడు అలాగే చేస్తున్నారు. అసలు ఇది నిజమేనా అనే సందేహాన్ని కొందరు వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియా పోస్టు నేపథ్యంలో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూర్ (పీఐబీ) రంగంలోకి దిగింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పోస్టును పరిశీలించింది. అనంతరం అది నకిలీ పోస్టుగా తేల్చింది. ఏటీఎం మెషీన్‌లో అలా చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని వెల్లడించింది. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆ పోస్టు చేయలేదని కూడా తేల్చి చెప్పింది. సైబర్‌నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఏటీఎంవద్ద అపరిచితులను నమ్మవద్దని హెచ్చరించింది. ఆధునిక కాలంలో పెరిగిన సాంకేతికతతో బ్యాంకు లావాదేవీలు చాలా సులువుగా జరుగుతున్నాయి. గతంలో డబ్బులను తీసుకోవాలంటే ఉదయాన్నే బ్యాంకుకు వెళ్లాల్సి వచ్చేది. అక్కడ లైన్‌లో నిలబడి మన వంతు వచ్చాక డబ్బులను తీసుకునేవాళ్లం. ఈ పని చేయడానికి దాదాపు ఒకపూట సమయం పట్టేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. ప్రతిఊరిలోనూ ఏటీఎంలువచ్చేశాయి. ఏ సమయంలోనైనా అక్కడకు వెళ్లి చాలా సులువుగా డబ్బులు తీసుకోవచ్చు.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.